www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 07 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ మార్గశిర శుద్ధ ద్వాదశి
05-11 డిసెంబర్ 2022
వెల : ₹15/-



## మాకొద్దీ హిజాబ్!

ఈ చిన్న వస్త్రం చుట్టూ అల్లుకున్న సంప్రదాయం 2022 సంవత్సరాన్ని పెద్ద వివాదానికి వేదికను చేసి చరిత్రపుటలలోకి తీసుకుపోయింది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.


75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక





# గిరిజన జీవిత చిత్రానికి కొత్త రూపు


**భా**రతీయ జీవనంలో, సంస్కృతిలో గిరిజనుల స్థానం అమూల్యమైనది. వారి చరిత్ర సంస్కృతుల చరిత్రను పునర్ నిర్మించే పనిని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ కేంద్ర ప్రభుత్వంతో కలసి ఆరంభిస్తున్నది. ఈ అంశం గురించి ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో నిపుణులు చర్చించారు. వారి జీవనం, ఆరోగ్య రక్షణ, స్వీయరక్షణ ఇవన్నీ ఎంతో ప్రత్యేకమైనవని, వారి జీవనమే ఒక జ్ఞాన నిధి అని రాష్ట్రపతి అన్నారు. ఈ సందర్భంగా గిరిజనోద్యమాలలో పాల్గొని బలిదానాలు చేసిన వారి గురించి రాసిన ఒక పుస్తకం కూడా రాష్ట్రపతి విడుదల చేశారు. నిజానికి ఆమె నవంబర్ 16న ఇదే ధ్యేయంతో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఏర్పాటు చేసిన గిరిజన ప్రదర్శనశాలను సందర్శించారు. అక్కడ ప్రదర్శించిన సాంస్కృతిక చిహ్నాలు ఒక అద్భుతం. రాష్ట్రపతి ముర్ము ప్రదర్శనశాలను సందర్శించినప్పటి చిత్రాలు ఇవి.








## ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
## చైతన్యం నింపే వ్యాసాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
## ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.




రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

**ఏప్రిల్ 1, 2023 తేదీ నుండి జాగృతి వార్షిక, 5 సంవత్సరాల చందా పెరగనున్నది. ఆ లోగా చందా కట్టేవారికి పాత ధరలే వర్తిస్తాయి**

**త్వరపడండి...**

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో పంపుటకు కిందనున్న క్యు.ఆర్. కోడ్‌లను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి.. లేదా లింక్ ద్వారా చందా చెల్లించండి!

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

‘కమ్యూనిజం అంటే ప్రేమ కాదు. కమ్యూనిజం అంటే, సుత్తి. శత్రువును అణచివేయడానికి దానిని మనం ఉపయోగిస్తాం’ అన్నాడట మావో. అలనాటి ఈ చైనా నియంతకి తన పార్టీ గుర్తులో కొడవలితో పాటు కనిపించే సుత్తి ఇచ్చిన ప్రేరణతో ఇలా చెప్పాలని అనిపించిందో, లేదంటే కమ్యూనిజాన్ని ఆశ్రయించిన తరువాత ప్రేమగుణం ఇంకిపోవడం రివాజేనని గుర్తు చేయడానికి చెప్పాడో ఆయన, మొత్తానికి గొప్ప సత్యం చెప్పాడు. కమ్యూనిజం పేరుతో చెలామణి అవుతున్న వ్యవస్థలలో అది నిత్య సత్యమే కూడా. ఇవాళ కమ్యూనిస్టు చైనాలో జరుగుతున్న అలజడి, అణచివేతలు ఆ విషయాన్ని మరొకసారి రుజువు చేస్తున్నాయి.

చైనాలోనే ఊహాన్ అనే నగరం కరోనా వైరస్‌కి జన్మనిచ్చిందని ఏడాది క్రితం వరకు కూడా ప్రపంచమంతా గగ్గోలుగా ఉండేది. ఆ ఆరోపణల అలజడి అందులోని వేడి కాస్త సద్దుమణిగిందేమో కానీ, ఇప్పటికీ అందరూ గట్టిగా నమ్ముతున్నది అదే. కానీ కరోనా వైరస్‌కి పుట్టింటి మమకారం చావడం లేదు. దాంతో ప్రపంచమంతా మాస్క్‌లు కూడా అవతలపారేసి స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటే చైనా ప్రజానీకం మాత్రం ఇప్పటికీ లాక్‌డౌన్ సంకెళ్లలోనే మగ్గిపోతోంది. దాదాపు ప్రపంచమంతా కరోనా పీడ వదిలి స్వేచ్ఛగా సంచరిస్తోందనే చెప్పాలి. కానీ చైనా మాత్రం కొవిడ్‌తో సహ జీవనం చేస్తూనే ఉంది. అసలే లాక్‌డౌన్. ఆపై పని లేదు. దీనికి తోడు జీ జిన్‌పింగ్ తాత్కాలికంగా సుత్తికి విశ్రాంతినిచ్చి సమ్మెట తీసుకుని ‘జీరో కొవిడ్’ అనే విధానపు పోటు వేశాడు. వీటన్నిటి ఫలితమే ఇవాళ్టి జనాందోళన. ఇది మూడున్నర దశాబ్దాల క్రితం జరిగిన తియానాన్మెన్ స్క్వేర్ తిరుగుబాటును గుర్తుకు తెస్తున్నదని ప్రపంచ మీడియా చెబుతోంది. కారణాలు ఏమిటో తెలియదు కానీ, నవంబర్ 28వ తేదీన అక్కడ ఒకే రోజు 40,000 కొత్త కొవిడ్ కేసులు నమోదైనాయి. అంతకు ముందు రోజు కూడా 38,504 కేసులు నమోదయ్యాయి. బీజింగ్‌లో అయితే అప్పటికి ఐదురోజులుగా నిత్యం 4000 కేసులు నమోదయ్యాయి. చావులు మాత్రం

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ మార్గశిర శుద్ధ ద్వాదశి**

### లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**మా కొద్దీ హిజాబ్!** 6లో

జాతీయం
**అదొక నిశ్శబ్ద మారణహోమం** 11లో






ధారావాహిక నవల
**ఆనందమఠం**
– బంకించంద్ర చటర్జీ 20లో

# జాగృతి

## సంపాదకీయం

పరిమితంగానే ఉన్నాయి. అంటే వైరస్ తీవ్రత తగ్గలేదు, తగ్గుముఖం పట్టడం లేదు. లాక్‌డౌన్ కారణంగా 42.2 కోట్ల మంది ప్రజలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

ఈ ఘోర పరిస్థితిని కూడా జనం కిమ్మనకుండా భరిస్తూ ఉండగానే నవంబర్ 24న ఉరిమ్కిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఇదే కొత్త అలజడికి ఆజ్యం పోసింది. ఒక అపార్ట్‌మెంట్‌లో వ్యాపించిన జ్వాలల వల్ల పదిమంది మరణించారు. వారిని రక్షించాలని సాధారణ ప్రజలతో పాటు, అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించినా సాధ్యం కాలేదు. కారణం, కొవిడ్ ఆంక్షలు. అంటే చైనా సాధారణ ప్రజానీకాన్ని

## కమ్యూనిజం... కరోనా

కరోనా చంపలేదు కాని, కమ్యూనిస్టు ప్రభుత్వం మాత్రం ఆంక్షలు పెట్టి చచ్చేటట్టు చేసింది. ఆ మరునాటి నుంచి కొవిడ్ నిబంధనలకు వ్యతిరేకంగా ఆందోళన మొదలయింది. బీజింగ్‌తో పాటు షాంఘై, ఊహాన్, లాంఘౌ ఇతర నగరాలలో కూడా పెద్ద ఎత్తున ప్రజలు వీధులకెక్కి కొవిడ్ నిబంధనలు ఇంకానా, ఇకపై సాగవని నినదిస్తున్నారు. నవంబర్ 26 ప్రాంతం నుంచి పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులు కూడా ఆందోళనలో భాగస్వాములయ్యారు. దేశంలో తమకు ఎలాంటి స్వేచ్ఛ లేదని చెప్పడానికి యువకులు, విద్యార్థులు ఇప్పుడు తెల్లకాగితాల ఉద్యమం ఆరంభించారు. అంటే తమ దుస్థితిని తెలియచేస్తూ వారు తెల్లకాగితాలు చూపిస్తున్నారు. ఇది దేశమంతటా కార్చిచ్చులా వ్యాపించిందని వార్తలు వచ్చాయి. చాలాచోట్ల జీ జింగ్‌పింగ్ రాజీనామా చేయాలంటూ బ్యానర్లు కూడా వెలిశాయి. ఇది చాలు, చైనీయులలో ప్రస్తుత కమ్యూనిస్టు ప్రభుత్వం మీద, దాని నేతల మీద ఎంత ఆగ్రహం ఉన్నదో చెప్పడానికి. ఇంత జరిగిన తరువాత మొత్తానికి చైనా ప్రభుత్వం ఇందులో కాస్త నిజం లేకపోలేదని ముక్తాయించింది. 'జనంలో కాస్త వ్యతిరేకత ఉండవచ్చు. అందుకే క్షేత్రస్థాయిలో పరిస్థితులకు తగ్గట్టు జీరో కొవిడ్ విధానంలో మార్పులు తెస్తున్నాం' అని విదేశ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి లీ జియాన్ చెప్పక తప్పలేదు. అయితే మీడియా చెబుతున్నంత తీవ్ర నిరసనలేవీ లేవని మాత్రం కొట్టి పారేశారు. ఇంత జరిగినా, అధికార పత్రిక పీపుల్స్ డైలీ కరోనా నిర్మూలనకు కఠినంగా వ్యవహరించక తప్పదనే తేల్చింది.

కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాలు అసమ్మతిని ఎంత క్రూరంగా అణచివేస్తాయో ప్రత్యేకంగా చెప్పక్కరలేదు. ఇప్పుడు కూడా చైనా తన పాత అణచివేత శైలులను అటక దింపి నిర్మొహమాటంగా ప్రయోగిస్తున్నది. పోలీసులు వేలమందిని అరెస్టు చేస్తున్నారు. బీబీసీ జర్నలిస్ట్ ఎడ్ లారెన్స్‌ను నిర్బంధించి చావగొట్టారు. ఆందోళనలు విస్తరిస్తూనే ఉన్నాయి. నవంబర్ 28 నాటికి మొత్తం 49 నగరాలలో ప్రజలు ఆందోళన బాట పట్టడం కనిపించింది. అంటే నాలుగింట ఒక వంతు ప్రజానీకం ఇప్పుడు తిరుగుబాటు బావుటాలు ధరించారు. చైనా ప్రభుత్వాధినేతల మీద, కమ్యూనిజం వాళ్లలో తెచ్చిన జడత్వం గురించి ప్రజానీకం మండిపడుతోంది. బీజింగ్ సరిహద్దులలోనే ఒక ఫ్లయోవర్‌కు కట్టిన బ్యానర్‌లోని అంశాలు కొవిడ్ వేళలోనే కాదు, కొవిడ్ ముందు నాటి కమ్యూనిస్టులు ప్రభుత్వ నిర్వాకాల గురించి గొప్పగా చాటాయి. 'కొవిడ్ పరీక్షలు కాదు, ఆహారం కావాలని చెప్పండి', 'లాక్‌డౌన్ వద్దు', 'సాంస్కృతిక విప్లవాలు వద్దు–సంస్కరణలు కావాలి', 'స్వేచ్ఛ కావాలి– అబద్ధాలు కాదు', 'బానిసగా ఉండవద్దు, పౌరుడిగా ఉండు' వంటి నినాదాలే అవన్నీ. మరొకచోట 'సమ్మె కట్టండి. నియంత, జాతిద్రోహి జీ జింగ్‌పింగ్‌ను తొలగించండి' అన్న నినాదంతో కూడా బ్యానర్ కనిపించింది. అంటే కరోనాతో పాటు కమ్యూనిజం కూడా పోవాలనే ప్రజలు కోరుకుంటున్నారని అనుకోవాలేమో! ★

05 డిసెంబర్ 2022, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**మహాలక్ష్మి**

– సి. హెచ్. శివరామప్రసాద్






| | | |
|---|---|---|
| భైంసా వెళ్లాలంటే వీసా కావాలా? (తెలంగాణ) | – | 14 |
| రవాణా రంగానికి ప్రోత్సాహమేది? (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| ఏడుతరాల శనికి 'సర్దార్' చరమగీతం (అమృతోత్సవాలు) | – | 23 |
| కాశీ క్షేత్రాన తమిళ సంగమం (సంస్కృతి) | – | 28 |
| ప్రాణిప్రేమికా 'పూర్ణ' (మహిళ) | – | 36 |
| విశ్వ క్రీడా సమరం! (క్రీడ) | – | 43 |
| బాలజాగృతి | – | 46 |
| 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం'! (సినిమా) | – | 50 |



హిజాబ్:

శిరోజాలూ, మెడ కనిపించకుండా ముస్లిం బాలికలు, యువతులు ధరించే ఒక వస్త్రం. ఈ చిన్న వస్త్రం చుట్టూ అల్లుకున్న సంప్రదాయం 2022 సంవత్సరాన్ని పెద్ద వివాదానికి వేదికను చేసి చరిత్రపుటలలోకి తీసుకుపోయింది. మత ప్రమేయం లేని భారతదేశంలో జనవరి, 2022లో హిజాబ్ ఒక అలజడిని సృష్టించింది. అది ముస్లిం మహిళకు అనివార్యమైన మత చిహ్నమని, ధరించక తప్పదంటూ కర్ణాటకలోని

# మాకొద్దీ

హిజాబ్ ఆకృతి, ఆచరణలో ముస్లిం ప్రపంచమంతా ఏకరూపంలో కనిపించడం లేదు. దీనికి ఇస్తున్న నిర్వచనాలు కూడా వేర్వేరుగా ఉన్నాయి. హిజాబ్ ధరించడం వల్ల ఆ వర్గ స్త్రీల సౌందర్యం మరుగున ఉండి, వారు దాడులకు గురికాకుండా కాపాడుతుందని కొన్ని భాష్యాల వల్ల తెలుస్తుంది. హిజాబ్‌కు అనుకూలంగా ఉడిపి (కర్ణాటక) ముస్లిం బాలికలు లేవదీసిన వివాదం తరువాత, ఇరాన్ మహిళల తిరుగుబాటు మొదలయింది. కర్ణాటకలో తీవ్రమైన మత భావన కనిపిస్తే, ఇరాన్‌లో మత భావనలోని తీవ్రతను నిరాకరిస్తున్న పరిణామం కనిపిస్తుంది. మొదటిది ఛాందసవాదంలోకి చొచ్చుకుపోవడానికి ఆరాటం. ఇంకొకటి ఛాందసవాదం నుంచి విముక్తికి పోరాటం. మహసా అమిని (ఈమెను జినా అమిని అని కూడా పిలుస్తారు) అనే 22 ఏళ్ల యువతిని 'ప్రభుత్వ నిబంధనల మేరకు' హిజాబ్ ధరించలేదన్న కారణంతో ఇరాన్ 'మొరాలిటీ పోలీసులు' టెహ్రాన్‌లో నిర్బంధంలోకి తీసుకోవడం, సెప్టెంబర్ 16న ఆమె పోలీసు కస్టడీలోనే మరణించడంతో ఒక్కసారిగా ఇరాన్‌లో హిజాబ్ వ్యతిరేక ఆందోళన పతాకస్థాయికి చేరుకుంది. ఈ ఆందోళన క్రమంగా ఇతర దేశాలకు వ్యాపించడం వర్తమాన చరిత్ర. గత 40 ఏళ్లుగా ఇరాన్‌లో మహిళలు తీవ్ర వివక్షను ఎదుర్కొనడానికి, ఛాందసవాద ప్రభుత్వాలు అనుసరిస్తున్న అణచివేత విధానాలే ప్రధాన కారణం.



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

ఇరాన్ రాజ్యాంగం మహిళలను పురుషుల్లో అర్ధభాగంగా పరిగణిస్తుంది. గతంలో దక్షిణ అమెరికాలోని రాష్ట్రాల్లో నల్లజాతి బానిసలను ఒక వ్యక్తిలో 2/3వ వంతుగా పరిగణించేవారు. ఇరాన్‌లో ప్రస్తుత మహిళల దుస్థితిని, నాటి అమెరికాలోని నల్లజాతి బానిసల స్థితితో పోల్చవచ్చు. 1979లో ఇస్లామిక్ విప్లవం తర్వాత, కొత్త ప్రభుత్వం దేశంలో ఇస్లామిక్ చట్టాలను అమల్లోకి తెచ్చింది. ఇస్లామిక్ పీనల్ కోడ్, 5వ పుస్తకంలోని 638వ అధికరణ ప్రకారం హిజాబ్ ధరించని మహిళలకు పదిరోజుల నుంచి రెండు నెలల వరకు జైలుశిక్షతో పాటు 50వేల నుంచి 5లక్షల రియాల్స్ వరకు జరిమానా విధించవచ్చు. పరిస్థితిని బట్టి ఈ రెండింటిలో ఒకటి లేదా రెండు శిక్షలూ విధించే అవకాశం ఉంది. 1979 విప్లవానికి ముందు మహమ్మద్ రెహజా పహ్లవి పాలనాకాలంలో మహిళలు తప్పనిసరిగా హిజాబ్ ధరించాలన్న నిబంధన ఉండేదికాదు. ఐచ్ఛికంగా కొందరు తలపై ఛదర్‌ను ధరించేవారు. ప్రస్తుతం ఇరాన్‌లో హిజాబ్ వ్యతిరేకత బాగా పెరిగిపోయింది. 2020లో నిర్వహించిన ఒక సర్వేలో 58% మంది ఇరానియన్లు హిజాబ్ పట్ల విశ్వాసం ప్రదర్శించలేదు. 72% మంది హిజాబ్ తప్పనిసరిగా ధరించాలన్న నిబంధనను వ్యతిరేకించారు. కేవలం 15% మంది బహిరంగ ప్రదేశాల్లో హిజాబ్ ధరించాలన్న అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం.

## గర్ల్ ఆఫ్ యెంఘ్‌లాబ్ స్ట్రీట్

2017-18 సంవత్సరంలో ఇరాన్‌లో ప్రజాస్వామ్య ఉద్యమం పెద్ద ఎత్తున చోటుచేసుకుంది. ఈ సందర్భంగా విదా మొవహెద్ అనే పేరు గల మహిళ 2017, డిసెంబర్ 27న టెహ్రాన్‌లోని యెంఘ్‌లాబ్ స్ట్రీట్ (రివల్యూషన్ స్ట్రీట్)లో ఒక తెల్లని హిజాబ్‌ను ఒక కర్రకు కట్టి దాన్ని జెండా మాదిరిగా ఊపుతూ, అక్కడ పెద్దసంఖ్యలో గుమికూడిన ప్రజలను ఉత్సాహపరచింది. అప్పటి నుంచి ఈమెను 'గర్ల్ ఆఫ్ యెంఘ్‌లాబ్ స్ట్రీట్' అని పిలవడం మొదలుపెట్టారు. ఆరోజు ఆమెను పోలీసులు అరెస్ట్ చేసినా, నెల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చింది. అయితే మొవహెద్ ఈ చర్య వెనుక, ఇరానియన్-అమెరికన్ జర్నలిస్టు మసిహ్ అలెనిజాద్ 'వైట్ వెన్స్‌డేస్' పాటించాలని ఇచ్చిన పిలుపు స్ఫూర్తిదాయకమైనదని చెబుతారు. కాగా 2022లో మొహసా అమిని మరణంతో ఈ నిరసనలు ఉధృతం కావడం తాజా పరిణామం.

## రైసీ ఇచ్చిన ఆదేశాలతో రావణకాష్టం

గతంలో ఇరాన్ న్యాయవ్యవస్థకు అధినేతగా పనిచేసిన ఇబ్రహీం రైసీ 2021, ఆగస్ట్ 3వ తేదీ నుంచి ఆ దేశ అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. ఇరాన్ 8వ అధ్యక్షుడిగా పదవిలో కొనసాగుతున్న ఈయన ముస్లిం పండితుడు మాత్రమే కాదు, ఛాందసవాది. హిజాబ్‌ను మహిళలు తప్పనిసరిగా ధరించాలంటూ ఈయన ఇచ్చిన ఆదేశాలు ఇరాన్‌ను రావణకాష్టంగా మార్చాయి. హిజాబ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చే ముందు ఇబ్రహీం రైసీ దేశ ప్రజల ఆలోచనా సరళిని అంచనా వేయడంలో తప్పటడుగు వేశారు. ముఖ్యంగా దేశ ప్రజల్లో 30 ఏళ్లకు అటూ ఇటూ వయసున్న వారి సంఖ్య అత్యధికం. వీరంతా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ,

ఉడిపిలో ఆరుగురు విద్యార్థినులు కోరడంతో వివాదం మొదలయింది. కానీ హిజాబ్ ధారణ ఇస్లాంలో తప్పనిసరి కాదనీ, విద్యార్థినులు యూనిఫారాలు ఉపయోగించవలసిందేననీ హైకోర్టు తేల్చి చెప్పింది. తాము చదువు కంటే మత చిహ్నం ధరించడానికే ప్రాధాన్యం ఇస్తామని ఆ విద్యార్థినులు మంకు పట్టు పట్టారు. ఈ వివాదం నడుస్తూ ఉండగానే ఇస్లామిక్ దేశమైన ఇరాన్‌లో తాము హిజాబ్ ధరించబోమని ప్రకటించి, శిరస్సు మీద ఉన్న ఆ వస్త్రాన్ని దహనం చేయడం ఆరంభించారు మహిళలు. ఇప్పుడు ఈ వివాదం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నది. హిజాబ్ ధరించబోమంటూ ఉద్యమించిన మహిళల మీద, ఇతర సామాజిక కార్యకర్తల మీద, విద్యార్థినుల మీద ఇరాన్ ప్రభుత్వం తూటాల వర్షం కురిపిస్తోంది. మరణదండనలకు సిద్ధపడుతోంది. ప్రభుత్వం, పార్లమెంటు కూడా హిజాబ్‌ను సమర్థిస్తున్నాయి. ప్రజానీకం పోరాటం కొనసాగిస్తూనే ఉంది.



మహసా అమిని

# హిజాబ్!

ప్రపంచంలో ఏకాకిగా మిగిలిన దేశంలో పూర్తి కట్టుబాట్ల మధ్య పెరిగారు. వీరిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పట్ల మక్కువ, విదేశాలతో సంబంధాలు కొనసాగించాలన్న ఆకాంక్ష మెండు. కానీ రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంస్థలపై నిషేధం, మీడియాపై ఆంక్షలు, టెలివిజన్ ఛానళ్లను నిలువరించడం వంటి ప్రభుత్వ చర్యలను వీరు సహిస్తూ వస్తున్నారు.

ప్రస్తుతం ఇరాన్‌లో హిజాబ్‌ను బహిరంగంగా వ్యతిరేకించడానికి ఏ మత పెద్ద సాహసించడు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా హిజాబ్ విషయంలో కొంత వెసులుబాటు ఇవ్వవచ్చునని కొందరు మతపెద్దల అభిప్రాయం. కొన్నేళ్ల క్రితం మోహసేన్ ఘరావియన్ అనే మత పెద్ద ఇరాన్‌కు వచ్చే పర్యాటకులపై హిజాబ్‌ను ధరించాలని వత్తిడి తీసుకొని రాకూడదని చెప్పి అప్పట్లో పతాక శీర్షికల్లో నిలిచారు.

నిజం చెప్పాలంటే హిజాబ్ సమర్థకులు ఉన్నట్లే, వ్యతిరేకించేవారూ ఉన్నారు. మొత్తంమీద వర్తమాన ఇరాన్ పరిస్థితి చెప్పాలంటే హిజాబ్‌ను తప్పనిసరి చేయడం ద్వారా ప్రత్యర్థులను నిర్వీర్యం చేసి, రాజకీయంగా దేశంపై మరింత పట్టు సాధించా లన్న ప్రభుత్వ ఉద్దేశం వెల్లడవుతోంది. అంతేకాదు ఇక్కడ వస్త్రధారణ, మతం అనే అంశాలను పక్కన పెడితే మహిళలను నియంత్రణలో ఉంచడం ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఏది ఏమైనా హిజాబ్ సమస్య మహిళలను కేంద్ర స్థానంలో నిలిపిందనడంలో సందేహం లేదని ఇరానియన్ – కెనడియన్ స్త్రీవాద రచయిత నజ్లీ కమ్‌వరీ వ్యక్తం చేసిన అభిప్రాయం సముచితమైనదే. మరో అంశం– హిజాబ్ సమస్య ఇరాన్‌లో మహిళలు ఎదుర్కొంటున్న ఇతర వివక్షలను కూడా బయటి ప్రపంచానికి తెలిసేలా చేసింది. కానీ హిజాబ్ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేసేందుకు చైనా మాదిరిగా తమ దేశ ప్రజలపై ఎలక్ట్రానిక్ నిఘా పెట్టాలని ప్రభుత్వం తలపోస్తున్నది. తాను కచ్చితంగా అమలు చేయాలనుకుంటున్న సామాజిక, మతపరమైన నిబంధనల ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అగాధం పెరుగుతున్నదన్న సత్యాన్ని రైసీ గుర్తించడంలేదు.

### ఆలస్యంగా స్పందించిన పశ్చిమ దేశాలు

ఇప్పటికే భిన్న ధ్రువాలుగా ఉన్న పశ్చిమ దేశాలతో సహా ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలు ఇరాన్ సమస్యపై చాలా ఆలస్యంగా స్పందించాయి. పాశ్చాత్య మీడియా కూడా ఇరాన్‌లో మహిళల నిరసన ప్రదర్శనలను, హిజాబ్‌లను తగులబెట్టే దృశ్యాలను ప్రచురించినప్పటికీ అక్కడ మహిళల హక్కుల కోసం జరిపే పోరాటానికి దన్నుగా నిలిచేందుకు ఇది మాత్రమే సరిపోదు. తాము ఏ దుస్తులు ధరించాలి? ఎవరిని ప్రేమించాలి? ఏ విధంగా ప్రవర్తించాలి? వంటి అంశాలను ప్రభుత్వాలే నిర్ణయిస్తుండటం ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో ఆగ్రహావేశాలకు కారణమవుతోంది. ప్రస్తుతం ఇరాన్ మహిళలు రోడ్డెక్కడానికి ప్రభుత్వ వైఖరే కారణమన్నది ఇక్కడ గుర్తించాల్సిన సత్యం. ఫ్రాన్స్‌లో బురఖాని, భారత్‌లో హిజాబ్‌ను నిషేధించినప్పుడు, అమెరికాలో అబార్షన్‌ను చట్టవిరుద్ధం చేసినప్పుడు గట్టిగా విమర్శించిన ఫెమినిస్టులు, ఇరాన్ మహిళల విషయంలో తమ గళాన్ని మరింత కఠినంగా, బిగ్గరగా వినిపించకపోవడం విచిత్రం!

### సూడో లిబరల్స్ రెండు నాల్కల ధోరణి

ఇక మనదేశంలో సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్నామని చెప్పుకునేవారు ఇరాన్‌లో హిజాబ్ వ్యతిరేక ఉద్యమంపై ఎందుకు పెద్దగా స్పందించడం లేదు? వీరి మౌనానికి కారణమేంటి? కళాశాలల తరగతి గదుల్లో హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసినప్పుడు, ఈ సామాజిక పోరాటవాదులు 'ఐచ్ఛికం' అనే వాదనకు మద్దతు నిచ్చారు. మరి వీరు ఇరాన్ మహిళల పోరాటంపై ఎందుకు పెదవి విప్పరు? ఇది వారి రెండు నాల్కల ధోరణికి నిదర్శనం కాదా? పురుషాధిక్య సమాజంపై పోరాటం చేస్తున్నామని డప్పులు కొట్టి ప్రచారం చేసుకునేవారు.. అన్ని వర్గాలు, మతాల్లోని మహిళలకు అనుకూలంగా పోరాటాలు చేయాలి. అంతేకాని ఇతర రాజకీయ ఉద్యమాలు 'హైజాక్' చేస్తాయన్న భయంతో వ్యవహరించకూడదు.

ఇరాన్‌లో మహిళలు హిజాబ్‌కు వ్యతిరేకంగా

> **ఇరాన్‌లో మహిళలు హిజాబ్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తుంటే, భారత్‌లో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. మనదేశంలోని ముస్లిం మహిళలు హిజాబ్‌పై భారత ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. తమను తాము మేధావులుగా చెప్పుకుంటున్న సూడో లిబరల్స్.. మోదీ నేతృత్వంలోని జాతీయవాద ప్రభుత్వం దేశంలోని 200 మిలియన్ల ముస్లింలకు వ్యతిరేకంగా హింసను రెచ్చగొడుతుందని వాదించడంలో పెద్ద విశేషమేం లేదు.**

ఉద్యమాలు చేస్తుంటే, భారత్‌లో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. మనదేశంలోని ముస్లిం మహిళలు హిజాబ్‌పై భారత ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. తమను తాము మేధావులుగా చెప్పుకుంటున్న సూడో లిబరల్స్.. మోదీ నేతృత్వంలోని జాతీయవాద ప్రభుత్వం దేశంలోని 200 మిలియన్ల ముస్లింలకు వ్యతిరేకంగా హింసను రెచ్చగొడుతుందని వాదించడంలో పెద్ద విశేషమేం లేదు. కానీ 'భారత్‌లో హిజాబ్‌కు మద్దతు, ఇరాన్‌లో హిజాబ్‌కు వ్యతిరేకం' అన్నట్టుగా ఉన్న వారి వ్యవహారశైలి, తమలోని ద్వంద్వ వైఖరిని బట్ట బయలు చేస్తోంది. ఇదే సమయంలో మనదేశంలోని జాతీయవాద ప్రభుత్వ మద్దతుదార్లు ఇరాన్ మహిళల ఆందోళనకు తమ మద్దతు తెలుపుతున్నారు. ఎవరు ఎన్ని విధాలుగా చెప్పినా లెఫ్ట్ లేదా రైట్ మహిళలు స్పష్టం చేసేది మాత్రం ఒక్కటే, 'హిజాబ్ కాదు ఇక్కడ ముఖ్యం. మా ఐచ్ఛికం అనేది కీలకం'.

ఈ జనవరిలో కర్ణాటక రాష్ట్రంలో; ప్రస్తుతం ఇరాన్‌లో జరిగిన హిజాబ్ నిరసనలు దానిని ధరించాలా వద్దా అన్న విషయాన్ని మహిళలకే వదిలేయాలన్న సత్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. కర్ణాటకలో మాదిరిగా కాకుండా, ఇరాన్‌లో సమస్య హిజాబ్, మతాన్ని దాటిపోయాయనే చెప్పాలి. ఎందుకంటే మహసా అమిని మృతికి కారణమైన మొరాలిటీ పోలీసు విభాగ అధినేతను సస్పెండ్ చేసినా, ఈ యువతి మృతిపై విచారణకు రైసీ ఆదేశాలు జారీచేసినా మహిళల ఆందోళన పెరిగిందే తప్ప తగ్గుముఖం పట్టలేదు. డజన్ల కొద్దీ నగరాల్లో ఆందోళనల ఉధృతి పెరగడమే కాదు ప్రాణనష్టం కూడా జరిగింది. అల్లర్లు ఐదో వారంలోకి ప్రవేశించిన సమయానికి మరణాలు 233కు చేరాయి. ఇది అక్టోబర్ నాటి లెక్క. అంటే అమిని మృతి ఇరాన్ మహిళల్లో నెలకొన్న అసంతృప్తి, ఆగ్రహావేశాలు హింసాత్మక రూపం దాల్చడానికి ఒక ఉత్ప్రేరకంగా ఉపయోగపడ్డాయనే చెప్పాలి. 15,000 మందిని అరెస్టు చేసినట్టు అల్ జజీరా టీవీ చానల్ కూడా వెల్లడించింది. వీరందరికీ మరణ దండన విధిస్తారన్న కథనాలు ఇప్పుడు కలకలం సృష్టి స్తున్నాయి. కానీ దీనిని నమ్మడం సాధ్యం కాదని చాలా మంది దేశాధినేతల అభిప్రాయం.

2009లో జరిగిన ఇరాన్ అధ్యక్ష ఎన్నికల ఫలితాలకు వ్యతిరేకంగా మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనను ఇవి తలపునకు తెస్తున్నాయి. హిజాబ్ వివాదం ఎప్పటినుంచో ఇరాన్ మహిళల్లో ఇస్లామిక్ ప్రభుత్వం పట్ల ఉన్న అసంతృప్తిని ఒక్కసారిగా విస్ఫోటం చెందేలా చేసింది. అంతేకాదు ఇరాన్ అధినేత 83 ఏళ్ల అలీ ఖమైనీ అధికారం నుంచి వైదొలగాలన్నది ప్రస్తుతం మహిళల ప్రధాన డిమాండ్. ప్రభుత్వం సహజంగానే ఆందోళనలను కఠినంగా అణచివేస్తున్న తీరు, 2019 నాటి పరిస్థితిని గుర్తుకు తెస్తున్నది. అప్పట్లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై పూర్తిస్థాయి ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షల ఒత్తిడి నుంచి తట్టుకోవడానికి ఏకపక్షంగా ఇరాన్ ప్రభుత్వం పెట్రోలు ధరలను 50 శాతం వరకు పెంచేసింది. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయి. అప్పటి అధ్యక్షుడు హస్సన్ రౌహానీ ఆందోళనలను కఠినంగా అణచివేసే ప్రక్రియలో 321 మంది అసువులు బాసారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. 2019లో మాదిరిగానే నేడు కూడా మహిళలతో సహా సాధారణ ఇరానియన్లు పోలీసుల దాష్టీకానికి బలవుతున్నారు. పశ్చిమ దేశాలతో ఇరాన్ అణుచర్చలు జరుపుతున్న సమయంలో ఈ ఆందోళనలు చెలరేగడం ఇక్కడ కీలకాంశం. డొనాల్డ్ ట్రంప్ విధించిన ఆంక్షల్లో కొన్నింటిని జో బైడెన్ సడలించడంతో ఊపిరి పీల్చుకున్న ఇరాన్, ప్రస్తుత అణుచర్చల్లో తేడా వస్తే మళ్లీ ఆంక్షలను ఎదుర్కోక తప్పదు. అంతేకాకుండా ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు డ్రోన్లను సరఫరా చేయడం కూడా అణుచర్చలకు మరో ప్రధాన అడ్డంకి. ఒకవేళ మళ్లీ పశ్చిమ దేశాలు ఆంక్షలు విధిస్తే ఆర్థికంగా ఇరాన్ ఏకాకి కావడం ఖాయం. కానీ దీని దుష్ఫలితాన్ని స్పష్టంగా అనుభవించేది మాత్రం సాధారణ ఇరానియన్లు మాత్రమే.

**ఇరాన్ ప్రజల్లో వచ్చిన మార్పు**

నలభయ్యేళ్ల క్రితం 98.2% ఇరానియన్లు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆవిర్భావానికి రిఫరెండమ్ ద్వారా



## హిజాబ్

1936, జనవరి 8న అప్పటి ఇరాన్ (పర్షియా) రాజు రెజా షా 'కస్ఫ్-ఇ- హిజాబ్' పేరుతో ఒక డిక్రీ జారీచేశారు. దీని ప్రకారం ఇరాన్‌లో అన్ని రకాల హిజాబ్‌లు, ఛదర్‌లు రద్దయినాయి. ఈ డిక్రీని జారీ చేయడమే కాదు, రెజా షా దీన్ని వేగంగా అమలు పరచారు. అంతేకాదు పురుషులు సంప్రదాయ దుస్తులను ధరించడాన్ని కూడా ప్రభుత్వం నిషేధించింది. అప్పటి నుంచి ఇరాన్ రాజకీయాల్లో హిజాబ్ వివాదం కొనసాగుతూ వస్తోంది. ఆ విధంగా రెజా వస్త్రధారణను ఇరాన్ అంతర్గత రాజకీయ సమస్యగా మార్చేశారనే చెప్పాలి. రెజా షా తన దేశాన్ని ఆధునిక మార్గంలోకి నడపాలని ఆకాంక్షించారు. సంప్రదాయ దుస్తుల విషయంలో ఆయన తీసుకున్న చర్యలు ఇందులో భాగమే. అంతేకాదు దేశం ఆధునిక యుగంలోకి ప్రవేశించాలంటే మహిళలు అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలన్నది ఆయన ఉద్దేశం. ఇందుకు ఆయన అప్పట్లో ఆధునిక పోకడలతో ఉన్న టర్కీని ఉదాహరణగా తీసుకున్నారు. రాణి, రాజు కుటుంబంలోని ఇతర మహిళలు ప్రజాహిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ 'కస్ఫ్-ఇ-హిజాబ్' డిక్రీకి నమూనాగా నిలిచారు.

రెజా షా సంస్కరణలకు ఉపక్రమించడానికి చాలాకాలం ముందు అంటే, 1928లో రాణి తాడ్జ్ ఒల్-మొలౌక్ ఖోమ్ నగరానికి తీర్థయాత్రకు వెళ్లి అక్కడి ఫాతిమా మసుమెహ్ ప్రార్థనా మందిరాన్ని సందర్శించారు. అప్పుడు ఆమె హిజాబ్‌తో పూర్తిగా ముఖాన్ని కప్పుకోకపోవడాన్ని అక్కడి మతపెద్ద



తమ ఆమోదాన్ని తెలిపారు. అయితే 1979 నాటి పరిస్థితి ఇప్పుడు లేదు. ఇరాన్ ప్రజల్లో మత దురభిమానం తగ్గిపోయి, ఆలోచనా విధానాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయి. ఈ ఏడాది జూన్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన 'గ్రూప్ ఫర్ అనలైజింగ్ అండ్ మెజరింగ్ యాటిట్యూడ్స్ ఇన్ ఇరాన్' (జీఏఎం ఏఏఎన్) అనే సంస్థ ఇరాన్‌లో 50వేల మందికి పైగా ప్రజలపై ఒక సర్వే నిర్వహించింది. దీని ప్రకారం 32% మంది మాత్రమే తమను తాము షియాలుగా చెప్పుకున్నారు. 68% మంది రాజ్య శాసనాల్లో మతపరమైన ఆజ్ఞలను తొలగించాలని కోరారు. అంతేకాదు ఇప్పటి ఇరాన్ ప్రజల ఆలోచనా విధానం ఐదేళ్ల క్రితం నాటికి పూర్తి భిన్నం. అప్పట్లో అమెరికా ఆంక్షలను వ్యతిరేకిస్తూ వీరు తమ ప్రభుత్వానికి దన్నుగా నిలిచారు. కానీ తర్వాతి కాలంలో ఆంక్షలు, కొవిడ్-19 మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆహార, ఇంధన కొరత వంటి సమస్యలు ప్రజలను పీల్చి పిప్పిచేశాయి. ప్రస్తుతం వారి ఆలోచనా విధానంలో మార్పునకు ఇదే కారణం. దీని ఫలితమే నేటి ఆందోళనలు. గతంలో మాదిరి కాకుండా, నేడు ప్రజలు ముఖ్యంగా మహిళలు బహిరంగంగా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. హిజాబ్‌లను తగలబెట్టడం మాత్రమే కాదు, తమ జుట్టును కూడా కత్తిరించుకుంటున్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు అయొతుల్లా రుహల్లా ఖొమైనీ ప్రస్తుత ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖొమైనీల పోస్టర్లను ధ్వంసం చేస్తుండటం వారిలోని వెల్లువెత్తుతున్న ఆగ్రహానికి నిదర్శనం.

దేశ ఆర్థిక దుస్థితి, మతమౌఢ్యం తగ్గిపోవడం… ఈ రెండు అంశాలు ప్రస్తుతం ఇరాన్‌లో ఆందోళనలు సుస్థిరంగా కొనసాగడానికి కారణభూతమవుతున్నాయి. వీటికి తోడు ప్రస్తుత ఇరాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విదేశాంగ విధానం, దేశీయ విధానాల్లో తప్పుడు నిర్ణయాల వల్ల ఇటు అంతర్జాతీయంగా, అటు దేశీయంగా ఏకాకిగా మిగిలిపోయే పరిస్థితి నెలకొంది. గత సెప్టెంబర్‌లో ఇరాన్ అధ్యక్షుడు రైసీ ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశంలో మాట్లాడుతూ, గత జనవరిలో యూఎస్ డ్రోన్ దాడిలో మరణించిన ఇరానియన్ మిలిటరీ కమాండర్ ఖాసిమన్ సోలైమని మరణానికి కారకులను శిక్షించాలని ఒక పక్క డిమాండ్ చేయగా, మరోపక్క దేశంలో సోలైమని బ్యానర్లను ప్రజలు తగులబెడుతూ నిరసన ప్రదర్శనలు జరపడం గమనార్హం. సోలైమని రైసీకి ఒకప్పుడు కుడిభుజంగా వ్యవహరించారు.

**అన్ని వర్గాల మద్దతు**

అమిని మరణం తర్వాత దేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాల్లో వివిధ సామాజిక నేపథ్యమున్న మహిళలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. ముఖ్యంగా టెహ్రాన్‌లో కుర్దులు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఈ ఆందోళనలు ఉధృతంగా కొనసాగాయి. అమిని కుర్దు యువతి కావడం గమనార్హం. ప్రభుత్వం నిర్దేశించిన డ్రెస్ కోడ్ మాత్రమే ఇంతటి తీవ్రస్థాయి ఆందోళనకు కారణమని చెప్పలేం. దేశంలో ప్రాథమికంగా రాజకీయ, ఆర్థిక సంస్కరణలు అవసరమన్న బలీయమైన కోర్కె ఆందోళనలో పాల్గొన్న ప్రతి ఒక్కరిలో, ముఖ్యంగా మహిళల్లో కనిపించింది. నిజానికి ఈ హిజాబ్ ఆందోళన ఇప్పటికిప్పుడు రగిలింది కాదు. మహిళలు పని ప్రదేశాల్లో హిజాబ్‌ను తప్పనిసరిగా ధరించాలని 1979లో అప్పటి ఇరాన్ అధినేత అయొతుల్లా ఖొమైనీ ప్రకటించినప్పుడే మహిళలు తిరగబడ్డారు. అయితే నాటి రివల్యూషనరీ దళాలు వీరిపై హింసాత్మక దాడులకు పాల్పడ్డాయి. ఈ రివల్యూషనరీ దళాలే తర్వాతి కాలంలో మొరాలిటీ పోలీస్‌గా రూపాంతరం చెందాయి. అయితే 1979 నాటి ఆందోళనకు, ప్రస్తుత నిరసనలకు ముఖ్యంగా మూడు అంశాల్లో తేడా ఉంది. మొదటిది మార్పును కోరుతూ మహిళలే ఆందోళనలో ముందుండటం, రెండవది మధ్య తరగతి, శ్రామిక వర్గాల నుంచి మాత్రమే కాకుండా ధనిక వ్యాపారులు, ప్రముఖుల నుంచి పూర్తిస్థాయిలో మద్దతు లభించడం, మూడవది దేశంలోని విభిన్న భౌగోళిక ప్రాంతాల్లోకి వేగంగా విస్తరించడంతో చిన్నా పెద్దా నగరాలు ఆందోళనకు కేంద్రస్థానాలుగా మారిపోవడం.


సహజంగానే ఇరానియన్ మహిళల్లో చాలా

## చరిత్ర

తీవ్రంగా విమర్శించారు. అయితే ఇరాన్‌లోని నాటి మహిళా హక్కుల కార్యకర్తలు హిజాబ్ ధరించక పోవడాన్ని పూర్తిగా సమర్థించారు. అంతేకాదు ఇరాన్‌కు చెందిన నాటి ప్రముఖ ఫెమినిస్టు సెదిఖె దౌలతాబాది 1928లో హిజాబ్ ధరించకుండా బహిరంగంగా కనిపించిన తొలి మహిళగా చెబుతారు. నాటి సామాజిక కట్టుబాట్ల నేపథ్యంలోనే రెజా షా ఒకేసారి కాకుండా, క్రమంగా సంస్కరణలను ప్రవేశపెట్టారు. 1930లో ఇరాన్‌లో మొత్తం 6.5 మిలియన్ల మంది మహిళలుండగా, నాలుగువేల మంది మాత్రమే హిజాబ్ ధరించకుండా బహిరంగ ప్రదేశాలకు వచ్చేవారంటే అక్కడ కట్టుబాట్లు ఎంత కఠినమో అర్థమవుతుంది. ధైర్యంగా బయటకు వచ్చింది విద్యావంతులైన మహిళలే. 1935లో ఇరాన్ ప్రభుత్వ మద్దతుతో 'కనూన్-ఇ-బన్‌వాన్' పేరుతో మహిళా కమిటీ ఏర్పాటైంది. క్రమంగా మహిళా హక్కుల కార్యకర్తలు హిజాబ్‌కు వ్యతిరేకంగా ప్రచారం మొదలుపెట్టారు. అప్పటి సంస్కరణలను షియా మత పెద్దలు తీవ్రంగా వ్యతిరేకించినా సంస్కరణల అమలు మాత్రం ఆగలేదు. 1936, జనవరి 8న 'కష్ఫ్-ఇ-హిజాబ్' పేరుతో డిక్రీ జారీచేసిన తర్వాత, ఇరాన్ రాజు రెజా షా టెహ్రాన్ టీచర్స్ కాలేజీలో కార్యక్రమానికి తన రాణి, ఇద్దరు కుమార్తెలతో సహా హాజరయ్యారు. వీరంతా ఆధునిక దుస్తులతో, హిజాబ్‌లు ధరించకుండా ఒక కార్యక్రమంలో పాల్గొనడం అదే ప్రథమం. ఈ సందర్భంగా రాణి చేతుల మీదుగా డిప్లొమాలను అందజేశారు. ★

మంది విద్యావంతులు. వీరిలో డాక్టర్లు, లాయర్లు, ఉద్యోగులు, నర్సులు, టీచర్లు ఉన్నారు. హిజాబ్ ధరించాలన్న నిబంధనను వ్యతిరేకించిన వీరు సామాజిక-ఆర్థికరంగాల్లో పూర్తిగా వెనుకబడి పోయారు. అదీకాకుండా 1979 ఇస్లామిక్ విప్లవానికి ముందు మహిళల జీవన శైలిపై విప్లవ అనుకూలురు వివరాలు సేకరించడమే కాదు, రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబాలకు చెందిన మహిళలకు శిక్షలు విధించారు. ఉదాహరణకు ఇస్లామిక్ విప్లవానికి ముందు సైన్యంలో పనిచేసిన వారి కుమార్తెలను యూనివర్సిటీ విద్యకు లేదా ఉద్యోగాల్లో చేరడానికి అనుమతించలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే డ్రెస్ కోడ్.. మహిళలు, పురుషులను విద్య, ఉద్యోగం వంటి సామాజిక హక్కులకు దూరం చేసింది. జీన్స్, షార్ట్ స్లీవ్‌లు, గాఢమైన రంగుల దుస్తులు వేసుకో కూడదన్న నిబంధన పురుషులకు కూడా విధించారు. ఆ విధంగా ప్రభుత్వం ప్రజల జీవితాలకు సంబంధించిన ప్రతి అంశంలో కలుగజేసుకుంది. పుట్టినరోజు వేడుకలు, సంగీతం వినడం, విదేశీ చిత్రాలను చూడటం, ఆఖరికి కుక్కలను పెంచే విషయంలో కూడా ప్రభుత్వం కలుగజేసుకోవడం మొదలు పెట్టింది. అయితే ఇస్లామిక్ విప్లవం వచ్చిన తర్వాత ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతకు అనుగుణంగా ప్రభుత్వం మార్పులు చేపట్టలేదు. కానీ ప్రస్తుత తరం తమ వ్యక్తిగత స్వేచ్ఛను వదులుకోవడానికి ఎంతమాత్రం సిద్ధంగా లేదు. ప్రభుత్వం విధించే డ్రెస్ కోడ్ సామాజిక, రాజకీయ వెనుకబాటుకు చిహ్నంగా వారు పరిగణిస్తున్నారు. ఇస్లామిక్ విప్లవానికి ముందు హిజాబ్ ధరించడంపై నిర్బంధం ఉండేది కాదు.






వీరు బహిరంగ ప్రదేశాల్లో తిరగడమే కాదు, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే వారు. వీటికి సంబంధించిన ఫొటోలు విపరీతంగా వైరల్ కావడంతో, ఇప్పటి మహిళలు తమ ప్రైవేటు జీవితాలపై కొనసాగుతున్న నియంత్రణ విషయంలో మౌనంగా సహిస్తున్న బాధ మహసా అమిని మరణంతో ఒక్కసారిగా ఆందోళనల రూపంలో విస్ఫోటం చెందింది. అంతేకాదు, ఆమె మరణం ఇరాన్‌లో గూడుకట్టుకున్న అనేక సమస్యలను ఒక్కసారిగా బహిర్గతం చేసింది. ప్రపంచ దేశాల్లో హిజాబ్ ధరించడం అనేది వ్యక్తిగతంగా మతపరమైన అంశంగా పరిగణిస్తే, ఇరాన్ దాన్ని సామాజిక - ఆర్థిక వెనుకబాటుకు చిహ్నంగా మార్చేసింది. అందువల్ల ఇక్కడ ఆందోళన కారులు హిజాబ్ ధరించడాన్ని తిరస్కరిస్తున్నారంటే ఇస్లామిక్ విలువలను వ్యతిరేకించినట్టు కాదు. దశాబ్దాలుగా తమ స్వేచ్ఛను కోల్పోయిన మహిళల్లో వ్యక్తమవుతున్న అసహనం, కోపంగా దీన్ని పరిగణించాలి.

### ఒక్కో దేశంలో, ఒక్కో నిబంధన

ప్రస్తుతం హిజాబ్‌ను కొన్ని దేశాలు అనుమతిస్తుండగా, మరికొన్ని దేశాలు నిషేధించాయి. అంటే హిజాబ్ ధరించడంపై వివిధ ప్రభుత్వాలు భిన్న వైఖరులు అనుసరిస్తున్నాయి. ఉదాహరణకు ఇండొనేసియా, ఇరాన్, ఆఫ్ఘానిస్తాన్ వంటి దేశాల్లో హిజాబ్ ధరించడం తప్పనిసరి. యూరప్ దేశాల్లో హిజాబ్ విషయంలో వివాదాలు ఏర్పడి, దీన్ని నిషేధిస్తూ చట్టాన్ని తీసుకురావాలన్న వత్తిడులను కూడా ప్రభుత్వాలు ఎదుర్కొన్నాయి. కొన్ని దేశాల్లో హిజాబ్ విషయంలో చట్టం తేవడానికి అంతర్గతంగా చర్చలు కొనసాగుతుండగా, మరికొన్ని దేశాల్లో దీనిపై పరిమిత నిషేధం అమల్లో ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో హిజాబ్‌లతో సహా మతపరమైన చిహ్నాలను నిషేధిస్తూ ఫ్రాన్స్ ప్రభుత్వం 2005లో చట్టం అమల్లోకి తెచ్చింది. ముస్లిం మెజారిటీ దేశాలైన కొసావో, అజర్ బైజాన్, ట్యునీషియా, టర్కీల్లో పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లో 'బురఖా'ను నిషేధించాయి.

లెబనాన్, మొరాకో, ట్యునీసియా దేశాల్లో హిజాబ్ ధరించే మహిళల పట్ల వివక్ష చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం పదహారు దేశాలు బురఖాను నిషేధించాయి. అవి వరుసగా ట్యునీసియా, ఆస్ట్రియా, డెన్మార్క్, ఫ్రాన్స్, బెల్జియం, తజకిస్తాన్, బల్గేరియా, కామెరూన్, ఛాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, గబన్, నెదర్లాండ్స్, చైనా (జిన్‌జియాంగ్ ప్రాంతంలో), మొరాకో, శ్రీలంక, స్విట్జర్లాండ్. హిజాబ్ లేదా బురఖా విషయంలో వివిధ దేశాలు విభిన్న రీతుల్లో వ్యవహరిస్తున్న నేపథ్యంలో, నిర్దిష్ట ప్రమాణాలు ఏర్పడలేదు. అందువల్ల ప్రతి దేశం తన అంతర్గత పరిస్థితుల కనుగుణంగా వ్యవహరించడమే ఉత్తమం. ఒకరితో మరొకరు పోల్చుకోవాల్సిన అవసరం లేదు. ★




# అదొక నిశ్శబ్ద మారణహోమం



**ఉగ్రవాదులు ఎక్కడో ఉంటారు, మన దాకా ఎందుకు వస్తారు? అనుకుంటే పొరపాటు. మన చుట్టూ తిరుగుతూ అమాయకత్వం నటించే వారిలోనే వాళ్లు ఉండవచ్చు. చిన్న చిన్న పనులు చేసుకొని జీవించే సామాన్య వ్యక్తుల లాగే సౌమ్యంగా కనిపించవచ్చు. మన ఆలయాలు, మార్కెట్లు, జనం ఎక్కువగా తిరిగే వీధుల్లోనే తిరుగుతుంటారు. వారి చేతిలో ఉండే వస్తువులు కూడా సాధారణంగానే కనిపిస్తాయి. కానీ అవే మారణాయుధాలని ఆ క్షణంలో మాత్రం మనకు తెలియదు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక, దర్యాప్తులో వెలుగు చూసే విషయాలు ముచ్చెమటలు పట్టిస్తాయి. స్లీపర్ సెల్స్ అని ముద్దుగా పిలిచే వీళ్లకి తడిగుడ్డతో గొంతు కోస్తారన్న నానుడి కాస్త కూడా సరిపోదు. కోయంబత్తూరు, మంగళూరులలో ఇటీవల జరిగిన ఆ రెండు ఘటనలు యాదృచ్ఛికంగా జరిగినవి కాదు. ఆదిలోనే బెడిసి కొట్టిన భారీ ఉగ్ర కుట్రలు. అవే వాస్తవరూపం దాల్చి ఉంటే ప్రాణనష్టం భారీగా ఉండేది. సాదాసీదాగా కనిపించే ఈ వ్యక్తుల మూలాల డొంకలు మరెక్కడో తేలుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న ఇస్లామిక్ జిహాదీ సంస్థలు తమ కుట్రలను అమలు చేసేందుకు ఎంత పెద్ద యంత్రాంగాన్ని నిర్మించుకుంటున్నాయో ఈ ఘటనలను చూస్తే తెలిసిపోతుంది. షరీఖ్ మహ్మద్ అనే స్లీపర్ సెల్ జనం మధ్యే ఉంటూ ఎంత పెద్ద కుట్రలో పాత్రధారి అయ్యాడో చూడండి.**

కర్ణాటకలోని ప్రముఖ నగరం మంగళూరులో నవంబర్ 19 తేదీ సాయంత్రం రోడ్డు మీద ఓ ఆటో వెళుతోంది. కంకనాడి పోలీసు స్టేషన్ పరిధిలోని నాగోరి ప్రాంతానికి రాగానే ఆ ఆటోలో హఠాత్తుగా ఒక వస్తువు పేలింది. వెనుక సీటులో కూర్చున్న ప్రయాణికుడితో పాటు ఆటో డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం అక్కడి సీసీ కెమెరాలో నమోదైంది. అకస్మాత్తుగా రోడ్డుపై ఇలా ఆటోలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు వచ్చి చూస్తే ఆటోరిక్షాలో గ్యాస్ బర్నర్ భాగాలతో ధ్వంస మైన ప్రెషర్ కుక్కర్, దానికి అమర్చిన బ్యాటరీ సెట్ కనిపించింది. అది టైమర్ లేదా ఇగ్నిషన్ అయి ఉండొచ్చని భావించారు. పేలుడు జరిగినచోట నట్లు, బోల్టులు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, చిప్‌లు, సల్ఫ్యూరిక్ యాసిడ్ కనిపించడంతో ఇది సాధారణ ప్రమాదం కాదని, దీని వెనుక పెద్ద కుట్రే ఉందని కర్ణాటక పోలీసులకు అర్థమైపోయింది. ఇది ఉగ్రవాద చర్యేనని కర్ణాటక డీజీపీ ప్రవీణ్ సూద్ ప్రకటించారు. వెంటనే జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్ఐఏ) సమాచారం అందజేశారు. ఈ సంస్థే నేరుగా దర్యాప్తు మొదలు పెట్టింది.

అక్టోబర్ 23వ తేదీన కోయంబత్తూరు కొట్టేసంగమేశ్వర ఆలయం సమీపంలో మారుతీ 800లో సిలిండర్ పేలుడుకు, నవంబర్ 19 మంగళూరులో కుక్కర్ పేలుడు ఘటనకు పోలికలు ఉన్నాయని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు, కర్ణాటక పోలీసులు గుర్తించారు. దీపావళి సందర్భంగా కోయంబత్తూరులో విధ్వం సానికి జరిగిన కుట్ర ముందుగానే విఫలం కావడంతో భారీ ప్రాణ నష్టం తప్పింది. ఆ ఘటనలో కుట్రదారుడు 25 ఏళ్ల జమేషా ముబిన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా మంగళూరు ఆటో రిక్షా కుక్కర్ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో ఉన్న వ్యక్తిని షరీఖ్ మహ్మద్‌గా గుర్తించారు. పేలుడు తీవ్రతకు షరీఖ్ మొహం

పాక్షికంగా దెబ్బతింది. ప్రస్తుతం అతడు మాట్లాడే స్థితిలో లేడని పోలీసులు తెలిపారు. ఫాదర్ ముల్లా ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. గాయపడిన ఆటో డ్రైవరు పురుషోత్తమ పూజారి ఆరోగ్యం మెరుగవుతోంది. షరీఖ్ ఉగ్రవాదని తెలియక ఆటో ఎక్కించుకున్నాడీయన. కర్ణాటక హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర పురుషోత్తమ పూజారిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

మైసూరులో ఉండే షరీఖ్ మంగళూరులో పేలుళ్లు జరిపేందుకు కుక్కర్ బాంబుతో బస్సులో బయలుదేరాడు. బస్సు దిగిన తర్వాత పేలుడు ఎక్కడ జరపాలో పరిశీలించేందుకు ఆటోలో తిరుగుతున్న సమయంలో అది పేలిపోయింది. కుక్కర్‌లో పూర్తి స్థాయిలో పేలుడు పదార్థాలను ఉంచకపోవడంతో తీవ్రత కొంత పరిధికి మాత్రమే పరిమితమైంది. లేకుంటే ఇంకా ఎంతో మంది ప్రాణాలు పోయేవి.



కోయంబత్తూరులో జమేషా ముబిన్, మంగళూరులో షరీఖ్ మహ్మద్ పేలుళ్లకు ఉపయోగించిన వస్తువులు పైకి సాధారణ వస్తువులుగా కనిపిస్తాయి. రెండు చోట్లా ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ) ఉపయోగించారు. ఇది సాధారణ ఘటన కాదని భారీ ఎత్తున జరిగిన కుట్ర అని మరింత స్పష్టత వచ్చేసింది.. ఇంతకీ గాయపడిన షరీఖ్ మహ్మద్ ఎవరు అని ఆరా తీస్తే దిగ్భ్రాంతిని కలిగించే విషయాలు బయట పడ్డాయి..

**షరీఖ్ ఉగ్ర చరిత్ర**

కుక్కర్ బాంబు పేలుడు నిందితుడు షరీఖ్ మహ్మద్‌కు ఇస్లామిక్ స్టేట్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాతో పాటు, కొన్ని నిషేధిత తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని దర్యాప్తులో తేలింది.. ఇతని స్వస్థలం తీర్థహళ్లి సమీపంలోని సొప్పుగుడ్డె. షరీఖ్‌కు ఉర్దూతో పాటు హిందీ, తమిళ, కన్నడ భాషలు తెలుసు.

తాజా మంగళూరు పేలుడు ఘటనతో సంబంధం ఉండి పరారీలో ఉన్న మరో అనుమానిత తీవ్రవాది అబ్దుల్ మతిన్. ఇతడు తమిళనాడులో హిందూ నాయకుడు సురేశ్ హత్య కేసులో 12వ నిందితుడు. అబ్దుల్ మతిన్‌కి షరీఖ్‌కు ప్రత్యక్ష సంబంధాలున్నాయి. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లిలో ఐసిస్, సిమి సంఘాల్లో చురుకుగా ఉన్న కొందరు తీవ్రవాదులతో వీరు సమావేశమైనట్లు గుర్తించారు. షరీఖ్‌తో తరచూ ఫోన్‌లో మాట్లాడిన మహ్మద్ రుహుల్లాను బెంగళూరులో పోలీసులు అరెస్టు చేశారు. మైసూరు జిల్లాలో మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఏడాది సెప్టెంబర్ 19న శివమొగ్గలో తుంగ నది ఒడ్డున ఓ బాంబు పేలింది. షరీఖ్‌తో పాటే శివమొగ్గ జిల్లా సిద్దేశ్వరనగర్‌కు చెందిన సయ్యద్ యాసిన్, మంగళూరుకు చెందిన మాజ్ మునీర్‌లు బాంబులు తయారుచేసి తుంగ ఒడ్డున ప్రయోగించి చూశారు. యాసిన్, మునీర్‌లను ఎన్ఐఏ అరెస్టు చేయగా షరీఖ్ పరారై మైసూరులో తలదాచు కున్నాడు.

గత ఏడాది జులైలో షరీఖ్ మంగళూరులోని గోడలపై విద్వేషాలను రెచ్చగొట్టేలా రాతలు రాసిన కేసులో అరెస్టయ్యాడు. దక్షిణ కన్నడ జిల్లా న్యాయస్థానం అతనికి బెయిల్ ఇవ్వకపోవడంతో, ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. అప్పటి నుంచి కోర్టు ముందు విచారణకు హాజరు కాకుండా, బెంగళూరు, మైసూరు, తమిళనాడు, కేరళలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ జామీను షరతులను ఉల్లంఘించాడు. శివమొగ్గలో వీర్ సావర్కర్ పోస్టర్‌ను ప్రదర్శించిన వ్యక్తిని కత్తితో పొడిచిన కేసులో కూడా షరీఖ్ నిందితుడు అని తెలుస్తోంది.

షరీఖ్ మహ్మద్ సెల్ఫీ వీడియోలను ఎన్ఐఏ తనిఖీ చేస్తే అందులో మరిన్ని కొత్త విషయాలు బయటపడ్డాయి. ఐసిస్ తీవ్రవాదుల తరహాలో తాను కొన్ని వర్గాల ప్రజలపై ప్రతీకారాన్ని తీసుకుంటానని ఆ వీడియోల్లో వ్యాఖ్యలు చేశాడు. మత ప్రచారకుడు జాకిర్ నాయక్ తనకు 'రియల్ ఇన్‌స్పిరేషన్' అని ప్రకటించుకున్నాడు. 50కి పైగా జాకిర్ నాయక్ వీడియోలను తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడు. దర్యాప్తులో కొత్త అంశాలు వెలుగులోకి వస్తాయని, అతని అనుచరులు, స్లీపర్ సెల్ సభ్యుల వివరాలను గుర్తించేందుకు అవకాశం ఉందని సీనియరు పోలీసు అధికారులు చెబుతున్నారు. భారత్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చేందుకు జిహాద్ చేయాలని సహచరులకు నూరి పోసేవాడు షరీఖ్. నిషేధిత తీవ్రవాద సంస్థల ప్రతినిధులతో అతను తరచూ ఫోన్‌లో, వేర్వేరు యాప్‌ల సాయంతో మాట్లాడేవాడని తేలింది.

**పేలుళ్ల కోసం ప్రత్యేక శిక్షణ**

షరీఖ్ బాంబులు పేల్చేందుకు మైసూరులో శిక్షణ పొందాడని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. మొబైల్‌ఫోన్ ద్వారా పేలుళ్లకు సన్నాహాలు చేసుకున్నాడు. ఇందు కోసం ఫోన్లు రిపేర్ చేసే దుకాణంలో పనికి కుదిరాడు. అక్కడే పరిచయమైన వారితో సిమ్ కార్డులు కొనుగోలు చేయించి, వాటిని వివిధ మొబైల్స్‌లో ఉంచేవాడు. పేలుళ్లకు కావలసిన పరికరాలను మైసూరు లోక్‌నాయక్ నగర్‌లో తాను ఉంటున్న గదిలో దాచి పెట్టుకున్నాడు. కుక్కర్ బాంబు తరహాలో వివిధ రకాల వస్తువులలో పేలుడు పదార్థాలు ఉంచి పేల్చేందుకు ఇంట్లోనే ప్రయోగాన్ని చేపట్టాడు. ఆ పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల మైసూరులోని ఒక మొబైల్ రిపేర్ చిన్నపాటి పేలుడు సంభవించింది. దానికీ, షరీఖ్‌కూ ఉన్న సంబంధం మీద దర్యాప్తు చేస్తున్నారు.

షరీఖ్‌కు సొంత వాహనం లేదు. ఎక్కడకు వెళ్లినా, క్యాబ్, ఆటో, బస్సు, రైళ్లలో వెళ్లేవాడు. ఓఎల్ఎక్స్ వంటి వెబ్‌సైట్ల నుంచి పాత మిక్సీలు, గ్రైండర్లు కొనుగోలు చేసేవాడు. వాటిలో బాంబులు ఉంచి పేల్చేందుకు అనువుగా సిద్ధం చేసుకునేవాడని అనుమానిస్తున్నారు. మైసూరులో రెండు దుకాణాల నుంచి 100కుపైగా అగ్గిపెట్టెలు కొనుగోలు చేశాడు. ఎందుకని ప్రశ్నించగా, తాను ఇంజనీరునని, ప్రాజెక్టు పనికి అవసరమని చెప్పాడు. కోయంబత్తూరు తరహాలో కర్ణాటకలోని ఇషా ఫౌండేషన్‌ను లక్ష్యంగా చేసుకుని షరీఖ్ పేలుళ్లకు ప్రయత్నించాడని వస్తున్న సమాచారంపై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది.

అక్టోబర్ 23 నాటి కోయంబత్తూరు కారు బాంబు పేలుడుతో కూడా షరీఖ్‌కు సంబంధం ఉండొచ్చని భావిస్తున్నారు. షరిక్ కోయంబత్తూరుకు వెళ్లి వచ్చాడు. దేవాలయం వద్ద ఉన్న ఒక సత్రంలో తాను హిందువునని చెప్పి గదిని అద్దెకు తీసుకున్నాడు. మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న

అబ్దుల్ మతీన్ ద్వారా మహ్మద్ తల్కన్ అతనికి పరిచయం అయ్యాడు. కోయంబత్తూరులో 1998లో జరిగిన పేలుడు నిందితుడు ఎస్.ఎ.బాషా బంధువులు మహ్మద్ తల్కన్‌ను నిందితుడు పలుసార్లు కలుసుకున్నాడు.

**మంగళూరు కుట్ర వెనుక..**

హిజాబ్ వ్యతిరేక ఆందోళనలతో దేశం దృష్టిని ఆకర్షించిన మంగళూరు మీద ఇస్లామిక్ సంస్థలు చాలా కాలం క్రితమే కన్నేశాయి. గతంలోనూ ఇక్కడ ఉగ్రవాద కదలికలు, ఘటనలు చోటుచేసుకున్నాయి. షరీఖ్ మహ్మద్ మంగళూరు వాసులను భయభ్రాంతులను చేసేందుకు పెద్ద కుట్రే పన్నినట్లు తెలుస్తోంది. అక్కడి కద్రి మంజునాథేశ్వర ఆలయం, కుద్రోళి గోకర్ణనాథేశ్వర, మంగళాదేవి ఆలయం, పడిలు రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లతో పాటు ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న 'కేశవ స్మృతి సంవర్ధన సమితి'లలో పేలుళ్లకు ప్రణాళిక రూపొందించుకున్నాడని తేలింది. నవంబరు 19న కేశవ స్మృతి సంవర్ధన సమితి 10 వేల మంది విద్యార్థులతో బాలల ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంది.

కార్తికమాసంలో ఆలయాల్లో నిర్వహించే లక్ష దీపోత్సవాల వేడుకల సమయంలో పేలుళ్లకు కుట్ర జరిగిందని ఎన్ఐఏ, స్థానిక పోలీసులు గుర్తించారు. షరీఖ్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ యూఏపీఏ చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించింది. అనుమానిత తీవ్రవాదులు మహ్మద్ మతీన్, సౌదీ అరేబియాలో ఉన్నాడని భావిస్తున్న అరాఫత్ అలితో కలిసి షరీఖ్ బాంబుల తయారీ, ఇతర తీవ్రవాద కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడని ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసుకున్నారు. పదికి పైగా ఎన్ఐఏ బృందాలు వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో దర్యాప్తు ప్రారంభించాయి. షరీఖ్‌కు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న వారిని గుర్తించే ప్రయత్నాలను దర్యాప్తు దళం ముమ్మరం చేశారు

**బొమ్మై పర్యటన రోజే పేలుడు**

మంగళూరులో అదే రోజు మధ్యాహ్నం కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పర్యటన పూర్తయింది. సాయంత్రం కుక్కర్ బాంబు పేలింది. కుక్కర్ బాంబుతో బస్సులో బయలుదేరి సాయంత్రం మంగళూరుకు చేరుకున్నాడు. అయితే అప్పటికే ముఖ్యమంత్రి మంగళూరు నుంచి వెళ్లిపోయారు. నిందితుడు ఆలస్యంగా మంగళూరు రావడంతో టార్గెట్ తప్పిందని అనుమానించిన దర్యాప్తు సంస్థలు మరింత లోతుగా దర్యాప్తు జరిపాయి. లక్ష్యం ముఖ్యమంత్రి కాదని తేలింది. అయితే ఉగ్రవాదులు కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి గట్టి సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో కుక్కర్ బాంబు పేలుడుకు పథకం వేశారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ఆధార్‌తో హిందువుగా చెలామణి**

ఉగ్రవాది షరీఫ్ మహ్మద్ నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసుకుని మారువేషంలో వినియోగించుకుంటూ వస్తున్నాడని పోలీసులు గుర్తించారు. అతని దగ్గర హుబ్లీకి చెందిన ప్రేమ్ రాజ్ హుతాగి పేరుతో ఆధార్ కార్డు దొరికింది. రైల్వే ఉద్యోగి ప్రేమ్‌రాజ్ జీవితంలో ఒక్కసారి కూడా పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేదు. పోలీసుల నుంచి ఫోన్ కాల్ రావడంతో ఉలిక్కి పడ్డాడు. చివరకు వారి దర్యాప్తులో ఈ పేలుడుకు సంబంధం లేదని తేలింది. ప్రేమ్‌రాజ్ గత రెండేళ్లలో రెండుసార్లు ఆధార్ కార్డ్ పోగొట్టుకున్నాడు. ఆధార్ వెబ్‌సైట్‌లో కంప్లైంట్ చేసి కొత్త కార్డ్ తీసుకున్నాడు. తన ఆధార్ ఇలా దుర్వినియోగం అవుతుందను కోలేదని అంటున్నారు ప్రేమ్‌రాజ్.

మైసూరులోని మోహన్ కుమార్ ఇంట్లో షరీఖ్ ఉంటున్నాడు. ప్రేమ్‌రాజ్ ఆధార్ కార్డ్ ఉపయోగించే ఈ ఇంటిని అద్దెకు తీసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. షరీఖ్ గతంలో అరెస్ట్ అయి బెయిల్ పొందిన తర్వాత వేర్వేరు హిందూ పేర్లతో కన్యాకుమారి, కోచి, కోయింబత్తూర్, మైసూరులో ఆశ్రయం తీసుకున్నాడని వెల్లడైనట్టు రాష్ట్ర హోమ్ మంత్రి ఆరాగా జ్ఞానేంద్ర తెలిపారు.

షరీఖ్ బళ్లారికి చెందిన ఓ హిందూ పేరుతో సిమ్ కార్డు వాడుతున్నట్టు పోలీసులు కనుగొన్నారు. ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేసే సురేంద్రన్ అనే రూమ్ మేట్ ఆధార్‌తో ఒక సిమ్ కార్డుని తీసుకున్నాడు. సురేంద్రన్‌ని కస్టడీలోకి తీసుకుని పోలీసులు విచారించగా షరీఖ్ అనేవాడు తనతో పాటు రూమ్ షేర్ చేసుకున్నాడే తప్ప అతని గురించి తనకు పూర్తిగా తెలియదని వెల్లడించాడు.

కోయింబత్తూర్‌లోని ఇషా ఫౌండేషన్‌లో గల శివుడి చిత్రాన్ని షరీఖ్ తన వాట్స్ అప్ వాల్‌పేపర్‌గా పెట్టుకున్నాడు. తనపై అనుమానాలు రాకుండా హిందువుగా కనిపించేందుకు జాగ్రత్తలు తీసుకున్నాడు. మైసూర్‌లో ఉన్న సమయంలో ఉర్దూ వాసనలు లేకుండా కన్నడంలోనే మాట్లాడేవారని, తాను ముస్లిం అని బైట పడకుండా ఉండేందుకు అన్ని హిందూ పండుగలను ఎంతో ఉత్సాహంతో జరుపుకొనేవాడని దర్యాప్తులో వెల్లడైంది.

**ఈ పేలుడు మా పనే**

ఇప్పటి వరకూ ఎవరికీ అంతగా తెలియని ఇస్లామిక్ రెసిస్టెన్స్ కౌన్సిల్ (ఐఆర్‌సి) మంగళూరులో జరిగిన పేలుళ్లకు తమదే బాధ్యత అని ప్రకటించుకుంది. తమ ముజాహిద్ సోదరుడు ముహమ్మద్ షరీఖ్ కద్రీ దక్షిణ కన్నడ జిల్లాలోని హిందూ మందిరంపై దాడి చేయాలనుకున్నాడని, ప్రీ మెచ్యూర్ పేలుడు కారణంగా షరీఖ్ పోలీసుల చేతికి చిక్కాడని తెలిపింది. మరో దాడికి సిద్ధంగా ఉండాలని ఆ ఉగ్రవాద సంస్థ హెచ్చరించింది. 'మా సోదరుడు మహ్మద్ షరిఖ్‌ను పట్టుకున్నామన్న సంతోషం మీకు కొంత సమయం మాత్రమే ఉంటుంది. ఇకపై తాము ఏదైనా లక్ష్యాన్ని పూర్తి చేసిన తర్వాతే ప్రకటన విడుదల చేస్తాము'ని కరపత్రంలో ఉందని అధికారులు గుర్తించారు. ఆ సందేశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. తమ కార్యకలాపాలకు అడ్డు పడుతున్న ఏడీజీపి అలోక్ కుమార్‌ను నియంత్రించాలంటూ, డార్క్‌వెబ్, సిగ్నల్ యాప్ ద్వారా ఇస్లామిక్ రెసిస్టెన్స్ కౌన్సిల్ కరపత్రాలను రూపొందించిందని ఎన్ఐఏ గుర్తించింది. 'ఎన్ని అడ్డంకులు ఎదురైనా మేము అనుకున్న లక్ష్యాలను పూర్తి చేస్తాం' అంటూ ఆ కరపత్రంలో ఐఆర్‌సీ పేర్కొంది. 'మేము చేస్తున్న యుద్ధాన్ని అడ్డుకునేవారిని నియంత్రించేందుకే ఈ బాట పట్టాం' అని కరపత్రంలో పేర్కొన్నారు.

సాధారణంగా మన చుట్టు పక్కల జరుగుతున్న సంఘటనలు, వ్యక్తులపై పెద్దగా దృష్టి పెట్టం. ఇరుగు పొరుగులో ఎవరు ఉన్నారనే విషయాన్ని కూడా పట్టించుకోం. ఉగ్రవాదులు ఎక్కడో ఉంటారని అనుకోరాదు. వాళ్లతో వచ్చే దారుణ ప్రమాదాలు మన మధ్యే పొంచి ఉండవచ్చు. వారు జనావాసాల మధ్యే స్లీపర్ సెల్స్‌గా పనిచేస్తారు. ఉగ్రవాద సంస్థలు వీరినే పావులుగా వాడుకొని కుట్రలను కొనసాగిస్తుంటాయి. దీనికి షరీఖ్ మహ్మదే పెద్ద ఉదాహరణ. కేవలం దర్యాప్తు సంస్థలు కాకుండా పౌరులు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పోలీసుల దృష్టికి తేవడం ద్వారా సహకరించాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

ఇప్పటి వరకూ ఎవరికీ అంతగా తెలియని ఇస్లామిక్ రెసిస్టెన్స్ కౌన్సిల్ (ఐఆర్‌సి) మంగళూరులో జరిగిన పేలుళ్లకు తమదే బాధ్యత అని ప్రకటించుకుంది. తమ ముజాహిద్ సోదరుడు ముహమ్మద్ షరీఖ్ కద్రీ దక్షిణ కన్నడ జిల్లాలోని హిందూ మందిరంపై దాడి చేయాలనుకున్నాడని, ప్రీ మెచ్యూర్ పేలుడు కారణంగా షరీఖ్ పోలీసుల చేతికి చిక్కాడని తెలిపింది. మరో దాడికి సిద్ధంగా ఉండాలని ఆ ఉగ్రవాద సంస్థ హెచ్చరించింది. 'మా సోదరుడు మహ్మద్ షరిఖ్‌ను పట్టుకున్నామన్న సంతోషం మీకు కొంత సమయం మాత్రమే ఉంటుంది. ఇకపై తాము ఏదైనా లక్ష్యాన్ని పూర్తి చేసిన తర్వాతే ప్రకటన విడుదల చేస్తాము'ని కరపత్రంలో ఉందని అధికారులు గుర్తించారు. ఆ సందేశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది.




# భైంసా వెళ్లా

**'తెలంగాణలో బీజేపీ పుంజుకుంటోంది.' ఇది స్వయంగా అమిత్ షా చెప్పిన మాట. అది కూడా ఓ జాతీయ స్థాయి ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన అభిప్రాయం. అంతేకాదు, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురబోతోందని కూడా ఆయన కుండబద్దలు కొట్టారు. కేంద్ర హోం మంత్రి, బీజేపీలో కీలక నేత అయిన అమిత్ షా ఇంత స్పష్టంగా చెప్పడం, దానికి తమ వ్యూహం కూడా ఏంటో బయటపెట్టడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చకు దారి తీస్తోంది. అయితే, ఈ పరిణామం అధికార టీఆర్ఎస్‌తో పాటు, ఇతర రాజకీయ పార్టీలకూ మింగుడు పడటం లేదు.**

తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో బీజేపీ కొన్నేళ్లుగా తీవ్రంగా శ్రమిస్తోంది. సాక్షాత్తూ కేంద్ర బీజేపీ పెద్దలు రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అవకాశం దొరికినప్పుడల్లా రాష్ట్రంలో పర్యటిస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచుతున్నారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల గురించి ఇటీవల మాట్లాడిన ఆ పార్టీ అగ్రనేత అమిత్ షా తెలంగాణ ప్రజల నాడి తనకు బాగా తెలుసని, జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తప్పనిసరిగా గెలుస్తుందని అన్నారు. అంతేకాదు, బీజేపీ దక్షిణాది ప్రవేశానికి తెలంగాణనే 'గేట్ వే' అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీఎం కేసీఆర్ పోరు కొనసాగిస్తుండటం, టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోళ్ల కేసులో బీజేపీ నేతలను చిక్కుల్లో పడేసిన క్రమంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మరోవైపు.. బండి సంజయ్ ప్రజా సంగ్రామ పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లి పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు విడతల పాదయాత్ర పూర్తవగా.. నవంబర్ 28 నుంచి భైంసా నుంచి ఐదో విడత పాదయాత్ర ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకున్నారు. 20 రోజుల పాటు 222 కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగనుంది. మొత్తం 5 జిల్లాలు, 3 పార్లమెంట్ నియోజకవర్గాలు, 8 అసెంబ్లీ నియోజక వర్గాల్లో యాత్ర కొనసాగనుంది. డిసెంబర్ 17వ తేదీ వరకు ఈ యాత్ర కొనసాగనుంది. డిసెంబర్ 14, 15, 16 తేదీలో చొప్పదండిలో యాత్ర కొనసాగ నుండగా.. డిసెంబర్ 16, 17న కరీంనగర్‌లో పాదయాత్ర జరుగుతుంది. చివరి రోజు కరీంనగర్‌లోని ఎస్ఆర్ కళాశాల వద్ద పాదయాత్ర ముగియనుంది.

ఈ పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పలువురు జాతీయ నేతలు కూడా పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. అయితే, అనూహ్యంగా రాష్ట్ర పోలీసులు సంజయ్ పాదయాత్రను అడ్డుకున్నారు. ఒకరోజు ముందుగానే కరీంనగర్ నుంచి బయలు దేరిన సంజయ్‌ని భైంసా వెళ్లకుండా మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. తిరిగి కరీంనగర్ తీసుకొచ్చి ఆయన ఇంట్లోనే నిర్బంధంలో ఉంచారు. ఈ క్రమంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి.




**పోలీసుల అత్యుత్సాహం!**

కరీంనగర్ నుంచి జగిత్యాల మీదుగా నిర్మల్‌కు సంజయ్ వెళ్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు జగిత్యాల టౌన్ పరిధిలోని తాటిపల్లిలో కాపుకాశారు. ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, మరో 15 మంది పోలీసులు.. కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆయన వారిని తప్పించుకొని ముందు కెళ్లారు. పోలీసులు కాన్వాయ్‌ని వెంబడిస్తూ ముందు కెళ్లగా.. మేడిపల్లిలోని పార్టీ నేత ఇంటి వద్ద సంజయ్ కారు నిలిపి లోనికి వెళ్లారు. ఆయన బయటకు వచ్చిన వెంటనే అరెస్ట్ చేయాలనుకున్నారు. కానీ అక్కడికి పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు చేరు కున్నారు. దీంతో మరికొంత మంది పోలీసులు మోహరించారు. రాత్రి 8 గంటల సమయంలో సంజయ్ కార్యకర్తల సాయంతో పోలీసులను తప్పించుకొని కోరుట్ల మార్గంలో వెళ్లారు. గమనించిన పోలీసులు నాలుగు వాహనాల్లో వెంబడించి కోరుట్ల సమీపంలోని వెంకటాపూర్ వద్ద చుట్టుముట్టారు. బలవంతంగా అదుపులోకి తీసుకొని కరీంనగర్ వైపు వెళ్లారు.

**బీజేపీ శ్రేణుల నిరసనలు**

రాత్రివేళ బండి సంజయ్ అరెస్టుపై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



# ళ్లాలంటే వీసా కావాలా?

సుజాత గోపగోని, 6302164068

మెట్‌పల్లి పట్టణంలో గంటన్నరకు పైగా రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. సంజయ్ అరెస్ట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై మల్యాల చౌరస్తా వద్ద పోలీసులు దాడికి దిగారు. దొరికిన వాళ్లను దొరికినట్లు విచక్షణారహితంగా లాఠీలతో చితకబాదారు. ఈ దాడిలో పలువురు కార్యకర్తలు తీవ్రంగా గాయ పడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో నిర్మల్ జిల్లాలోని భైంసాలో ప్రజా సంగ్రామ యాత్ర, బహిరంగ సభకు అనుమతి నిరాకరిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. భైంసాలో ఉన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించా లని కోరారు. ఆయన ప్రకటనపై బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసుల తీరుపై బండి సంజయ్ మండిపడ్డారు. పాదయాత్రకు ముందు అనుమతి ఇచ్చి, ఇప్పుడు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. భైంసా సున్నితమైన ప్రాంతం అని పోలీసులకు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని నిలదీశారు.

సంజయ్ పాదయాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించడం ఇది తొలిసారి కాదు. గతంలో కూడా పలుమార్లు ముందుగా అనుమతి ఇచ్చి, చివరి నిమిషంలో నిరాకరించారు. ఈసారి సంజయ్ అరెస్టుతో పాదయాత్రపై కొంత సందిగ్ధం నెలకొంది. అయితే, పోలీసుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో బీజేపీ హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఆ పార్టీ నాయకులు ఊహించినట్లుగా గతంలో మాదిరిగానే హైకోర్టు పాదయాత్రకు అనుమతి ఇచ్చింది. అయితే, కొన్ని షరతులు విధించింది. అవాంఛనీయ ఘటనలు ఎదురవు తాయన్న అనుమానం ఉంటే, భైంసా పట్టణంలోకి పాదయాత్ర వెళ్లదని బీజేపీ తరఫున న్యాయవాది రామచందర్‌రావు కోర్టుకు తెలిపారు. పట్టణంలోకి ప్రవేశించకుండా వై జంక్షన్ నుంచి మాత్రమే కొనసాగుతుందని వివరించారు. భైంసాలోకి పాదయాత్ర వెళ్లకుంటే పోలీసులకు అభ్యంతర మేంటని హైకోర్టు ప్రశ్నించింది. సభలు, పాద యాత్రలు రాజకీయ పార్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని కూడా హైకోర్టు ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం.

**భైంసాలో అల్లర్లు సృష్టించిందెవరు?**

ఈ పరిణామాల నేపథ్యంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. ప్రజా సంగ్రామ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి విడత యాత్రకు అనుమతిచ్చిన పోలీసులు.. ఇప్పుడెందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు 4 విడతలుగా ప్రశాంతంగా, ప్రజా స్వామ్యబద్ధంగా ప్రజాసంగ్రామ యాత్ర నిర్వహించా మని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏదో ఒక సాకుతో పాదయాత్రను అడ్డకునేందుకు యత్నిస్తోందన్నారు. అందుకే హైకోర్టును ఆశ్రయించామని, ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల పట్ల సంతోషంగా ఉన్నామన్నారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా పాదయత్రను కొనసాగిస్తామని చెప్పారు. ఎంఐఎం, టీఆర్ఎస్ కలిసి ఎన్ని కుట్రలు చేసినా బండి సంజయ్ నుంచి భైంసా ప్రజలను వేరు చేయలేరని, భైంసా వెళ్లాలంటే వీసా కావాలా? అనుమతి తీసుకోవాలా? భైంసా ఈ దేశంలో, తెలంగాణలో లేదా? అని ప్రశ్నించారు. అసలు భైంసాలో అల్లర్లు సృష్టించింది వరు? ఆ అల్లర్లలో గాయపడ్డ వారిని ఆదుకున్నది ఎవరు? అమాయకుల ఉసురు తీసిందెవరు? పీడీ యాక్ట్ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టిందెవరు? మేం పాదయాత్ర చేస్తే ఇవన్నీ బయటకొస్తాయనే భయంతోనే భైంసాకు వెళ్లకుండా ప్రభుత్వం కుట్ర చేసిందని మండిపడ్డారు. గతంలో పాతబస్తీలో భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం నుంచి పాదయాత్ర చేస్తే అల్లర్లు జరిగాయా? ప్రశాంతంగా యాత్ర చేస్తే ప్రభుత్వానికి భయమెందుకు? కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా పాదయాత్రను ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాదయాత్ర ద్వారా ప్రజలతో మాట్లాడుతామని, వారి కష్టసుఖాల్లో పాలుపంచు కుంటామని, వారికి భరోసా కల్పిస్తామని సంజయ్ అన్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


ఎంఐఎం, టీఆర్ఎస్ కలిసి ఎన్ని కుట్రలు చేసినా బండి సంజయ్ నుంచి భైంసా ప్రజలను వేరు చేయలేరని, భైంసా వెళ్లాలంటే వీసా కావాలా? అనుమతి తీసుకోవాలా? భైంసా ఈ దేశంలో, తెలంగాణలో లేదా? అని ప్రశ్నించారు. అసలు భైంసాలో అల్లర్లు సృష్టించిందె వరు? ఆ అల్లర్లలో గాయపడ్డ వారిని ఆదుకున్నది ఎవరు? అమాయకుల ఉసురు తీసిందెవరు? పీడీ యాక్ట్ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టిందెవరు? మేం పాదయాత్ర చేస్తే ఇవన్నీ బయటకొస్తాయనే భయంతోనే భైంసాకు వెళ్లకుండా ప్రభుత్వం కుట్ర చేసిందని మండిపడ్డారు.



# రవాణా రంగా

**చవకైన, వేగవంతమైన రవాణా కోసం కేంద్ర ప్రభుత్వం నూతన లాజిస్టిక్స్ (రవాణా సదుపాయాలు) విధానాన్ని ప్రకటించి అమలు చేస్తుండగా రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం మాత్రం సహకారం ఇవ్వడం లేదు. నేడు వస్తు విక్రయాల్లో రవాణా, నిల్వ ఖర్చే 14 శాతం వరకు ఉంటుంది. దీనిని తగ్గించుకోవడం ద్వారా వస్తువుల ధరలను వినియోగదారులకు తక్కువకే అందుబాటులోకి తీసుకురావచ్చు. విలువైన ప్రజా ధనాన్ని కూడా ఆదా చేయవచ్చు. ఈ నూతన లాజిస్టిక్స్ విధానం పటిష్టంగా అమలు కావాలంటే నాణ్యమైన రవాణా సదుపాయాలు, గిడ్డంగులు కావాలి. కాని మన రాష్ట్రంలో ఇవి సక్రమంగా లేవు. ఉన్నవి కూడా కేంద్ర ప్రభుత్వం వేసిన జాతీయ రహదారులే. కొత్త రైల్వే లైన్లు కూడా అభివృద్ధి చెందలేదు. ఓడరేవుల పరిస్థితి అలాగే ఉంది. రాష్ట్రానికి లాజిస్టిక్స్ పార్కు ఇస్తామని గతంలో కేంద్ర మంత్రి గడ్కరీ ఆహ్వానించినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన కరవైంది. కనీసం గ్రామీణ రహదారులు కూడా పునర్నిర్మాణానికి నోచుకోలేదు. ఈ పరిస్థితుల్లో లాజిస్టిక్స్ విధానం అమలు ప్రశ్నార్థకంగా మారింది.**

దేశ అభివృద్ధిని త్వరితం చేయడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం నూతన లాజిస్టిక్స్ విధానం (ఎన్ఎల్పీ) ప్రకటించింది. ఈ విధానం లక్ష్యాలు సరైన ఉత్పత్తిని అందించడం-సరైన స్థితిలో ఉంచడం -సరైన చోటుకి తీసుకువెళ్లడం - సరైన సమయానికి తీసుకువెళ్లడం-సరైన ఖాతాదారుకు చేరేలా చూడటం. ఇది అమలైతే చిన్న రైతులకు; సూక్ష్మ, చిన్న, మధ్య శ్రేణి పరిశ్రమల (ఎంఎస్ఎంఇలు)కు, భారీ కర్మాగారాలకు, సామాన్యులకు కూడా మేలు జరుగుతుంది. కోట్లాది ఉద్యోగాలను సృష్టిస్తుంది. వస్తువులు, మనుషుల రవాణాలను వేగవంతం చేస్తుంది. భారీయెత్తున ఆదాలకు దారితీసి ఆర్థిక సామర్థ్యాలను పెంచుతుంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

ప్రస్తుతం వస్తువుల ధరల్లో సరకు రవాణా, నిల్వ వ్యయాలు 13 నుంచి 14 శాతం వరకు ఉన్నాయి. పళ్లు, కూరగాయలు లాంటి ఉత్పత్తులను అవి కుళ్లిపోకముందే వినియోగదారులకు చేర్చాలి. అందుకని వాటిని చిన్న రైతులు చాలా తక్కువ ధరకు అమ్మేస్తారు. చాలా సందర్భాల్లో వారికి మిగిలేది అత్యంత స్వల్పం లేదా నష్టాలే. అయితే మెరుగైన రవాణా సదుపాయాలు ఉంటే ఈ వస్తువులను తక్కువ సమయంలో ఎక్కువ దూరం తీసుకువెళ్లి వారికి, కొత్త మార్కెట్లకు సరఫరా చేయవచ్చు. అంటే పొలం నుంచి పళ్లెం దాకా వ్యవసాయ ఉత్పత్తులను చేర్చడంలో కీలకమైన మార్పులకు అవకాశం ఉంది. ఈ మార్పులు రైతుకు మరింత ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా ఇటు వినియోగదారుడికి కూడా తక్కువ ధరలో ఆహారాన్ని అందిస్తాయి. వినియోగదారుడి కోణం నుంచి చూసినా లాజిస్టిక్స్ వ్యయాలు అధికంగా ఉంటున్నాయి. వారు కొనే వస్తువుల ధరల్లో లాజిస్టిక్స్ ఖర్చులు గణనీయంగా ఉంటాయి.

జాతీయ రహదారులతో పాటు అత్యంత నాణ్యమైన గ్రామీణ రోడ్లు, ఎక్స్‌ప్రెస్ వేలు, కంటైనర్ల నిర్వహణలో మెరుగుదల, వేగవంతమైన, సురక్షిత మైన రైల్వేలు, ప్రత్యేక రవాణా కారిడార్లు ఇవన్నీ లాజిస్టిక్స్ సదుపాయాల్లో భాగమే. ఈ మౌలిక సదుపాయాలుంటేనే అభివృద్ధి చెందిన దేశాలతో సరిసమానంగా ముడిపదార్థాలు ఉత్పత్తిదారులకు, అక్కడి నుంచి వినియోగదారులకు నేరుగా చేరే అత్యంత ఉన్నత స్థాయి సేవలను అందిస్తాయి.

**రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం**

పైన తెలిపిన సదుపాయాలు కల్పించడంలో రాష్ట్రం ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. రాష్ట్రంలో అంతర్గత రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. జిల్లా రహదారులు, గ్రామీణ రహదారులు ఘోరంగా ఉన్నాయి. ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వీటిని పునర్నిర్మించలేదు సరికదా మరమ్మతులు కూడా చేయడం లేదు. పాత బిల్లులు ఇవ్వకపోగా వేధించడం, పనిచేస్తే కొత్త బిల్లులు ఇస్తారో లేదో అన్న అనుమానాల నేపథ్యంలో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ముఖ్యంగా ధాన్యం, కూరగాయలు, ఆక్వా ఉత్పత్తుల



# నికి ప్రోత్సాహమేది?



సేకరణకు గ్రామీణ రహదారులే శరణ్యం. కాని నేడు రాష్ట్రంలో వాటి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. భారీ వాహనాలు నడిచే పరిస్థితి లేదు. రైతులు వాహన యజమానులు చెప్పిన అధిక ఛార్జీలకే ఉత్పత్తులు చేరవేయాల్సి వస్తోంది. పోనీ సరకును నిల్వచేద్దామన్నా అవసరమైన గిడ్డంగి సదుపాయాలు లేవు. రైల్వే ద్వారా పంపుదామన్నా అన్ని ప్రాంతాలకు రైల్వే అందుబాటులో లేదు.

**కొత్త రైల్వే ప్రాజెక్టులకు రాష్ట వాటా ఏది?**

కేంద్రం నూతన రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేస్తే వాటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదరణ కనిపించడం లేదు. 11 నూతన రైల్వే లైన్లు నిర్మించాల్సి ఉండగా వాటికి అవసరమైన భూసేకరణ, నిధులు సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. వీటిలో నడికుడి–శ్రీకాళహస్తి, కోటిపల్లి–నర్సాపూర్, కడప–బెంగళూరు మధ్య కొత్త లైన్ల నిర్మాణం, గుంటూరు–గుంతకల్, గుంటూరు–నంద్యాల డబ్లింగ్ పనులు, కాజీపేట–విజయవాడ మధ్య ట్రిప్లింగ్ పనులు, గుత్తి, రేణిగుంట వద్ద బైపాస్ నిర్మాణం వంటి పనులు ఉన్నాయి. వీటిని రాష్ట్ర, కేంద్ర వాటా నిధులతో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం పనులకు 4,494 హెక్టార్ల భూమిని సేకరించాలి. ఇందులో ప్రయివేటు భూమి 2,814 హెక్టార్లు, ప్రభుత్వ భూమి 1,438 హెక్టార్లు, అటవీ భూమి 242 హెక్టార్లు కావాల్సి ఉంటుందని గుర్తించారు. ఇప్పటివరకు 2,023 హెక్టార్లు మాత్రమే సేకరించగా, ఇంకా 2,472 హెక్టార్లు సేకరించాలి. మొత్తం భూసేకరణలో ప్రయివేటు భూమితోనే ఎక్కువ సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రంగంలో 2814 హెక్టార్లకు గాను 1161 హెక్టార్లు మాత్రమే సేకరించగలిగారు. ఇంకా 1653 హెక్టార్లు సేకరించాలి. భూమి యజమానులకు చెల్లించాల్సిన పరిహారం, వారికి కల్పించాల్సిన పునరావాసం వంటి అంశాల కారణంగానే సేకరణలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూమికి సంబంధించి కూడా ఇదే తరహా జాప్యం కనిపిస్తోంది. 1438 హెక్టార్లకు గాను 743 హెక్టార్లు సేకరించగా, ఇంకా 695 హెక్టార్లు సేకరించాల్సి ఉంది. అటవీ భూమికి సంబంధించి 242 హెక్టార్లకుగాను 118 హెక్టార్లు సేకరించగా, 124 హెక్టార్లను ఇంకా సేకరించాల్సి ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

ఇక ఏడు పథకాలకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి విడుదల కావాల్సిన రాష్ట్ర వాటా నిధులు ఇంకా విడుదల కాలేదని తెలుస్తోంది. నడికుడి–కాళహస్తి లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆరు వేల కోట్లు కేటాయించగా, ఇంకా రూ.1306 కోట్లు ఇవ్వాలి. విజయవాడ–నిడదవోలు డబ్లింగ్ పనులకు రూ.289 కోట్లు ఇవ్వగా, ఇంకా రూ.1798 కోట్లు, కోటిపల్లి–నర్సాపూర్ పనులకు కేవలం రూ.2.7 కోట్లు ఇవ్వగా, ఇంకా రూ.367 కోట్లు ఇవ్వాలి. భద్రాచలం రోడ్–కొవ్వూరు లేన్‌కు రూ.361 కోట్లు, తుముకూరు–రాయదుర్గం పనులకు రూ.260 కోట్లు ఇవ్వాల్సి ఉంటే ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఇది కూడా పనులు ముందుకు సాగకపోవడానికి కారణంగా చెబుతున్నారు. ఈ మార్గాలను అభివృద్ధి చేస్తే, రాయలసీమ నుంచి ఖనిజ వనరులు తక్కువ ధరకు దేశం నలుమూలలకూ చేరవేయవచ్చు. కాని ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు.


**కేంద్రం ఉరుకులు!**

ఒక పక్క రాష్ట్రం రవాణా వ్యవస్థను తీవ్ర నిరాశకు గురిచేస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎంతో ప్రోత్సాహం ఇస్తోంది. రాష్ట్రంలో రవాణా వ్యవస్థ విస్తరణ, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఉరుకులు పరుగులు తీస్తోంది. కేంద్ర రోడ్లు, రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల అభివృద్ధికి ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. రహదారుల అభివృద్ధికి రూ. 5 లక్షల కోట్లతో వివిధ ప్రాజెక్టులు అమలుచేస్తున్నారు. ఇందులో జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్లు, బైపాస్ రహదారులున్నాయి. 2024 నాటికి ఏపీలో ఈ హైవే ప్రాజెక్టులు పూర్తవుతాయని ఆయన తెలిపారు. అంతేకాదు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఏపీ, తెలంగాణను కలుపుతూ కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ కమ్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల మధ్య సోమశిల వద్ద రూ. 1082.56 కోట్లతో ఈ బ్రిడ్జిని నిర్మించనున్నారు. కేవలం 30 నెలల్లో నిర్మాణం పూర్తిచేయనున్నారు. ఏపీ, తెలంగాణను కలిపే ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నమూనా ఫోటోలను కూడా నితిన్ గడ్కరీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. పోర్టులతో రహదారులను అనుసంధానించే సాగరమాల పథకం ద్వారా లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టులు రాష్ట్రానికి కేటాయించారు. ఇన్ని రకాలుగా కేంద్రం సహకారం అందిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆసక్తి చూపక, మౌలిక సదుపాయాల కల్పనలకు ముందుకు రాక లాజిస్టిక్స్ రంగాన్ని వెనుకంజ వేసేలా చేస్తోంది. ఫలితంగా ఉత్పత్తిదారులు, రైతులు, నిరుద్యోగులు, వినియోగదారులు నష్టపోతున్నారు. ★



❋ పౌరాణికం ❋

# జ్ఞానయోగిని 'స్వయంప్రభ'



శ్రీరామకథ తెలిసిన చాలా మందికి కూడా వెంటనే గుర్తుకు రాని పాత్ర స్వయంప్రభ. కానీ రామ కథాగమనానికి అవసరమైన విశిష్ట పాత్రల్లో స్వయంప్రభ కూడా ఒకటి. ఆమెది వన్నె తరగని ముఖవర్చస్సు, వాడని శరీరం, దుర్నిరీక్ష్యమైన తేజస్సు. శ్రీరామచంద్రుని సేవలో జీవితాన్ని పండించుకొన్న యోగిని ఆమె. నిశితంగా అధ్యయనం చేస్తే రామాయణంలో ఆదికవి తన పాత్రలకు పెట్టిన ప్రతిపేరు సార్థక మనిపిస్తుంది. స్వయంప్రభ పాత్ర కూడా అలాంటిదే. ఆమె స్వయం ప్రకాశమానయైన జ్ఞానయోగిని. ఆమె వృత్తాంతం కిష్కిందకాండలో చూడవచ్చు.

సీతాన్వేషణలో రాత్రింబగళ్లు శ్రమించి అలసిపోయిన వానరులు ఆకలిదప్పులతో దారితప్పి ఒక బిలంలో ప్రవేశిస్తారు. దిక్కుతోచక తల్లడిల్లుతున్న వానర సేనకు, వారికి నాయకత్వం వహిస్తున్న హనుమకు ఆమె చల్లని పలుకులతో ఊరట కలిగించి, ఆశ్రయం కల్పించి, ఆదుకొంటుంది. అతిథి సత్కారాలందించి, తిరిగి రామకార్యసాధనకు వలసిన జవసత్త్వాలను అందించి పరోక్షంగా రామసేవ చేసుకొని తరించిన దివ్యప్రభగా కాంతివంతమైన పాత్రను ఆవిష్కరించారు వాల్మీకికవి. 'తాపసీ ధర్మచారిణీ' అనే విశేషణంతోనే ఆమెను ఎక్కువసార్లు సంబోధించాడు. తమకు మేలుచేసిన ఆ తపస్వినికి తమ వల్ల కలిగే ప్రయోజనం ఏమైనా ఉంటే ఆజ్ఞాపించవలసిందిగా ఆంజనేయుడు ప్రార్థించినపుడు స్వయంప్రభ 'సన్మార్గంలో నడిచేవారికి ఇంకెవరితోనూ చేయించుకొనే పని ఏమీ ఉండదు' అని హనుమ చేయజూపిన సాయాన్ని సున్నితంగా తిరస్కరిస్తుంది.

ఆంజనేయుని అభ్యర్థనతో ప్రసన్నురాలైన ఆమె, హేమా విశ్వకర్మల వృత్తాంతంతో ముడివడిన తన గాథను ప్రస్తావిస్తుంది. 'స తు వర్షాణి సహస్రాణి తప స్తప్త్వా మహావనే' బ్రహ్మ అనుగ్రహంతో శిల్ప శాస్త్రజ్ఞానాన్ని పొంది, అపురూపమైన కాంచన భవనాన్ని నిర్మించాడు మయుడు. హేమతో ఇష్ట భోగాలను అనుభవిస్తూ ఎక్కువ కాలం భూలోకంలోనే నివసించసాగాడు. మయుని సుఖాన్ని చూసి కన్నుకుట్టిన దేవేంద్రుడు వజ్రాయుధంతో ఆతనిని సంహరించగా, ఒంటరియైన హేమ ఈ వనాన్ని స్వయంప్రభకిచ్చి వెళ్లిపోయింది. నాటి నుంచి తాను తపోదీక్షలో ఉంటూ వనాన్ని రక్షిస్తున్నానని చెపుతుంది.

స్వయంప్రభ ఆంజనేయునితో..'ఇదం రక్షామి భవనం హేమయా వానరోత్తమా..దుహితా మేరుసావర్ణే రహం తస్యా స్వయంప్రభా'(ఆనాటి నుంచి హేమకు సంబంధించినదిగానే ఈ వనాన్ని కాపాడుతున్నాను. మేరుసావర్ణి కుమార్తెయైన నన్ను స్వయంప్రభ అంటారు). 'వానరోత్తమ' అని సంబోధించిన స్వయంప్రభతో ఆంజనేయుడు రామకార్యాన్ని ప్రస్తావించి, సమయం గడిచి పోవడం వలన తమ ప్రాణాలకు ముప్పువాటిల్లుతుందని, రామకార్యం భగ్నమౌతుందని, అందువలన తమకు మార్గనిర్దేశం చేయవలసిందని ప్రార్థిస్తాడు.

ఈ బిలంలో ప్రవేశించిన వారు తిరిగి ప్రాణాలతో బయట పడటం అసాధ్యమని, కాని తన తపః ప్రభావంతో రామకార్యార్థులందరిని బయటకు పంపిస్తానని హామీ ఇచ్చి వానరసేననంతటిని ఎవరికి వారు తమ చేతులతో కళ్లు మూసుకోవలసిందిగా ఆజ్ఞాపిస్తుంది స్వయంప్రభ.




❋ తాత్వికత ❋

# సర్దుబాటుతోనే

ఓ ఊళ్లో ఓ చిరువ్యాపారి ఉండేవాడు. అతనెప్పుడూ ఏదో పని మీద అక్కడికి ఇక్కడికీ వెళ్లొస్తుండేవాడు. ఆ క్రమంలో ఒకసారి గాయపడిన అతనికి నడవలేని పరిస్థితి ఎదురైంది. కొన్ని రోజుల తర్వాత అతను మళ్లీ పని మొదలుపెట్టాడు. తన రాకపోకల కోసం అతను ఓ గాడిదను ఏర్పాటు చేసుకున్నాడు.

కొన్ని రోజులు అతను తూర్పు దిశలో, కొన్ని రోజులు పడమర దిశలో, కొన్నిసార్లు ఉత్తరం దిశలోనూ ఇలా ఇష్టమొచ్చిన దిక్కున పయనిస్తూ వచ్చాడు. ఇదంతా గమనిస్తూ వచ్చిన ఆ ఊరి పరిచయస్తులు 'ఎందుకిలా ఆయా దిక్కులు ప్రయాణిస్తున్నావు. ఒక్కొక్కసారి వెళ్లిన కాసేపటికే తిరిగొస్తావు. కొన్నిసార్లు వెళ్లిన వాడివి వెళ్లినట్లే ఉంటావు. ఎప్పటికో తిరిగొస్తావు. ఏమిటో

**దోర్బల పూర్ణిమాస్వాతి**

వానర శ్రేష్ఠులంతా తమ చేతులతో కళ్లు మూసుకుని తల్లి గర్భం నుంచి బయటకొచ్చిన పిల్లల వలే ఆ వృక్షబిలం నుండి బయటపడి తిరిగి సీతాన్వేషణమనే బృహత్కార్యానికి సిద్ధపడి రామసేవకు పునరంకితమయ్యారు.

ఈ ఘట్టాన్ని కేనోపనిషత్తు లోని అంశాలతో పోల్చి విశ్లేషించిన విమర్శకులున్నారు. స్వయంప్రభ గాథ చదివేటప్పుడు కేనోపనిషత్తు గుర్తుకొస్తుంది. వానరులు గుహ నుంచి వెలువడాలంటే కళ్లు మూసుకోమనడం ఈ పదాలకు ప్రతిధ్వని. 'యదేతత్ విద్యుతో వ్యద్యుత్తదా ఇతీన్యమీనిషదా – "కంటిలో మెరుపు వలే క్షణకాలంలో మెరిసిన మెరుపు కన్పించి అది అదృశ్యమైంది.

స్వయంప్రభ వృత్తాంతం కేవలం అపార్థివతత్త్వ కథనంగానే కాక ఈ మాయామయ విశ్వంలో మీమాంసాశాస్త్రంగా, యోగశాస్త్ర పార్యాంశంగా, సాహిత్యంలో ఒక కళాఖండంగా భావించాలి.

రామచంద్రుని దర్శనం ప్రత్యక్షంగా పొందలేకపోయినా రామసేవకులకు సేవచేసి, రామసేవాభాగ్యాన్ని పొందిన ధన్య చరిత జ్ఞానయోగిని స్వయంప్రభ. ధర్మమార్గంలో జీవించేవారికి ఏ ఇతరుల సహకారం అవసరం లేదని నిరూపించిన పాత్ర స్వయంప్రభ. ★

నా వాలకం బోధ పడడం లేదు' అన్నారు.

'మీ అభిప్రాయం సబబే. కానీ ఏం చేయను. నా ప్రయాణాలు పూర్వంలా లేవు. నా రాకపోకలన్నీ నా గాడిద మీదే ఆధారపడి ఉన్నాయి. నేను చెప్పిన చోటికి అది పోవడం లేదు. అసలు నా మాటే వినడం లేదు. అలాగని దానిని విడిచి పెట్టగలనా? నాకు పనవ్వాలి. అదే సమయంలో గాడిదతో పోటీ పడలేను, గొడవా పడలేను కదా' అన్నాడు. 'ఒకవేళ

## ప్రశాంతత

నేను చెప్పినా దానికి అర్థం కాదు కనుక నన్ను నేను మార్చుకున్నాను. అది ఏ దిక్కుకు వెళితే ఆ సమయంలో అటువైపు పనులు కానిచ్చుకుంటాను. దానివల్ల నాకు, నా వల్ల దానికి ఏ సమస్యా లేదు. జీవితం ప్రశాంతంగా సాగిపోతోంది' అని వివరించాడు.

ఇలాగే మన జీవితమూ ప్రశాంతంగా సాగి పోవాలంటే, పరిస్థితులకు అనుగుణంగా సర్దుకు పోతే మన పనులు చేసుకుపోవచ్చు. జీవితమూ ప్రశాంతంగా ఉంటుంది. ★



# సూర్యుణ్ణి ప్రేమించే పొద్దుతిరుగుడు

పొద్దు తిరుగుడు పువ్వునే సూర్యకాంతం పువ్వు, సన్ ఫ్లవర్ అని అంటారు. పొద్దుని బట్టి అంటే సూర్యుని గమనాన్ని బట్టి ఈ పూవు తన ముఖాన్ని తిప్పుతుంటుంది. అందుకే దీనికి పొద్దుతిరుగుడు పువ్వు అనీ, సూర్యకాంతిని బట్టి ముఖాన్ని మార్చుతుందని సూర్యకాంతం పూవు అనీ పేరు. ఫ్రాన్స్ రాజైన 14వ లూయీ ప్రొద్దుతిరుగుడు పువ్వును తన రాజ్యానికి చిహ్నంగా పెట్టుకున్నాడు. అందువల్ల ఆయనను 'సన్ కింగ్' అని పిలిచేవారు. ప్రముఖ చిత్రకారుడు విన్సెంట్ వాన్ గోఫ్ సూర్యకాంతి పువ్వుల చిత్రకారునిగా ప్రసిద్ధి పొందాడు.

పొద్దు తిరుగుడు పూలను హిందీ, ఒరియాల్లో సూరజ్‌ముఖి అనీ, తమిళం, కన్నడ, మలయాళాల్లో సూర్యకాంతి అనీ, గుజరాతి, పంజాబీల్లో సూరజ్ మీఖి అనీ అంటారు. ఈ పువ్వుని మనం జాగ్రత్తగా పరిశీలిస్తే అది ఎప్పుడూ సూర్యుని వైపే తలతిప్పి ఉన్నట్లు కనిపిస్తుంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ సూర్యుని చూస్తూ ఉంటుంది.

'పొద్దుతిరుగుడు పూవులా రోజంతా తిరుగుతూనే ఉంటావు' అంటారు రోజంతా శ్రమచేసే వారిని ఉద్దేశించి.

గ్రీకు పురాణం ప్రకారం,సూర్యుడి అందాన్ని, శౌర్య పరాక్రమాలను చూసి 'క్లైటీ' అనే వనదేవత ఆయన్ని ప్రేమించిందట! కానీ సూర్యుడు ఆమె ప్రేమను అంగీకరించలేదట. అందుకు కారణం ఆయన జలదేవుని కుమార్తె 'డఫ్నే'ను ప్రేమించడమే! తన ప్రేమ విషయం ఆయన 'డఫ్నే' కు తెలుపగా, ఆమె ఆయన ప్రేమను అంగీకరించక తన తండ్రి జలదేవునితో మొర పెట్టుకుందిట! జలదేవుడు తన కూతురిని సూర్యుని నుండి రక్షించుకోవడం కోసం ఆమెను ఒక మొక్కగా చేశాడుట! అయితే సూర్యునే ప్రేమిస్తున్న క్లైటీ, సూర్యుడి కోసం 9 రోజుల పాటు అన్నపానీయాలు మానేసి నిరాహారదీక్ష వహించి, ఒకచోట స్థిరంగా కూర్చుని సూర్యుడు ఉదయించి మరలా అస్తమించేదాకా ఆయన్ని చూస్తూ ఉండేదట. అలా క్లైటీ పువ్వుగా మారిపోయింది. పువ్వుగా మారిన క్లైటీ ప్రతిరోజు తాను ప్రేమించిన సూర్యుడిని చూస్తూ ఉంటుందట. ఆ పువ్వునే మనం సన్ ఫ్లవర్, సూర్యకాంతి పూవు అని పిలుస్తున్నాం.

సరే ఇది కథ. మరి అసలు సూర్యకాంతం పూవు ఇలా సూర్యకాంతి వైపే తిరగడాన్ని సైన్స్ మరో కారణమేదో చెబుతుంది.

సోయా బీన్స్, వేరుశనగ లాగానే ఈ గింజల నుండి తీసిన నూనెను వంటకు వాడుతారు. దీనిలో పుష్కలంగా ప్రోటీన్లతోపాటు కాల్షియం కూడా లభిస్తుంది. విత్తనాలను పగలగొట్టి నూనె తీయగా మిగిలిన పిప్పిని కొలిమిలోనూ, బాయిలర్లలోనూ ఇంధనంగా వాడతారు. దీని పిండిలో ప్రోటీన్లు అధికంగా ఉండడం వలన పశువులకు బలమైన ఆహారంగా ఉపయోగపడుతుంది. ఈ ప్రొద్దుతిరుగుడును ఔషధాల తయారీలోనూ, రంగులు వేయడానికీ కూడా ఉపయోగిస్తారు.

వీలైతే పొద్దు తిరుగుడు మొక్కను నాటుకోండి. ఎంతో అందంగా అరచేయంత ఉండి తన నిండు పసుపు పచ్చని రంగుతో కళ్ళకూ, మనస్సుకూ సంతోషాన్నిస్తుంది కదా! గాలికి తల ఊపే ఆ పూవు మనస్సుకు ఊరటనిచ్చి ఆనందం కలిగిస్తుంది. ★




"హరే మురారే...మధుకైటభారే!" అంటూ పాడుతున్నారు కొందరు.

కొందరు 'వందేమాతరం' గీతాన్ని ఆలపిస్తున్నారు.

ఇలా పదివేలమంది వారివారి వేడుకలలో వారు మునిగి ఉన్నారు.

పదివేలమంది సంతానులు ఏకకంఠంతో 'వందేమాతరమ్' గానం చేశారు. సంతానుల మధ్య సత్యానంద బ్రహ్మచారి వచ్చి నిలబడినాడు. ఆ అరణ్యమధ్యంలో పదివేల మంది సంతానులు ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశారు. సత్యానందుడు ఉచ్చస్వరంలో, జలద గంభీరశబ్దంతో రెండు చేతులు పైకెత్తి "శంఖ చక్ర గదా పద్మధారీ, వనమాలి, వైకుంఠనాథుడు, మధు ముర నరక మర్దనుడు, లోకపాలకుడు అయిన ఆ మహాను భావుడు, మిమ్ము రక్షించుగాక! మీకు భుజబలం ప్రసాదించుగాక! మీరందరూ కలిసి ఆయనను ఒకమారు కీర్తించండి" అన్నాడు. పదివేల కంఠాలు కలిసి సంకీర్తనం ప్రారంభించాయి : "జయ జగదీశ హరే ప్రళయ పయోధిజలే ధృతవానసి వేదం – విహిత వహిత్ర చరిత్ర మఖేదం జయ జగదీశ హరే!"

సంకీర్తనం అయిపోయిన తరువాత సత్యానంద మహరాజ్ తిరిగి వారినందరినీ ఆశీర్వదించాడు. వారినందరినీ ఉత్తేజితపరిచాడు.

"సంతానులారా! మీకందరికీ ఈ రోజు విశేష మైన మాట ఒకటి చెప్పాలి. థామస్ అనే పేరున్న విధర్మ దురాచారి ఒకడు అనేకమంది సంతానులను చంపివేశాడు. ఈ రాత్రి మనం అతడిని ససైన్యంగా బంధించబోతున్నాం. జగదీశ్వరుని ఆజ్ఞ ఇది! మీరందరూ ఏమంటారు?"

"ఇప్పుడే చంపేద్దాం. అందరినీ చంపేద్దాం, శత్రువులను నాశనం చేద్దాం!" ఇటువంటి ఉద్రేక పూరితమైన కేకలు అందరినుండి వెలువడినాయి.

సత్యానందుడు తిరిగి ఇలా చెప్పాడు : "మనం మనలో ధైర్యసాహసాలను నింపుకోవాలి. శత్రువుల దగ్గర తుపాకులున్నాయి. మనమూ తుపాకులతో తప్ప వారితో యుద్ధం చేయడం కుదరదు. విశేషించి వారంతా బలవంతులు. మన పదచిహ్న గ్రామం నుండి 17 మరఫిరంగులు వస్తున్నాయి. వాటితో మనం యుద్ధసన్నద్ధులం కావాలి. చూడండి. సూర్యోదయం అవుతున్నది. నాలుగు గంటల బ్రహ్మ ముహూర్తంలో... అదేమిటి?..."

'ధన్, ధన్, ధన్' అకస్మాత్తుగా నాలుగు చెరగుల నుండి వచ్చిన ఫిరంగుల ధ్వనులతో దిక్కులు పిక్కటిల్లి నాయి. ఇవి ఇంగ్లీషువారి ఫిరంగి పేలుళ్లు. వలలో పడిన చేపను పట్టుకున్నట్లుగా ఇక్కడ చేరిన సంతాను లందరినీ చంపడానికి థామస్ పెద్ద ఎత్తున వచ్చాడు.

**7**

ఆంగ్లేయుల తుపాకులు గర్జనలు చేస్తున్నాయి. ఈ ధ్వనులు అరణ్యంలో ప్రతిధ్వనిస్తున్నాయి. సత్యానందుడు అవి ఎటువంటి ఫిరంగులో చూచి రమ్మని కొంతమందిని ఆదేశించాడు. కొందరు సంతానులు గుర్రాల మీద ఎక్కి ధ్వని వస్తున్నవైపుగా బయలుదేరి వెళ్లారు. కానీ వారు వాటి విషయం పరిశీలించి చూడడానికి ముందుగానే ఫిరంగి గుండ్లు వారిని చీల్చి విగత ప్రాణులను చేసినాయి. గుర్రాలు కూడా మరణించినాయి. సత్యానందుడు ఈ విషయం గమనించ గలిగినాడు. జీవానందునితో "ఎత్తయిన చెట్టు ఎక్కి చూడు, తెలుస్తుందేమో!" అన్నాడు.

జీవానందుడు ఒక నిడివి అయిన వృక్షాన్ని ఎక్కాడు. చూసి వెంటనే చెప్పాడు. 'ఆంగ్లేయుల సైన్యం' అని.

"అశ్వదళమా లేక పదాతిదళమా?"

"రెండూ ఉన్నాయి"

"సుమారు ఎంత సైన్యం ఉంటుంది?"

"చెప్పలేను. ఇంకా వెల్లువగా వస్తూనే ఉన్నారు."

"తెల్లవారి దేశీయులేనా?"

"తెల్లవారు!"

"సరే, చెట్టుదిగి కిందికి రా."

జీవానందుడు అలాగే కిందికి దిగివచ్చాడు. "పదివేల మంది సంతానులం ఇక్కడే ఉన్నాం. మనం ఏం చేయగలమో చూద్దాం. జీవానందా! ఈ రోజు నీవు సేనాపతివి!" అన్నాడు సత్యానందుడు.

జీవానందుడు సమరోత్సాహంతో అశ్వారోహణం చేశాడు. ఒకమారు నవీనానందునివైపు దృష్టి మరల్చి కనుసైగతో ఏమో చెప్పాడు. నవీనానందుడు కూడా కనుసైగతోనే బదులు చెప్పాడు. దాని వివరం ఇతరుల కెవరికీ తెలియదు. ఈ జన్మకు ఇదే అంతిమదర్శనం అని బహుశ ఆ ఇద్దరి అభిప్రాయం అయి ఉంటుంది.

నవీనానందుడు దక్షిణహస్తం పైకి ఎత్తి "సోదరులారా! సమయం ఆసన్నమైంది. ఒకమారు జయ జగదీశహరే అనే అష్టపదిని ఆలపించండి. మనం పదివేల మందిమి ఉన్నాం. అందరమూ ముక్తకంఠంతో పాడుదాం." వారి పాటకు దిక్కులన్నీ పిక్కటిల్లినాయి.

ఈసరికి ఆంగ్లేయుల తుపాకి గుండ్లు అరణ్యాన్ని దాటి వచ్చి సంతానులపై కురుస్తున్నాయి. పాడుతూ పాడుతూ వున్న సంతానులు తలలు తెగిపోయి,





బంకించంద్ర చటర్జీ

చేతులు ఊడిపోయి, గుండెలు బద్దలయిపోయి, ఒక్కొక్కరే నేలకు ఒరుగుతున్నారు. అయినప్పటికీ గీతాలాపన మటుకు ముగియలేదు. 'జయ జగదీశ హరే' అనే పాట ఇంకా ఆకాశాన్ని అంటుతూనే ఉంది.

పాట పూర్తి అయేసరికి అంతటా నిస్తబ్ధత అలుముకుంది. వాతావరణం అంతటా నది, అరణ్యం, అంతటా నిస్తబ్ధత ఆవరించింది. తుపాకుల గర్జన, ఆంగ్లేయుల అస్త్రాల రాపిడిధ్వనులు, పద ధ్వనులు, దూరం నుండి వినవస్తున్నాయి.

ఈ భయంకర నిస్తబ్ధతను ముగింపజేస్తూ సత్యానందుడు "భగవానుడు మనపై దయకలిగి ఉన్నాడు. ఆంగ్ల సైన్యం మనకు ఎంతదూరంలో ఉంది?" అన్నాడు.

"ఈ అరణ్యానికి సమీపంలోనే, చిన్న మైదానం పక్కనే ఉంది" అని బదులు వచ్చింది.

"ఎవరు నీవు?"

పైనుంచి వచ్చిన జవాబు, "నేను నవీనానందుడను."

సత్యానందుడు తిరిగి "మీరు పదివేలమంది ఉన్నారు. మీకు విజయం చేకూరుతుంది. ఇంకా చూస్తారెందుకు? ఫిరంగులు తీసుకురండి" అన్నాడు. గుర్రం మీదున్న జీవానందుడు "పదండి, సోదరులారా!" అన్నాడు.

అశ్వారోహణం చేసి కొందరు, కాలినడకను కొందరు మొత్తం పది వేల మంది సంతానులు ముందుకు నడిచారు. పదాతిదళం భుజాలపై తుపాకి, మొలలో ఖడ్గం, చేతిలో బల్లెం ఉన్నాయి. అరణ్యం దాటి బయటకు రావడంతోటే నిరాఘాటంగా వస్తున్న పిస్తోలు గుళ్లు వారిని తునాతునకలు చేయసాగాయి. ఎందరో సంతానులు యుద్ధానికి ఆయత్తం కాకముందే ప్రాణత్యాగం చేస్తున్నారు. జీవానందుని వెనుక నుండి ఒకరు ఇలా అన్నారు: "జీవానందా! అనవసరంగా ప్రాణత్యాగం చేసుకున్నందువల్ల ఏమి ప్రయోజనం?"

జీవానందుడు వెనుదిరిగి చూచాడు. ఈ మాటలు అన్న వ్యక్తి భవానందుడు. "అయితే ఇప్పుడు ఏం చేయమంటావు?" అన్నాడు జీవానందుడు.

"అరణ్యంలోనే వృక్షాల ఆశ్రయంలో ప్రాణరక్షణ చేసుకోవడం మంచిపని. మైదానం దాటి ఆవలకు వెళ్లామంటే మన సైన్యం అంతా నాశనం అయిపోవటానికి ఎంతో సమయం పట్టదు. అదే అరణ్యంలో ఉంటే చాలసేపటి వరకు యుద్ధం కొనసాగించటానికి అవకాశం ఉంది."

"మీరు చెబుతున్నది బాగుంది. కాని ప్రభువు వారి ఆజ్ఞ మర ఫిరంగులను ఎత్తుకు రమ్మని. అందుచేత మనం ఇప్పుడా పని మీద వెడుతున్నాం."

"తుపాకులు ఎత్తుకు రావడానికి ఎవరికి సత్తువ ఉంది? అలా వెళ్లక తప్పనిసరి పరిస్థితి వస్తే నేను వెడతాను. నీవు ఇక్కడే వుండిపో."

"అలాకాదు భవానందా! నేడు నా మరణదినం!"

"కాదు. నేడు నా మరణదినం! నేనివాళ ప్రాయశ్చిత్తం చేసుకోవాలి!"

"నీవు ఏ పాపము ఎరుగనివాడివి. నీవు ప్రాయశ్చిత్తం చేసుకోవలసిన అవసరం ఏమీ లేదు. కాని నా చరిత్ర కలుషితమైనది. నేనే చనిపోవాలి. అందుచేత నన్ను వెళ్లనీ!"

"భవానందా! నీవు ఏం పాపంచేశావో నాకేమీ తెలియకుండా ఉంది. నీవు ఇక్కడ నిలచివుంటే సంతానుల కర్తవ్యం నెరవేరుతుంది. నీవే వుండిపో. నేను వెళుతున్నాను."



భవానందుడు నీరవుడై "చనిపోవలసిన అవసరం వస్తే యిప్పుడే చనిపోదాం. మృత్యువుకు సమయా సమయాలు, సుదిన దుర్దినాలు ఏమున్నాయి?" అన్నాడు. "అయితే పద" అన్నాడు జీవానందుడు.

ఈ మాటతో మొత్తం సైన్యం ముందుకు నడిచింది. సంతాన సైన్యం ఒక్కొక్క ఫిరంగి గుండుకు ఒక్కొక్క మనిషిగా నేలకు కూలుతోంది. సంతాన సైన్యం ముక్కలు ముక్కలు అయిపోతోంది. మొదలు నరికిన చెట్ల వలె అందరూ నేల కూలిపోతున్నారు. భవానందుడు బిగ్గరగ "ఈరోజు సంతానులు సముద్రంలోనికి ఉరకవలసిన సమయం. సముద్ర కెరటాలవలె ముందుకు వచ్చి పడడానికి ఎవరెవరు సిద్ధంగా ఉన్నారో, రండి" అన్నాడు.

'వందేమాతరం' గీతం సహస్రకంఠాల నుండి వెలువడుతోంది. ఫిరంగి గుండ్లు వచ్చిపడుతున్నాయి. సంతాన సైన్యం స్థిర సంకల్పంతో ముందుకు ఉరికి వస్తోంది.

**8**

పదివేల సంతాన సైన్యం 'వందేమాతరం' గీతాన్ని ఆలపిస్తూ ఫిరంగుల వరుస మీదికి ఉరుకుతోంది. ఫిరంగి గుండ్ల దెబ్బలకు హత ప్రాణులవుతున్నారు గాని ఎవరూ వెనుదిరిగి పారిపో ప్రయత్నించడం లేదు. ఘనఘోరమైన యుద్ధం ఆరంభమైంది. థామస్ సేన ఒకభాగం చీలి సంతానులకు కుడి పక్కగా వచ్చి చేరి కాల్పులు సాగిస్తోంది. ప్రతిక్షణం వందల సంఖ్యలో సంతానులు ఈ లోకాన్ని వదులు తున్నారు. జీవానందుడు "భవానందా! నీవు చెప్పినదే సరి! ఇంత మంది సంతానులు ప్రాణత్యాగం చేయవలసిన అవసరం ఏమి? వెనక్కు మళ్లుదాం" అన్నాడు.

భవానందుడు "ఇప్పుడు ఆ మార్గం కూడా లేదు. వెనక్కు తిరిగినవాడల్లా ఫిరంగిగుండుకు నేల కూలుతాడు" అన్నాడు.

"ఎదురుగా, కుడిపక్క వారి సైన్యాలు ఆక్రమించు కుని కాల్పులు జరుపున్నాయి. మనం మెల్లి మెల్లిగా ఎడమ వైపుకు తప్పుకుందాం."

"ఎడమవైపు నది ఉంది. ఫిరంగి గుండ్లకు భయ పడి సంతానులు నదిలో కలిసిపోవలసి వస్తుంది."

"నదిపై వంతెన ఉందికదా!" "వంతెన ఇంత మందిని భరించగలదా? అదీగాక అందరూ వంతెన మీద ఉండగా ఒక్క ఫిరంగి గుండు వచ్చి వంతెనను తాకితే, అందరూ నదీగర్భంలో పడిపోతారు."

"అలా అయితే ఒకపని చేద్దాం. నీవు కొంత మంది సైన్యంతో ఇక్కడ యుద్ధం చేస్తూ ఉండు. నేను మిగతా సైన్యాన్ని వంతెన దాటిస్తాను. ఇక్కడి వారంతా మరణించినా, మిగతా సైన్యం బతికి ఉండడానికి అవకాశముంటుంది."

"అలాగే చేద్దాం."

రెండువేల మంది సైన్యంతో భవానందుడు ముందుకు నడుస్తున్నాడు. అతడిలో ఇప్పుడు అపూర్వమైన ఉత్సాహం ఉత్పన్నమైంది. యుద్ధం ఘోరరూపాన్ని ధరించింది. కాని ఫిరంగుల ముందు సంతానులు ఎంతవరకు నిలువగలుగుతారు? అందరూ పృథ్వీతలంపై ఒరిగిపోతున్నారు.

ఇటువైపు జీవానందుడు అవశిష్ట సైన్యాన్ని తీసుకుని నది ఒడ్డుకు చేరుకున్నాడు. అయితే థామస్ సహాయకుడైన లెఫ్టినెంట్ వాట్సన్ కొందరు సంతా నులు పారిపోయే ప్రయత్నంలో ఉన్నారని గమనిం చాడు. దేశీయ సైన్యాన్ని తీసుకుని వారిని వెంట తరిమాడు. థామస్ ఎదురుగా ఉన్న సేన కంటే, నదివైపు పారిపోతున్న సేన ఎక్కువ కనుక, తాను పదాతిదళాన్ని మాత్రం ఉంచుకుని, అశ్వికులను వాట్సన్‌తో పంపాడు. కాని థామస్ కేవలం రెండు వందల మంది కాలి బంట్లు ఇక్కడ భవానందుని సేనను ఎదుర్కొనడానికి సరిపోతారని అంచనా వేయడంలో తప్పుచేశాడు. అతడి దురహంకారం, ఎదుటి బలాన్ని తక్కువగా భావించడం, భవా నందుడికి సహాయం చేసినాయి.

అంతవరకు సంతానుల వద్ద రణవాద్యాలు అంటూ ఏమీ లేవు. కాని ఇప్పుడు మటుకు ఎక్కడి నుంచో నగారాలు, డోళ్లు, భేరీవాద్యాలు, మృదంగాలు, సన్నాయిలు ఇటువంటివెన్నో వచ్చినాయి. వాటి ధ్వనికి నదీనదాలు, భూమి, అరణ్యం వణికిపోతున్నాయి. ఈ విధంగా సంతానులు చాలాసేపటి వరకు తమ విజయోత్సాహాన్ని ప్రకటించుకున్నారు.

భవానందుడు థామసు బందీగా పట్టుకోగలి గాడు. అతడిని గుర్రానికి కట్టివేసి, జీవానందునికి సహాయం చేయడానికి ఈ దళం కూడా నదివైపు నడిచింది.

అప్పటికి జీవానందుని వెంటనున్న సైన్యం అన్ని ఆశలు అడుగంటిపోయి ఉంది. సరిగ్గా ఆ సమయా నికి భవానందుని నుండి సహాయం అందింది గనుక సంతానులు పుంజుకోగలిగారు. కాని భవానందుడు ఈ పోరాటంలో కన్నుమూశాడు. మరణ సమయంలో 'వందేమాతరం' గీతం ఆలపిస్తున్నాడు. థామస్‌తో సహా తెల్లవారందరూ ప్రాణాలు కోల్పోయారు.

రణంలో విజయం పొందిన మీదట సంతానులు ఉత్సవాలు జరుపుకుంటున్నారు. వారు ఈ ఉత్సవా లలో పూర్తిగా నిమగ్నులై ఉన్మత్తులై ఉన్నారు. సత్యానందుడు మటుకు భవానందుని కోసం శోకసాగరంలో మునిగి ఉన్నాడు.

అంతవరకు సంతానుల వద్ద రణవాద్యాలు అంటూ ఏమీ లేవు. కాని ఇప్పుడు మటుకు ఎక్కడి నుంచో నగారాలు, డోళ్లు, భేరీవాద్యాలు, మృదం గాలు, సన్నాయిలు ఇటువంటివెన్నో వచ్చినాయి. వాటి ధ్వనికి నదీనదాలు, భూమి, అరణ్యం వణికి పోతున్నాయి. ఈ విధంగా సంతానులు చాలాసేపటి వరకు తమ విజయోత్సాహాన్ని ప్రకటించుకున్నారు.

ఉత్సవ సమారోహంలో సత్యానందస్వామి ఇలా అన్నాడు : "నేడు భగవంతుడు మనపట్ల సహృదయుడై ఉన్నాడు. సంతానులకు విజయం చేకూరింది. ధర్మానికి జయం లభించింది. అయినా ఇంకొకమాట చెప్పుకోవలసి ఉంది. ఈ ఉత్సవంలో శరీరంతో పాల్గొనటానికి అవకాశం లేనివారినందరినీ, అంటే యుద్ధంలో మరణించినవారినందరినీ, మనం మరచి పోరాదు. భవానందుని వంటి వీరుని కారణంగానే మనం విజయం సాధించగలిగాం. అలా హతులైన వారికందరికీ మనం అంత్యక్రియలు జరపాలి."

ఈ మాటలు వింటూనే అందరూ 'వందే మాతరం' అనుకుంటూ జయ జయధ్వానాలు చేసుకుంటూ రణక్షేత్రం వైపు మరలారు. భవానందుని మృతదేహానికి చందనచర్చలు చేసి, దానికి అంత్యక్రియలు జరిపారు.

ఈ పనులన్నీ అయేసరికి, అరణ్యంలో సత్యా నందుడు, జీవానందుడు, మహేంద్రుడు, నవీనా నందుడు, ధీరానందుడు మాత్రం మిగిలారు. తతిమ్మా వారందరూ వెళ్లిపోయారు. వీరు అయిదు గురు మాత్రం సమాలోచన కోసం అక్కడ ఉండి పోయారు.

"ఇన్ని రోజులుగా మనం సర్వకర్మలను, సర్వ సుఖాలను ఎందుకు త్యాగం చేశామో, ఆ కార్యం ఇప్పుడు నెరవేరింది. ఆ వ్రతం ఇప్పటికి పూర్తయింది. ఇప్పుడు ఈ ప్రదేశంలో యవన సైన్యం ఏమాత్రం మిగిలిలేరు. ఏ మూలనైనా కొద్దిమంది మిగిలి ఉన్నాగానీ వారు మనముందుకు వచ్చి నిలువలేరు. ఇంక ఏం చేయాలో మీరు ఆలోచించారా?" అన్నాడు సత్యానందుడు.

జీవానందుడు ''వెళ్లి రాజధానిలో మన అధికారాన్ని స్థాపించడానికి ప్రయత్నిద్దాం."

''నా ఉద్దేశం కూడా అదే!'' అన్నాడు సత్యానందుడు. "సేన ఎక్కడుంది?" ధీరానందుడు అడిగాడు. "ఇదే సేన!" సత్యానందుడు. "ఇక్కడ సేన కనిపి స్తోందా మీకు? ఏదీ?" అన్నాడు తిరిగి.

"బహుశ విశ్రాంతి తీసుకుంటున్నారేమో! ఢంకా మోగిస్తే తిరిగివస్తారు." "ఒక్కరూ రారు. అందరూ గ్రామాలను దోచుకోటానికి వెళ్లారు. ఇప్పుడు గ్రామా లన్నీ భద్రత లేకుండా ఉన్నాయి. యవనుల ఇళ్లన్నీ దోచుకునిగాని మనవాళ్లు తిరిగిరారు."

**(సశేషం)**

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు



# ఏడుతరాల శనికి 'సర్దార్' చరమగీతం

***'మై** పాన్ బానే దీన్ హూం!*
*కుఫర్ కా జల్లాన్ హూం!'*


(నేను ఇస్లాం రక్షకుడిని, ముస్లిం కాని వాని తల నరికే వాడిని) అని హైదరాబాద్ చివరి నిజాం కవితా పంక్తులు ఆయన మనస్తత్వానికి అద్దం పడతాయి. ఇలాంటిదే ఆయన రాసుకున్న మరో కవిత.

***'బందే నా కూస్ హువా మనకే నారాయేట్ బీర్***
***జల్ జలా ఆ హీ గయా రిశ్తోయే జున్నార్ పర్'***

(అల్లాహో అక్బర్ అనే కల్మాధ్వని వినబడటంతోనే శంఖనాదం ఆగిపోయింది. ఇది హిందువుల జంధ్యాల్ని, మతచిహ్నాల్ని భూకంపం నుండి లేచిన మట్టి కప్పేసింది).

పోలీసు చర్య అనంతరం సర్దార్ వల్లభభాయ్ పటేల్‌తో 'హిందూ ముస్లింలు నాకు రెండు కళ్లులాంటి వారు' అని నిజాం బొంకినప్పుడు పైన తెలిపిన కవితా పంక్తులను పటేల్ తన కార్యదర్శి మీనన్‌తో చదివించి వినిపించారట.

సాధారణంగా 'ఏలినాటి శని ఏడు సంవత్సరాలు' అంటారు. కాని హైదరాబాద్ సంస్థానానికి మాత్రం ఏడుగురు నిజాంల ఏడు తరాల శని పట్టింది. ఆ శని ప్రభావం 224 ఏళ్లుంది. అందులో 1911 నుండి 1948 వరకూ శని ప్రభావం తీవ్రంగా ఉంది. సుమారు 37 సంవత్సరాలు హిందువులను ఔరంగజేబును మించి ఏడిపించి ఏడిపించి వదిలాడు. తాను నిజాం కాగానే తండ్రి కాలం నుంచి హైదరాబాద్ సంస్థానానికి ప్రధానిగా వున్న సర్ కిషన్ ప్రసాద్‌ను తొలగించి ఓ ముస్లింను నియమించాడు.




కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు


ముస్లిం మత తత్త్వవాదులు ఖాక్సర్ పార్టీని ప్రారంభించారు. దీని సభ్యులను బేల్పాపౌజ్ (బేల్పాలంటే గొడ్డలి) అనే వారు. వారంతా గొడ్డళ్లను ధరించేవారు. హిందువులపై హింస, దోపిడీ కొనసాగించేవారు. వారికి నిజాం సంపూర్ణ మద్దతు ఉండేది. నిజాం ప్రభుత్వంలో విద్యాశాఖాధికారి 'అల్లమామశ్రకి' దీని కార్యకలాపాలను పర్యవేక్షించడమే అందుకు ఉదాహరణ. బహదూర్ యార్జంగ్ 1927లో ఇత్తేహదుల్ ముస్లిమీన్ సంస్థను స్థాపించగా, అటు తర్వాత అది కాశీం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకార్ల సైన్యంగా మారి, నిజాం సైన్యంతో కలిసింది. 'ఇస్లాం రాజ్యస్థాపన' దాని ముఖ్య ఉద్దేశ్యం. మరోవంక సిద్దిక్ దీనార్ ఉద్యమం (1929) హైదరాబాద్ అసిఫ్‌నగర్ కేంద్రంగా ప్రారంభమైంది. సిద్దిక్ తనను తాను చెన్న బసవేశ్వరుని అవతారంగా ప్రచారం చేసుకుంటూ వేలాది హిందువుల్ని మోసం చేసి నిజాం అండతో మత మార్పిళ్లు చేశాడు. నిజాంను పాండురాజు అవతారంగా చిత్రించాడు.

హైదరాబాద్ సంస్థానంలో ముస్లిం జనాభా పెంపుకోసం వివిధ ప్రాంతాల నుండి ముస్లింలను దిగుమతి చేసుకున్నాడు. 1948 నాటికి సంస్థానంలో ఎనిమిది లక్షల మంది ముస్లింలను రప్పించారు. వారిలో వేలాదిగా నిజాం సైన్యంలో, మిగిలినవారు రజాకార్లలో చేరారు. భారత ప్రధానమంత్రి, హోంమంత్రి పార్లమెంటులో ఈ విషయం ప్రకటించారు. ముస్లిం విద్యార్థులను పెద్ద సంఖ్యలో రజాకార్లలో చేర్చుకున్నారు. '...అనే పేరు గల నేను నా నాయకుడు ఎన్నడు నన్నాజ్ఞాపించినా, పార్టీ శ్రేయస్సు కోసం, నా జీవితం అంకితం చేయడానికి ఇందుమూలంగా పవిత్ర శపథం చేస్తున్నాను' వారితో ప్రతిజ్ఞ చేయించేవారు. '1940లో రజాకారదళం ఏర్పడింది. అందులోని వారికి సైనిక శిక్షణ ఇప్పించాలని 1947 జూలైలో నిర్ణయించిన మేరకు సంస్థానమంతటా భారీ ఎత్తున రజాకార్ల రిక్రూట్‌మెంట్ జరిగింది. పెద్దలు, పిల్లలు, స్త్రీలను కూడా రిక్రూట్ చేసుకున్నారు. నవంబర్ 3, 1947 నాటికి సర్కార్ లెక్కల ప్రకారం రజాకార్ల సంఖ్య 50 వేలు కాగా, ఆ సంఖ్యను ఐదు లక్షలకు పెంచనున్నట్లు కాశీం రజ్వీ ప్రకటించాడు' అని ప్రొఫెసర్ సరోజినీ రేగానీ నివేదిక పేర్కొంటోంది. రజాకార్ల రోజువారీ ఖర్చు 30 వేల రూపాయలకు మించి ఉండేది. మేజర్ అమీరుద్దీన్, ఎల్ కల్నల్ గులాం మొహియుద్దీన్ ఆయుధ శిక్షణ ఇచ్చేవారు. రజాకార్లకు కావలసిన ఆయుధాలు, వాహనాలు, తర్ఫీదు, డబ్బు సకలం నిజాం సమకూర్చేవాడు. 1935 నుండి 1948 వరకు ఇటు రజాకార్లూ, అటు నిజాం సైన్యం వారి అనుయాయులు హిందూ సమాజంపై ఎడతెరిపి లేకుండా దమనకాండ సాగించారు.

'రజాకార్ల మూకలు 70 గ్రామాలపై దాడులు జరిపి వందలాది మందిని హత్య చేశారు. వేలాది మందిని గాయపరిచారు. అనేకమంది మహిళలపై అత్యాచారాలు జరిగాయి. పన్నెండు రైలు దోపిడీలు జరిగాయి. కోట్ల రూపాయలు ఆస్తి లూటీ అయ్యింది.

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

మాన, ప్రాణాలను కాపాడుకునేందుకు లక్షలాది మంది సరిహద్దు ప్రాంతాలకు వెళ్లిపోయారు' అని సెప్టెంబర్ 7, 1947న నాటి ప్రధానమంత్రి పార్ల మెంట్‌కు వివరించారు. హైదరాబాద్ సంస్థానంలో రజాకార్లు హిందువుల నుంచి దోచుకున్న సొమ్ము 70 కోట్ల రూపాయల కంటే ఎక్కువే, నిజాం వాటా పోగా 40 కోట్లు ముట్టి వుంటుంది అని వందేమాతరం రామచంద్రరావు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

సంస్థానాభివృద్ధికి పెద్దగా ఖర్చు చేయకుండా, ప్రపంచవ్యాప్తంగా అనేక ముస్లిం సంస్థలకు విరివిగా విరాళాలిచ్చాడు. మక్కా, మదీనా, టర్కీ పాలస్తీనా, ఈరాక్, బస్రాలోని ముస్లింలకు, ఢిల్లీ జామా మసీదుకు, ఆలీఘర్ ముస్లిమ్ యూనివర్సిటీకి, ఆజ్మీర్లో ముజాఫర్లు, బాల్కన్ యుద్ధంలో రక్తపాతం సృష్టించిన జిన్నాకు రూ.20 కోట్లు సాయం చేశాడు.

రజాకార్లు హిందువులపై దురాగతాలు సాగించి నప్పటికీ తమను విమర్శించేవారు ముస్లింలనైనా వదిలేవారు కారు. రయ్యత్ పత్రిక సంపాదకుడు షోయబుల్లా ఖాన్ హత్యోదంతం అందుకు ఉదాహరణ. ఎదిరించిన, స్వేచ్ఛ గురించి మాట్లాడిన, పోట్లాడిన వేలాదిమంది విద్యార్థుల్ని, సత్యాగ్రాహుల్ని, సాయుధ దేశభక్తుల్ని అతి కర్కశంగా హత్య చేశారు.

బ్రిటీష్ వారు ఈ దేశం విడిచి వెళ్లిన వెంటనే హైదరాబాద్ స్వతంత్ర రాష్ట్రమవుతుందని జూన్ 12, 1947లో నిజాం ఫర్మానా జారీ చేశాడు. ఆ ఏడాది ఆగస్టు 14న బ్రిటీష్ రెసిడెంటుకు వీడ్కోలు విందు ఇస్తూ తన ఉద్దేశాన్ని పునరుద్ఘాటించాడు. 17న హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర రాజ్యంగా ప్రకటించి అంతర్జాతీయ మద్దతు కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు, 'హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో అంతర్భాగమవుతుందని అనుకోవడం అర్థరహితం' (జనవరి 26, 1947 'సుబా–ఎ–దక్కన్' ఉర్దూ పత్రిక) అని ప్రకటించాడు. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి జఫరుల్లా ఖాన్ చేత హైదరాబాద్ రాష్ట్రానికి మద్దతు ప్రకటింపచేశాడు. నాటి బ్రిటిష్ ప్రధాని విన్స్టన్ చర్చిల్ జూలై 30, 1948న హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రసంగిస్తూ... ఐక్యరాజ్యసమితిలోని 52 దేశాల్లో 20 దేశాలు హైదరాబాద్ కంటే పెద్దవని, 16 దేశాలు దాని కంటే తక్కువ ఆదాయం కలిగినవని నిజాం అంతరంగాన్ని సమర్థించాడు.

ఉస్మాన్ ఆలీఖాన్ తన పైశాచిక కామ ప్రవృత్తిని సంతృప్తి పరచుకోవడం కోసం 360 మంది అందమైన స్త్రీలను తన రాజప్రసాదంలోనే ఉంచు కున్న ఘనుడు. వారికి పుట్టిన సాహెబ్ జాదాల్ని (రాజకుమారుల్ని) రాజ్యం మీదికి వదిలి వేయడం, వారు, వారి బంధువర్గం, సైన్యం రజాకార్లు కనపడ్డ కన్నె, వివాహిత, పిల్లలు, వృద్ధులు అనే వయోభేదం లేకుండా ఎత్తుకొని పోయి మానభంగం చేయడం, ఇష్టమైతే ఉంచుకోవడం, లేకపోతే చంపేయడమనేది అతి సామాన్యమైన విషయంగా ఉండేది.

నిజాం ఏటా పుట్టినరోజు (సాల్గిరా)చేసుకుంటూ కానుకలు స్వీకరించడం ఆచారంగా మారింది. తన ఇష్టం వచ్చినప్పుడల్లా ఎవరినో ఒకరిని పిలిచి 'నజరానా'లు అందుకుని బిరుదులిచ్చేవాడు. జాగీరులెవరైనా చనిపోతే వారి వారసుల పేర ఆస్థి మార్పిడికి పెద్ద మొత్తం నజరానాగా ఇచ్చుకోవాలి. వారసులు లేకపోతే ఆస్థిని తానే ఉంచుకుంటాడు.

'సర్ వాల్టర్ మాక్టన్' అనే బ్రిటీషీయుడు సంస్థానంలో రాజ్యాంగ సలహాదారు ఉండే వాడు. అతనికి సంవత్సరానికి ఏడు లక్షల రూపాయల వేతనం లభించేది అతడు హైదరా బాదులో సుమారు ముప్పయేళ్లు హాయిగా గడిపేశాడు. 1948లో పోలీసు చర్య అనంతరం అతడు లండన్ వెళ్లి పోయాడు.


కాశీం రజ్వీ

కమాల్ ఖాన్ అనే జాగీరుదారు హైదరాబాద్‌లో అందమైన బంగ్లా నిర్మించుకుని నిజాంను ప్రత్యేక విందుకు పిలిచాడు. అది నచ్చిన నిజాం 'దీన్ని మేం రాజభవనం చేసుకుంటాం' అనడంతో చేసేది లేక ఆయన దానిని నిజాంకు ఇచ్చాడు. అదే నేటి కింగ్ కోఠి.

రెండు అష్రఫీలు (తులం బంగారం)కు 'జంగ్, నవాబ్, జంగ్, యార్ జంగ్' బిరుదులిచ్చేవాడు. నిజాం మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ తరచూ అమీర్లు, జమీందార్ల ఇళ్లకు వెళ్లి ఇంటిల్లిపాది నుండి నజరానాలు స్వీకరించే వాడు. తన తోటలో పండిన మామిడి, అరటిపండ్లను కచేరీలకు పంపుతూ, దానితో పాటు చీటీలు కూడా జత చేసేవాడు. ఆయా కచేరీలు నిజాంకు ఎంత సొమ్ము పంపాలో వాటిలో రాసి వుండేది. భూమి శిస్తు రూపాయికి ఒక అణా చొప్పున లోకల్ ఫండుకు, అర్థ అణా బంచరాయి కోసం, ఒక అణా నిజాం నజరానా కోసం ప్రజల దగ్గర నుండి వసూలు చేసి నిజాంకు పంపేవారు.

సాంస్కృతిక దురాక్రమణలో భాగంగా తెలుగు భాష నిర్లక్ష్యానికి గురైంది. దక్షిణాపథం దక్కన్‌గా మారింది. పాలమూరు మహబూబ్‌నగర్, ఇందూరు నిజామాబాద్ అయ్యాయి. ఇలా తెలంగాణా ప్రాంతంలోని ఎన్నో పేర్లు మారిపోయాయి.

*'టూఅబద్ ఖాలి అలం యే తియాసత్రఖే*
*తురుఖుకో ఉస్మాన్ బసదా ఇజ్జాల్ సలామత్ రఖే?'*

(జగత్కర్త ప్రళయం వరకు నీ రాజ్యాన్ని ఉంచనీ, ఓ ఉస్మాన్ నిన్ను నిండు దర్పంతో ఉంచని...) అని పాఠశాలలో మీరే ఉస్మాన్ ఆలీఖాన్‌ను కీర్తిస్తూ ప్రార్థన చేయాలి. విద్యార్థులందరూ పైజమా, నీలిరంగు షెర్వానీ మాత్రమే ధరించి కాలేజీలకు వెళ్లాలనే నిబంధన ఉండగా, చాలా మంది విద్యార్థులు ధోవతులు, చొక్కాలతో తరగతులకు హాజరయ్యేవారు. అలాంటి వారిని విశ్వవిద్యాలయం నుంచి


రజాకార్లు

పంపివేయడంతో (నవంబర్ 29,1938) వారు నాగపూర్ వెళ్లారు.

1920లో 46వ నెంబర్ ఫర్మానా ప్రకారం హిందూ సార్వజనిక కార్యక్రమాలపైన నిషేధం విధించారు. దీని ప్రకారం జాతీయ నాయకుల ఫోటోలు ప్రదర్శించకూడదు. జాతీయ గీతాలు, 'వందేమాతరం' పాడకూడదు. ఆర్య సమాజం నిజాం నిరంకుశత్వాన్ని సవాల్ చేసింది.. అనుమతి లేకుండా ఏ శుభకార్యాలు, ఊరేగింపులు, చివరకు శవయాత్రలపై కూడా నిజాం ప్రభుత్వం నిషేధం ఉండేది.

1947 ఆగస్టు 15 తర్వాత భారతావని స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకుంటూ సంబరాలు జరుపుకుంటుండగా, హైదరాబాద్ సంస్థానంలోని హిందూ ప్రజానీకం నిజాం నియంతృత్వానికి, రజాకార్ల పైశాచికత్వంతో తల్లడిల్లిపోయారు. నిజాం ఆటకట్టించేందుకు 'సైన్యాన్ని కదిలిద్దాం–నిజాం దుమ్ము దులిపేద్దాం' అన్న నాటి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ మాటలను పట్టించుకోకుండా, ప్రధాని ఏడాది పాటు చేసిన కాలయాపన ఫలితంగా అనేక దురాగతాలు చోటుచేసుకున్నాయి.

అందుకు ఉదాహరణలు కొన్ని: ఆగస్టు 8, 1947న వరంగల్‌లో త్రివర్ణ పతాకం ఎగురవేసినందుకు మొగలయ్యను రజాకార్లు కత్తులతో పొడిచి చంపగా, హంతకుడు ఖాసిమ్ షరీఫ్‌కు పూలదండలు వేసి వరంగల్లో నాటి సుబేదార్ ఊరేగించాడు.

'వాడి' రైల్వే స్టేషన్ పక్క గ్రామంలో బతుకమ్మ పండుగ చేసుకొని రైలుల్లో తిరిగి వస్తున్న వందలాది మంది హిందూ స్త్రీలను గాండ్లాపూర్ వద్ద నిజాం మూకలు రైలును ఆపి, మగవారిని కాళ్లుచేతులు కట్టి పడేసి, స్త్రీలను సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి నగ్నంగా బతుకమ్మను ఆడించారు. ఆగస్టు 21, 1948 ఇమ్రోజ్ పత్రికా సంపాదకుడు షోయబుల్లా ఖాన్ హత్య జరిగింది.

ఆగస్టు 25, 1948న చేర్యాల తాలూకాలోని బైరాన్ పల్లి గ్రామంపై ఉదయం నాలుగున్నర గంటలకు నిజాం ముష్కర మూకలు దాడికి దిగి 92 మంది హిందువుల్ని వరుసగా నిలబెట్టి కాల్చేశారు. కనపడ్డ స్త్రీల నెల్లా బలాత్క రించారు.

సూర్యాపేట తాలూకాలోని పాతర్లపహాడ్ గ్రామస్థులు నిజాం సర్కార్‌కు పన్ను చెల్లించబోమంటూ ఎదురు తిరిగినందుకు ఆగస్టు 28, 1948 ఆ పల్లెపై దాడిచేసి 17 మంది ప్రాణాలు తీశారు. ఎందరినో ఘోరంగా హింసించారు. నల్లగొండ జిల్లాలోని రహీంఖాన్ పేట, బాద, వేముల యాదగిరిపల్లి, మల్లాపురాయి, రేణిగుంట, భువనగిరి, ఎర్రంపల్లి, కొలపాక తాలూకాలోని దూది వెంకటాపురం మొదలగు ప్రాంతాల్లో కనీసం రెండు



కింగ్ కోఠి

వేల మంది హత్యకు గురయ్యారు. అత్యాచారాలకు అంతే లేదు.

నిజాం నియంతపాలనకు వ్యతిరేకంగా ఆర్యసమాజం సత్యాగ్రహాన్ని ప్రోత్సహించింది. అనేకమంది ఆర్యవీరులు సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్లారు. ఆ సత్యాగ్రహానికి అద్భుతమైన స్పందన లభించగా, ఈ ఉద్యమంలో చేరవద్దని గాంధీజీ కాంగ్రెసు కార్యకర్తలకు సలహా ఇచ్చారు. మరోవంక రాష్ట్రీయ స్వయం సేవక సంఘం సభ్యులు వందల సంఖ్యలో ఉద్యమంలో పాల్గొన్నారు. పోలీసు చర్యకు ముందు నిజాం జ్యేష్ఠ పుత్రుడు బీరార్ యువరాజు అజింజా 8వ నిజాం కావాలనే కోరికతో హైదరాబాద్ సంస్థాన సేనను సరిహద్దు నుండి వెనుకకు రప్పించాలను కున్నాడు. దానిని పసిగట్టిన 7వ నిజాం అతనికి కావలసినంత డబ్బు ఇచ్చి పారిస్ లాంటి ప్రదేశాలకు విహారయాత్రకు పంపాడు. వ్యసనపరుడైన అజంజా సర్వసేనాని పదవి, బీరార్ గవర్నర్ పదవి వదులుకొని జల్సాలు చేసుకుంటూ ప్రపంచ విహారయాత్రలో నిమగ్నమయ్యాడు. మిలటరీ చర్య జరిగే వరకూ అధికారాన్ని కాపాడుకునేందుకు ఉస్మాన్ ఖాన్ అంతర్గతంగా, అంతర్జాతీయంగా తనకున్న అవకాశాల్ని వినియోగించుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు. సర్దార్ పటేల్ చొరవ, పట్టుదలతో ముందు ఆ యత్నాలు విఫలమై నిజాం దిగిరాక తప్పలేదు.

అయితే నిజాం సైన్యం సహకారంతో రజాకార్లు దోపిడీ చేసిన సొమ్ము ఎక్కడికి వెళ్లింది? వారి ఆయుధాలు ఎక్కడ ఉన్నాయి? లొంగిపోయిన రజాకార్లు ఇప్పుడు ఏం చేస్తున్నారు? ఎందరు సజీవులుగా ఉన్నారు? వారి వారసుల పరిస్థితి ఏమిటి? ఇలా సమాధానం లేని ప్రశ్నలు ఎన్నో వున్నాయి. ★



త్రిమూర్తుల సమైక్య తేజస్సు దత్తాత్రేయుడు. జ్ఞానానికి ప్రతీక. అత్రి అనసూయ దంపతులకు త్రిమూర్తి స్వరూపుడిగా అవతరించిన ఆయనకు ఆబాల్యంలోనే సర్వశాస్త్రాలు వశమయ్యాయి. మనిషిలోని సంకుచి తత్వాన్ని పోగొట్టి సన్మార్గులుగా చేసేవాడు గురువు, ఆయన జ్ఞానజ్యోతి అనుకుంటే అలాంటి సద్గురువు స్థానానికి పరమోదాహరణ దత్తాత్రేయుడు. పరిపూర్ణ భక్తితో తనను ఆశ్రయించే వారిలోని అజ్ఞాన తిమిరాన్ని పారదోలి జ్ఞాన కాంతులను ప్రసాదిస్తాడని విశ్వాసం. ఆధ్యాత్మిక సాధనకు మూలమైన యోగవిద్యకు పరమగురువుగా ఆయనను ఆరాధిస్తారు.



డిసెంబర్ 7 దత్తాత్రేయ జయంతి

# 'జ్ఞానజ్యోతి'

భక్తి, కర్మ, జ్ఞాన, ధ్యానయోగాల సమైక్యత తత్త్వమే దత్తప్రభువు అవతారం. లోకంలో యోగవిద్య క్షీణించి నప్పుడల్లా అవతరించి యోగరక్షణ చేస్తాడు కనుక దత్తాత్రేయుడు 'యోగవిద్య'కు నాథుడు (దత్తన్న్వయోగా దధఃయోగనాథః) అని శ్రీమగద్భాగవతంలోని నారాయణ కవచం వాక్కు. 'అరిషడ్వర్గాల బారినపడి పతనదిశగా పయనించే మనిషిని సన్మార్గంలోకి తెచ్చే సాధనం యోగసాధన. ఆ యోగసాధనను అందించగలిగేది గురువు. సద్గురువులు త్రికాలవేదులు. తాము మానవాకారంలో సంచరిస్తున్నా సామాన్యునిలా దేహానికి కట్టుబడరు. సంకల్ప మాత్రంతోనే శరీరం నుంచి విడివడి సూక్ష్మరూపంతో ఇతర లోకాలనూ సంచరించగలరు. ఇతరుల కర్మలను గ్రహించి నివృత్తి చేయ గలుగుతారు. ఆ గురు సంప్రదాయానికి మూలపురుషుడే దత్తమూర్తి' అని చెబుతారు. యోగసాధనే మోక్షమార్గమని, మానవమానాలకు పొంగడం, కుంగడం కాక మానాన్ని విషతుల్యంగా, అవమానాన్ని అమృతప్రాయంగా స్వీకరించగలగాలని ఆయన అలర్కుడికి ఉపదేశించారు.

పది మంది బ్రహ్మమానస పుత్రులలో రెండవ వారైన అత్రిమహర్షి, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ పత్ని అనసూయాదేవితో చేసిన తపస్సుకు మెచ్చిన త్రిమూర్తులు వారి కోరిక మేరకు తమ అంశంతో కుమారుడిగా జన్మించారు. దత్తాత్రేయుడు పుట్టిన వెంటనే ప్రణవం ఉచ్చరించాడు. అన్ని శాస్త్రాలు ఆయన పరమయ్యాయి. అక్షరాభ్యాసం లేకుండానే శిష్యులకు వేదపాఠం బోధించాడు. బాల్యంలోనే కన్నవారికి జ్ఞానబోధ చేశాడు. ప్రకృతి పరిశీలన ద్వారా జ్ఞాన సముపార్జన చేశారు. భూమి నుంచి క్షమ, ఆకాశం నుంచి సర్వవ్యాపకత్వం, వాయువు నుంచి నిస్సంగత్వం, జలం నుంచి నిర్మలత్వం, అగ్ని నుంచి తేజస్సు గ్రహించారు. వాటినే గురువులుగా భావిస్తూ వాటిలోని మర్మాలను ఎరిగి లోకానికి వివరించాడు.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

సత్త్వం రజ స్తమో గుణాలకు ప్రతీకలు త్రిమూర్తులు. మార్కండేయ పురాణం, 'స్మృతికౌస్తుభం' గ్రంథం ప్రకారం, విష్ణువును సత్త్వరూపం కలవాడిగా దర్శించాలన్న కోరికను నారదుడు విన్నవించగా, త్రిమూర్తులు ఒక్కటైనప్పుడే అది సాధ్యమని శ్రీహరి చెబుతాడు. అందుకు అవసరమైన కథ నడిపాడు నారదుడు. ఒకనాడు అత్రి,అనసూయ దంపతుల అతిథ్యం స్వీకరించిన నారదుడు వైకుంఠం, కైలాస,సత్యలోకాలను సందర్శించిన సందర్భంలో అనసూయను మించిన పతివ్రత సృష్టిలోనే లేరని లక్ష్మీ పార్వతీ సరస్వతులతో అనడంతో ఆమె పాతివ్రత్యాన్ని పరీక్షించాలని 'త్రిమాతలు' త్రిమూర్తులను కోరారు. వారు వారి మాటలను మన్నించడంతో పాటు అనసూయాదేవి ఉన్నతిని చాటేందుకు అంగీకరించారు. బ్రాహ్మణ వేషధారులుగా అత్రి ఆశ్రమానికి వచ్చి భిక్ష కోరారు. అయితే వివస్త్రగా తమకు వడ్డించాలని రుషి పత్నికి షరతు పెట్టడంతో ఆమె భర్త ఇచ్చిన మంత్రజలాన్ని వారిపై చల్లగా త్రిమూర్తులు పసిపాపలుగా మారిపోయారు. ఆ చిన్నారులకు అతిథి మర్యాదలు చేయడమే కాదు.. మాతృప్రేమనూ పంచింది. భర్తల జాడ వెదుక్కుంటూ వచ్చిన 'త్రిమాత'లకు లోకనాథులను నిజరూపాలతో అప్పగించింది. సంతానంలేని తమకు పుత్రుడిగా జన్మించాలన్న అత్రి దంపతుల విన్నపాన్ని మన్నించిన త్రిమూర్తులు తమ అంశంతో మార్గశిర పౌర్ణమి రాత్రి పుత్రుడిని ప్రసాదించారు. మూడు ముఖాలు, ఆరు చేతులతో పుట్టి 'దత్తుడు' (తనను తానే ఇచ్చుకున్నాడు)గా పేరు పొందాడు. అత్రి కుమారుడు కనుక 'దత్తాత్రేయుడు' అయ్యాడు.

భోగమోక్షాలనిచ్చే దత్తుడు దేహంపైకానీ, వస్త్రంపై కానీ అపేక్షలేనివాడు. భిక్షాన్నం మాత్రమే స్వీకరించే నిరాసక్తుడు. తనను త్రికరణశుద్ధిగా నమ్మినవారికి


# దత్తాత్రేయుడు


శాంతిరూపుడై దర్శనం ఇస్తున్నట్లే, విశ్వాస రహితంగా చూడగోరే వారికి వికృత రూపంతో దర్శనమిచ్చేవారట. మద్యం తీసుకుంటున్నట్లు, ఖండ యోగం ద్వారా శరీర అవయవాలను వేర్వేరు చోట్ల పడేసినట్లు వ్యవహరించేవారు. ఉన్మత్తుడు, మద్యపానాసక్తుడు, అవధూత, యోగి, సిద్ధుడు, మురికి దుస్తులు ధరించిన వికారి, చితాభస్మధారుడుగా కనిపించే వాడు. తాటిచెట్టు కింద కల్లు ముంత చేపట్టేవాడు. ఇవన్నీ మానవుడి చిత్త ప్రవృత్తులు, వారిలో కనిపించే సహజ లక్షణాలను పోలి ఉంటాయని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతారు. అన్ని అపవిత్రాలను పవిత్రం చేసే వేదాలు ఆయన ముందు శునకరూపంలో సాగిలపడడాన్ని బట్టే దత్తమహిమ బోధ పడుతుందని, ఆయనను ఆరాధించడం, ఆయన పాదుకలను సేవించడం శ్రేయోదాయకమని పెద్దలు చెబుతారు. కుల మత వర్ణాలకు అతీతంగా సర్వులను సమభావంతో చూడడాన్ని దత్త సంప్రదాయంగా చెబుతారు. జీవులంతా సమానమని, సకలజనులకు సేవలు అందించడం ఆయన బోధనలుగా ఆరాధకులు అంటారు. పరమాత్మారాధనలో అభేదం చూపుతూ, ఇష్టదైవాలను ఆరాధిస్తూ ముక్తి పొందాలని సూచన ఈ అవతారంలో గోచరిస్తుంది. ధర్మరక్షణ కోసం దైవం నిరంతరం ఏదో ఒక రూపంలో అవతరిస్తూనే ఉంటుందని ఈ 'దత్తా'వ తారం మరోసారి రుజువు చేసింది. యోగిరాజు, అత్రివరదుడు, దత్తాత్రేయుడు, కాలాగ్ని శమనుడు, యోగిజన వల్లభుడు, లీలా విశ్వంభరుడు, సిద్ధిరాజు, జ్ఞానసాగరుడు, విశ్వంభరావధూత, అవధూత, మాయా ముక్తావధూత, ఆదిగురువు, శివరూపుడు, దేవదేవుడు, దిగంబరుడు, కృష్ణ శ్యామ కమలనయనుడు.. అనేవి ఇతర అవతారాలని వాసుదేవానంద సరస్వతీస్వామి తమ 'దత్తపురాణం'లో వివరించారు.

**'జటాధరమ్ పాండురంగమ్ శూలహస్తం కృపానిధిమ్**
**సర్వరోగహరమో దేవమ్ దత్తాత్రేయ మహంభజే'**

★





# కాశీ క్షేత్రాన తమిళ

'అహం కాశీం గమిష్యామి తత్రైవ నివసామ్యహం
ఇతి బ్రువాణ స్సతతం కాశీవాస ఫలం లభేత్'

వ్యాసభగవానుని ఈ శ్లోకం ప్రాచుర్యం పొందింది. కాశీఖండం, గరుడ పురాణాల్లోనూ ఈ ప్రస్తావన ఉంది. 'ఎవరయితే నేను కాశీకి వెళుతున్నాను, అక్కడే ఉంటాను అని నిత్యం స్మరిస్తూ ఉంటారో.. వారు కాశీవాసం చేసిన ఫలితం పొందుతారు' అనేది దాని భావం.


'కాశ్యాన్తు మరణాన్ని ముక్తి'.. కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుంది. పునర్జన్మ కూడా ఉండదు. హిందువులకున్న ప్రగాఢమైన విశ్వాసాల్లో అదొకటి. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటయిన విశ్వేశ్వరలింగం కాశీలో ఉంది. బౌద్ధులకు, జైనులకు కూడా ఇది పుణ్యక్షేత్రం. అటువంటి మోక్షధామమైన కాశీలో ఓ విశిష్ట కార్యక్రమానికి కేంద్రం సంకల్పించింది. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'.. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'కాశీ తమిళ సంగమం' పేరిట నెల రోజుల వేడుకలకు శ్రీకారం చుట్టింది. నవంబరు 19వ తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తమిళ కవులు, రచయితలు, పండితులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలతో వారణాసి నగరం కోలాహలంగా మారింది. వారి కోసం విడిది, స్థానికులతో ముచ్చటించటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాశీలో వాణిజ్య, విహార, ఆధ్యాత్మిక కేంద్రాల సందర్శన, సంగీత కచేరీలు, జానపద నృత్యాలతో పాటు నిపుణులతో చర్చలు, సమావేశాల వంటి వాటితో అతిథులను ఆహ్లాదపరుస్తారు. అలాగే హాండ్లూమ్స్, హాండిక్రాఫ్ట్స్, పుస్తకాలు, డాక్యుమెంటరీలు, వివిధ రకాల కళా ప్రదర్శనలు, చరిత్ర, పర్యాటక స్థలాల సమాచారం ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020లో భాగంగా భారతీయ పురాతన మేధోసంపదను ఆధునిక జ్ఞానంతో మేళవించాలన్న సూచన నేపథ్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటైంది.

ఉత్తరాది-దక్షిణాది మధ్య చారిత్రక, నాగరిక సంబంధం వెల్లివిరియటానికి 'కాశీ తమిళ సంగమం' దోహదం చేస్తుందని, ఈ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న కేంద్ర విద్యాశాఖ ప్రకటించింది. అలాగే కల్చరల్, టెక్స్‌టైల్స్, రైల్వేలు, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ మంత్రిత్వ శాఖలు కూడా తమ వంతు సహకారం అందిస్తున్నాయి. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ), ఐఐటీ మద్రాసు మేధోపరమైన భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయి. తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి 210 మందితో కూడిన బృందాన్ని ఎనిమిది రోజుల పాటు కాశీకి తీసుకు వచ్చారు. అలాగే మరో 12 బృందాలు, అంటే సుమారుగా 2500 మంది ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటారు. ప్రయాణ, వసతి ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి వారణాసి, తమిళనాడుల మధ్య సాంస్కృతిక బంధం దృఢమవుతుందని, తమిళ ప్రజలు కాశీ గురించి, కాశీ వాస్తవ్యులు తమిళనాడు గురించి పరస్పరం అర్థం చేసుకోగలుగుతారని నిర్వాహకులు చెబుతున్నారు. అంతేగాక ప్రాచీనమైన తమిళ భాష అభివృద్ధికి కూడా ఈ చర్య దోహదం చేస్తుందని ప్రకటించారు.

### ఎంతో పవిత్రం, ఎంతో ప్రత్యేకం

గంగ, యమునల సంగమం అంతటి పవిత్రత కాశీ తమిళ సంగమానికి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. వారణాసిలో ఏర్పాటయిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన స్ఫూర్తివంతమైన ప్రసంగం చేశారు. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని నిలబెట్టేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంపద్వంతమైన సాంస్కృతిక నేపథ్యం ఉన్న భారతదేశం తన వారసత్వ సంపదను చూసి పొంగిపోవాలని నిర్దేశించారు. ఈ రెండు ప్రాంతాలకు ఉన్న విశిష్టతలను, సామీప్యాలను సోదాహరణంగా ఆయన వివరించిన తీరు సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. 'అతి ప్రాచీన భాషలయిన సంస్కృతం, తమిళాలకు ఈ రెండు ప్రాంతాలు కేంద్రాలు. కాశీలో బాబా విశ్వనాథ్ ఉంటే, తమిళనాడులో రామేశ్వర స్వామి ఆశీర్వచనాలున్నాయి. అందుకే కాశీ, తమిళనాడులు శివమయం, శక్తిమయం. సంగీతం, సాహిత్యం, కళలు ఇలా ఎందులోనయినా కాశీ, తమిళనాడుల నడుమ పోలిక ఉంది' అని వివరించారు. అత్యంత ప్రతిభావంతులయిన ఆచార్యుల పుట్టిళ్లుగా, పని ప్రదేశాలుగా ఈ రెండు ప్రాంతాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయని వ్యాఖ్యానించారు. 'తమిళనాడులో జన్మించిన రాధాకృష్ణన్ బీహెచ్‌యూ వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. తమిళనాడు మూలాలున్న వేదపండితుడు రాజేశ్వరశాస్త్రి కాశీలో జీవించారు. అలాగే తమిళుడయిన పట్టాభిరామ్ శాస్త్రి హనుమాన్ ఘాట్లో నివాసం ఉన్నారు. హరిశ్చంద్ర ఘాట్ ఒడ్డుపైన తమిళ దేవాలయం కాశీ కామకోటేశ్వర పంచాయతన్ మందిర్ ఉంది. కేదార్‌ఘాట్‌పైన 200 ఏళ్ల ప్రాచీనమైన కుమార స్వామి మఠం, మార్కండేయ ఆశ్రమం ఉన్నాయి. తమిళనాడుకు చెందిన ఎంతో మంది కొన్ని తరాలుగా కేదార్‌ఘాట్, హనుమాన్‌ఘాట్‌లపై నివాసం ఉంటూ తమ వంతు అభివృద్ధికి పాటు పడుతున్నారు. విశిష్ట కవి పండితుడు సుబ్రహ్మణ్య భారతి ఎన్నో సంవత్సరాలు కాశీలోనే జీవించారు. అలాంటి ప్రతిభావంతుని కోసం బీహెచ్‌యూ ప్రత్యేకంగా 'ఛైర్' అంకితం చేసింది' అంటూ కాశీ, తమిళనాడు మధ్య ఉన్న గాఢమైన అనుబంధాన్ని ప్రధాని ప్రస్తావించారు.

'భాషాపరమైన అవరోధాలను, మేధోపరమైన విభేదాలను పక్కనపెట్టి స్వామి కుమార గురుపర్ కాశీకి విచ్చేసి తన కర్మభూమిగా మార్చుకున్నారు.



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్



# సంగమం

కేదారేశ్వర ఆలయాన్ని నిర్మించారు. ఆయన శిష్యులు కావేరి నది ఒడ్డున తంజావూరులో కాశీ విశ్వనాథ్ ఆలయాన్ని నిర్మించారు. తమిళనాడు రాష్ట్ర గీతాన్ని రచించిన మనోన్మయ్యమ్ సుందర్ నార్‌కు కాశీలో ఉన్న గురువుతో ప్రత్యేకమైన బంధం ఉంది. ఉత్తరాదిని, దక్షిణాదిని కలిపేందుకు రాజాజీ రచించిన రామాయణ, మహాభారతాలు ప్రధాన భూమిక నిర్వహించాయి. దక్షిణాది మేధావులు. రామానుజాచార్య, శంకరాచార్య, రాజాజీ, సర్వేపల్లి రాధాకృష్ణన్‌లను అర్థం చేసుకోకపోతే భారతీయ తత్త్వశాస్త్రం అర్థం కాదనేది నా అనుభవం' అని మోదీ పేర్కొన్నారు. నిద్ర లేవగానే 12 జ్యోతిర్లింగా లను గుర్తుచేసుకునే సాంప్రదాయం ఉన్నట్టుగా, ప్రతి రోజూ దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య ఆధ్యాత్మిక ఐకమత్యానికి కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

**తమిళాన్ని విస్మరిస్తే దేశానికి అన్యాయం చేసినట్టే!**

ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన తమిళ భాషను మనం పూర్తిగా గౌరవించటం లేదని ప్రధాని వ్యాఖ్యానించారు. 'ఈ భాషను పరిపుష్టం చేయటం, దాని వారసత్వాన్ని కాపాడటం అనేది మొత్తం 130 కోట్ల భారతీయులందరి బాధ్యత. మనం తమిళాన్ని విస్మరిస్తే దేశానికి అన్యాయం చేసినట్టు. దానికి లక్ష్మణ రేఖలు విధిస్తే నష్టం చేసినట్టు. భాషాపరమైన అవరోధాలను తొలగించి భావోద్వేగపరమైన ఐకమత్యాన్ని సాధించటం మనందరి బాధ్యత' అని వివరించారు. సంగమం ద్వారా మాటలతో కాకుండా చేతల ద్వారా అద్భుతమైన ఆతిథ్యం అందించగల మని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు తమిళ నాడుతో పాటు ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో కూడా నిర్వహిస్తామని, దేశంలోని ఇతర ప్రాంతాల యువకులు అక్కడికి వచ్చి అక్కడి సంస్కృతీ సాంప్రదాయాలను అర్థం చేసుకోగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంగమ కార్యక్ర మాన్ని ముందుకు తీసుకెళ్లాలి. ఈ విత్తనం మహా వృక్షం కావాలి అని ఆయన ఆకాంక్షించారు.


తమిళ సంప్రదాయమైన పంచెకట్టులో కార్యక్రమానికి హాజరై, మోదీ అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా ప్రధాని 'తిరుక్కురాళ్' పుస్తకాన్ని 13 భాషల అనువాదాలతో సహా ఆవిష్కరించారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రదాన్, డాక్టర్ ఎల్.మురుగన్, భాజపా తమిళనాడు అధ్యక్షుడు కె.అన్నామలై, సంగీత దర్శకుడు ఇళయరాజా పాల్గొన్నారు.

**ఆశయం సిద్ధించేనా?**

వివిధ భాషలు, సంస్కృతులతో భిన్నత్వంతో కూడిన మన దేశంలో తమిళ ప్రజల వ్యవహార శైలి ప్రత్యేకం. ద్రవిడ రాజకీయాలు విశిష్టం. ఇక తమిళులకున్న స్వీయభాషాభిమానం, హిందీ పట్ల ద్వేషం బహిరంగ రహస్యమే. అక్కడ అన్నింటా తమిళం ప్రధానంగా ఉంటుంది. చదువు ప్రధానంగా అదే మాధ్యమంలో సాగుతుంది. కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు, నిత్యవ్యవహారాల్లోనూ తమిళానికే ప్రాధాన్యం. నామఫలకాలు, దుకాణాలు, కార్యాలయాలపైన బోర్డులు, రవాణా వాహనాలపైన వివరాలు అదే భాషలో ఉంటాయి. ప్రభుత్వ ప్రకటనలు కూడా ఆంగ్ల పత్రికల్లోనయినా సరే, పూర్తి పేజీ తమిళంలోనే వచ్చే సందర్భాలుంటాయి. అవతల వ్యక్తి పరాయి భాషవాడని తెలిసినా, కచ్చితంగా తమిళంలోనే మాట్లాడి తీరాలన్న చిత్రమైన పట్టుదలను అక్కడి వారు ప్రదర్శిస్తూంటారు.

మన దేశంలో కనీసం 600 భాషలు మాట్లాడే వారున్నారు. భిన్న భాషలు మాట్లాడే వారిని ఏకం చేయటం కోసమే కాకుండా, దేశమంతా ఒకే భాషలో పరిపాలన సులువుగా సాగటం కోసం జాతీయ భాష ఉండాలన్న ఆలోచన స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి ఉంది. ప్రాంతీయ భాషలను ప్రోత్సహించాలన్న ఆలోచనా జాతీయోద్యమ నాయకుల్లో ఉండేది. మన దేశంలో హిందీ మాట్లాడే రాష్ట్రాలు సంఖ్యాపరంగా కూడా ఎక్కువే అయినా, హిందీని అధికార భాషగా గుర్తించటానికి దక్షిణ, ఈశాన్య రాష్ట్రాలు సిద్ధంగా లేవు. గతంలో అధికార భాష ప్రతిపాదన వచ్చి నప్పుడు తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్త మైంది. ఉద్యమం రక్తసిక్తమైంది. ఇటీవల మళ్లీ ఈ అంశం చర్చకు వచ్చినప్పుడు కూడా తమిళనాడు తీవ్రంగా స్పందించింది. 'ఇండియాను హిందియాగా మార్చకండి' అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ గట్టిగా నిరసన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో 'కాశీ తమిళ సంగమం' ద్వారా ఏ మేరకు ఆశించిన ప్రయోజనం చేకూరుతుందనేది ఆసక్తికరమైన అంశం.

ద్రవిడ కుటుంబంలో ప్రధాన భాషలైన తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషలు అత్యంత ప్రాచీన సాహిత్య సంపదను కలిగి ఉన్నాయి. ద్రవిడ భాషా కుటుంబం 4,500 సంవత్సరాల మనుగడలో ఉందని 'రాయల్ సొసైటీ ఓపెన్ సైన్సు పత్రిక' ఒక పరిశోధన పత్రాన్ని ప్రచురించింది. సంస్కృతం లాగానే తమిళ భాష కూడా పురాతనమైనది. తమిళ భాషా సంప్రదాయంలో ప్రాచీన కాలం నాటి శాసనాలు, సాహిత్యానికి, వర్తమాన తమిళ భాషకూ సామీప్యత ఎక్కువ. తమిళ భాషకు ప్రాధాన్యం ఇవ్వదలిస్తే, హిందీ వ్యవహారిక భాషగా ఉన్న కాశీలో కాకుండా తమిళనాడులో ఎక్కడయినా ఈ కార్యక్రమం నిర్వహిస్తే బావుండేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిని రాజకీయ కోణంలో కాకుండా సాంస్కృతిక కోణంలో, విస్తృత ప్రాతిపదికన చూడాలని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు కోరుతున్నారు. నాస్తికుడయిన పెరియార్ కూడా కాశీలో కొన్ని నెలలు గడిపారన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. 'కాశీ తమిళ సంగమం'లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న వారు ఎవరైనా https://kashitamil.iitm.ac.in//లో నమోదు చేసుకోవచ్చు. ఆ అవకాశాన్ని సొంతం చేసుకోవచ్చు. ప్రభుత్వం ద్వారా అందే ప్రత్యేక వసతి సౌకర్యాలతో కాశీ ఆధ్యాత్మిక సౌరభాలను ఆస్వాదించవచ్చు. ★





**పాశ్చాత్య దేశాలలో అణు భౌతికశాస్త్రం చదివిన వ్యక్తి, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఒక కుగ్రామంలో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయడం సాధ్యమవుతుందా? హిమసానువులలో తపస్సు చేసుకుంటూ 'పూర్ణ సూత్రాలు', 'ఫిలాసఫీ ఆఫ్ యోగా' వంటి రచనలు చేసిన చేతితోనే, 'హై వాక్యూమ్ ప్రిన్సిపుల్స్, ప్రొడక్షన్ అండ్ మెజర్‌మెంట్స్' వంటి ప్రామాణిక శాస్త్ర గ్రంథాన్ని రాయడం, అదికూడా అమెరికా విశ్వవిద్యాలయంలో కూర్చుని రాయడం సాధ్యమా? ఎవరో ఒకరిద్దరు మహా యోగులు మాత్రమే అదివి సాధ్యం చేశారని చరిత్ర చెబుతోంది. అలాంటి వారిలో ఒకరు-స్వామి జ్ఞానానంద. మతం, విజ్ఞానశాస్త్రాల సమన్వయం మానవాళికి క్షేమదాయకమన్న మహోన్నత వాస్తవాన్ని దర్శించినవారు కాబట్టే స్వామి జ్ఞానానంద ఆ రెండు పార్శ్వాలను- ఆధ్యాత్మికత, విజ్ఞానశాస్త్రం-తనలో ఇముడ్చుకున్నారు. ఆ రెండు మహోన్నత అంశాలు వేర్వేరు కాదని కూడా అర్థం చేసుకున్నారు. అదొక ఆధునిక కాలపు అద్వైతసిద్ధి అనిపిస్తుంది. ఆధ్యాత్మిక చింతన నుంచి అణు భౌతికశాస్త్ర శోధన వరకు సాగిన ఆయన జీవనయానం ఆధునిక యుగానికి ఒక వెలుగుబాట.**

# ఆధ్యాత్మిక చిం
# అణు భౌతికశ

యోగాభ్యాసానికీ, విజ్ఞానశాస్త్ర అధ్యయనానికీ నడుమ కొన్ని పోలికలు ఉన్నాయని కూడా జ్ఞానానంద చెప్పారు. యోగాభ్యాసం ఉద్దేశమే మనసు, శరీరాల మీద సయోధ్యను సాధించడానికి మానవాళి చేసే ప్రయత్నాన్ని విజయవంతం చేయడమేనని తనదైన అనుభవంతో చెప్పారాయన. ఇలాంటి అద్భుతం, చింతన భారతభూమిలో తప్ప ఇంకెక్కడ సాధ్యమవుతాయి? 'ప్రొఫెసర్ స్వామి జ్ఞానానంద, ది సెయింట్ అండ్ ది సైంటిస్ట్' (సంకలనం: డాక్టర్ ఉమాపతిరాజు దాట్ల, డాక్టర్ కేశవదేవ్ శర్మ) పుస్తకం ఉపోద్ఘాతం ఆరంభంలో చెప్పిన మాటలు పరిశీలించాలి. 'పురాతన కాలం నుంచి భారతభూమి జ్ఞానులైన మహర్షులకు జన్మస్థానం. వీరు యోగాభ్యాసంతో పరిపూర్ణ జ్ఞానానికి (వేదం) నిర్దుష్ట రూపం ఇచ్చారు. యోగమార్గంతో మానవాళికి నిత్యమైనదీ, సత్యమైనదీ అయిన ఆనందాన్ని అందుకునేందుకు దోహదం పడ్డారు. అలాగే ఆ మహోన్నత మహర్షులు భౌతిక ప్రపంచం గురించి శోధించి, మానవాళి శ్రేయస్సు కోసం విజ్ఞానశాస్త్రాన్ని కూడా అభివృద్ధి చేశారు.' అన్నారు. ఈ పుస్తకానికే ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ రాసిన ముందుమాటలో, జ్ఞానానంద కూడా అలాంటి మహర్షులు నడిచిన మార్గంలోనే నడిచారని వ్యాఖ్యానించారు.

రుషి మూలం, నది మూలం అడగరాదని నిబంధన ఉన్నప్పటికీ, స్వామి జ్ఞానానంద ఆధునిక ఆధ్యాత్మిక చింతనకూ, విజ్ఞాన శాస్త్రానికీ అందించిన సేవను పరిపూర్ణంగా, చారిత్రక దృక్పథంతో ఆకళింపు చేసుకోవడానికి అది అవసరం. పూర్వాశ్రమంలో ఆయన పేరు భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు (డిసెంబర్ 5, 1896-సెప్టెంబర్ 21, 1969). సన్యాసం ఇచ్చిన తరువాత ఆయన గురువు స్వామి పూర్ణానంద ఆ పేరు పెట్టారు. చిన్నతనంలోనే తండ్రి గ్రంథాలయంలోని ఆర్ష వాఙ్మయం, ఎడ్విన్ ఆర్నాల్డ్ సుప్రసిద్ధ గ్రంథం 'లైట్ ఆఫ్ ఏసియా' ఇచ్చిన చూపు; బయట ప్రపంచంలోకి ప్రవేశించిన తరువాత ఆర్య సమాజ్‌తో, రామకృష్ణ మిషన్‌లతో పరిచయం, హిమాలయాలలోని మార్మికత లక్ష్మీనరసింహరాజును స్వామి జ్ఞానానందగా అవతరింప చేశాయి. ఆపై ఆయనను ఒక శాస్త్రవేత్తగానూ ఆవిష్కరించాయి.

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరానికి ఏడు కిలోమీటర్ల దూరంలోని గౌరగనమూడి వారి స్వగ్రామం. రామరాజు, సీతయ్యమ్మ దంపతుల తొలి సంతానమే లక్ష్మీనరసింహరాజు. సంపన్న కుటుంబం వారిది. బాల్యమంతా అక్కడే గడిచింది. ఐదో ఏట ఇంటి పురోహితుడు మంగిపూడి వీరయ్య సిద్ధాంతి అక్షరాభ్యాసం చేశారు. ఐదేళ్లు ఉపాధ్యాయుడిని నియమించి ఇంటి దగ్గరే చదువు చెప్పించారు తండ్రి రామరాజు. ఆపై కొడుకుని ఇంగ్లిష్ చదువులు చదివించాలని 1906లో వీరవాసరం పాఠశాలలో చేర్చారు రామరాజు. అక్కడ నాటి ప్రధానోపాధ్యాయుడు సూరంపూడి సీతారామయ్య పర్యవేక్షణలో చదువు సాగింది. సీతారామయ్యకి తణుకు బదలీ అయింది. తన వెంట లక్ష్మీనరసింహరాజును కూడా ఆయన తీసుకునివెళ్లారు. అప్పుడే మహారాష్ట్ర స్వామి అనే యోగి తణుకు వచ్చారు. ఆ స్వామి లక్ష్మీనరసింహరాజుకు కృష్ణమంత్రం ఉపదేశించారు. అలా తణుకు మజిలీ ఆయనలో ఆధ్యాత్మిక చింతనకు అంకురార్పణ చేసింది. భక్తి, వైరాగ్యం ఆ రెండేళ్ల కాలంలో ఆయన జీవితాన్ని పెనవేసుకున్నాయి. ఆపై గోదావరి ఒడ్డునే ఉన్న నరసాపురంలోని టేలర్ పాఠశాలలో కొడుకును రామరాజు చేర్పించారు. ఇక్కడ అంబరుఖానా జయరామారావు ప్రధానోపాధ్యాయులు. లక్ష్మీనరసింహరాజుకు గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలలో అత్యధిక మార్కులు వచ్చేవి. టేలర్ పాఠశాల విజ్ఞానశాస్త్రం పట్ల తృష్ణను రేపింది. ఆ పాఠశాలలోనే గ్రంథాలయానికి వెళ్లి వేదాంత గ్రంథాలు చదువుకుంటూ ఉండేవారు.

దానితో కంటి వైద్యుడి అవసరం వచ్చింది. తండ్రి కొడుకును తీసుకుని వైద్యం కోసం మద్రాసు వెళ్లారు. ఆ సమయంలో లక్ష్మీపతిరాజు చేసిన మరొక పని, నిత్యం అదయార్‌లో ఉన్న దివ్యజ్ఞాన సమాజానికి వెళ్లి పుస్తకాలు చదువుకోవడం.

అది 1917. ఎస్ఎస్ఎల్‌సి ఫలితాలు వచ్చాయి. టేలర్ పాఠశాలలో ముగ్గురే ఉత్తీర్ణులయ్యారు. వారిలో లక్ష్మీనరసింహరాజు లేరు. కేవలం విజ్ఞానశాస్త్రం చదివితే చాలదు, మిగిలిన పాఠ్యాంశాలూ చదువుకోవాలన్న ప్రధానోపాధ్యాయుని సూచనలోని వాస్తవికతను లక్ష్మీనరసింహరాజు గుర్తించలేక పోవడం వల్ల వచ్చిన ఫలితమది. ఆ బాధతో ఓ రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచి పెట్టి వెళ్లిపోయారు. వెతికించగా మొత్తానికి బేలూరు రామకృష్ణ మఠంలో ఉన్నట్టు తెలుసుకున్నారు. అప్పటి ఆ మఠాధిపతి స్వామి శివానంద. ఆయన అనుమతి

# ...ంతన నుంచి ...శాస్త్రం వైపు..


తీసుకుని మొత్తానికి లక్ష్మీనరసింహరాజును స్వగ్రామం తీసుకువచ్చారు. ఈ ధోరణిని చూసిన రామరాజు కొడుకు మనసు మళ్లించడానికి, ఆయన అభిప్రాయానికి విరుద్ధంగానే పెళ్లి చేశారు. వివాహం జరిగిన కొద్దికాలానికే ఆయన డిసెంబర్ 21, 1917న మళ్లీ ఇల్లు విడిచి వెళ్లిపోయారు. నాలుగేళ్ల తరువాత స్వగ్రామం వచ్చారు. ఆ కాలమంతా ఖర్గ్‌పూర్, ఢిల్లీ, హరిద్వార్, హృషీకేశ్, నేపాల్‌లలో గడిపారు. ఇంటికి వచ్చినప్పటికి మళ్లీ హఠాత్తుగా ఇల్లు వెళ్లిపోయారు. 1921లో అల్లూరి సత్య నారాయణరాజు అనే ఆయన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చదువుతుండగా, కొందరు బెంగాలీ సాధువులతో కలసి లక్ష్మీనరసింహరాజు అక్కడకు చేరారు. అది తెలుసుకున్న సత్యనారాయణ రాజు సొంతూరుకు కబురు పంపారు. మరొకసారి గొరగనమూడిలో కొంతకాలం గడపవలసి వచ్చింది. అంతకు ముందే జ్ఞానానంద పూర్ణసూత్రాలు గ్రంథం రచించారు.

గంగోత్రి దగ్గర శాంతి గుహలో ఉండగా 1925–1926 మధ్య జ్ఞానానంద పూర్ణసూత్రాలు రాశారు. ఇందులో 560 సూత్రాలు ఉన్నాయి. ఇవన్నీ తాత్త్విక, ఆధ్యాత్మిక జ్ఞానాల వెలుగులోని గాఢతను ఆవిష్కరిస్తాయి. 'నౌ ది ఎంక్వయిరీ ఇంటూ ది రియాలిటీ' (ఇప్పుడు వాస్తవం గురించి గవేషణ) అన్న వాక్యంతో ఆ సూత్రాలు మొదలవుతాయి. ఈ పుస్తకంలోని అంశాలు జర్మన్ తత్త్వవేత్తల మధ్య చర్చకు రావాలని తండ్రి ఆకాంక్షించారు. పైగా ఆ పుస్తకాన్ని జర్మనీలో అచ్చు వేయించాలని జ్ఞానానంద కోరిక కూడా. తన ఆకాంక్ష, తండ్రి ప్రోత్సాహంతో జ్ఞానానంద ఆ రాతప్రతిని తీసుకుని జర్మనీ వెళ్లారు. పూర్ణసూత్రాల మీద జర్మనీలో ఆయన ఇచ్చిన ఉపన్యాసాల వల్ల కావచ్చు, లేదా చదివిన తరువాత కావచ్చు. 'పాశ్చాత్య నాగరికత అంతరించినదన్న సంగతి మనకు మహా సంగ్రామమున (మొదటి ప్రపంచయుద్ధం) వ్యక్తమయింది. ఈ విపత్తును వారించలేని మన విజ్ఞానంలో ఏదో లోపం ఉండి ఉంటుంది. మన తత్త్వం, విజ్ఞానం పేరుకు మాత్రమే మిగిలాయి అన్న అభిప్రాయం కలిగిందనిపిస్తుంది.' అంటూ జర్మన్ రిపబ్లిక్ సభ్యురాలు డాక్టర్ మార్గరెట్ స్టెగ్‌మన్ పూర్ణసూత్రాలకు రాసిన ముందుమాటలో అన్నారు. భూగోళాన్ని శాసించాలన్న పాశ్చాత్య ధోరణిలోని లోపం అర్థమవుతున్న సమయం కాబట్టి, సత్యాన్వేషణ మొదలైన పూర్ణసూత్రాలు వాళ్లకు హత్తుకున్నాయని అనిపిస్తుంది.



1927లో జర్మనీ చేరుకున్నారు. అప్పటికి ఆయన వయసు 31 ఏళ్లు. అక్కడ ఆయన 'టైమ్ అండ్ స్పేస్' అన్న అంశం మీద డ్రెస్‌డెన్ విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలో ప్రసంగించారు. ఇది అక్కడే ఆచార్యునిగా పనిచేస్తున్న ప్రొ. డెంబర్‌ను ఎంతో ఆకర్షించింది. అల్బర్ట్ ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం మీద ప్రొ. డెంబర్ ఇచ్చిన ప్రసంగం కూడా స్వామి జ్ఞానానందను కూడా ఆకర్షించింది. ప్రొ. డెంబర్ ఉపన్యాసంలోని కొన్ని కీలక అంశాలు మాత్రం జ్ఞానానందకు బోధపడలేదు. తనకు గణితశాస్త్రంలో సరైన పునాదులు లేకనే ఈ సమస్య వచ్చిందని గ్రహించారు. దీనితో ఆ విశ్వవిద్యాలయంలో అండర్‌గ్రాడ్యుయేట్‌లో చేరే అవకాశం కావాలని స్వామి జ్ఞానానంద ప్రొ. డెంబర్‌ను కోరారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి జ్ఞానానందకు జర్మన్ విద్యావిధానంలో ప్రాథమిక పాఠశాల విద్య కూడా లేకున్నా ప్రవేశం కల్పించారు. ఎస్ఎస్ఎల్‌సిలో కృతార్థుడు కాలేకపోయిన జ్ఞానానంద ఇప్పుడు ఒక ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలో చేరారు. అయినా రెండేళ్లలోనే అండర్ గ్రాడ్యుయేట్ పట్టాను విజయవంతంగా అందుకున్నారు (1929). చిత్రంగా ఆయన చదువంతా వివిధ ప్రదేశాలలో యోగా మీద ఉపన్యాసాల ద్వారా వచ్చిన ధనంతో సాగింది.





కశ్మీర్‌లో శిష్యులతో స్వామీజీ

దాదాపు 150 ప్రసంగాలు ఇచ్చారు. చివరికి పూర్ణ సూత్రాలు పుస్తకంతో పాటు ఆయన జర్మనీలో ఇచ్చిన ఉపన్యాసాల సంకలనం కూడా వెలువరించారు.

1930లో జర్మనీలో గ్రాడ్యుయేషన్ తరువాత ప్రాగ్ (చెకోస్లోవేకియా)లో ప్రొఫెసర్ దోల్స్‌హెక్ పర్యవేక్షణలో చార్లెస్ విశ్వవిద్యాలయంలో మూడేళ్లు పరిశోధనలు చేశారు. అక్కడ ఆయన చేసిన పరి శోధన ఎక్స్‌రే స్పెక్ట్రోస్కోపి విధానాలకు కచ్చితత్వాన్ని తెచ్చాయి. ఇందుకు ఆయనకు డీఎస్సీ పట్టా (1936) ఇచ్చారు. అంతలోనే రెండో ప్రపంచ యుద్ధం వచ్చింది. ఆయన భారతీయుడు కాబట్టి ఇంగ్లండ్ వలస దేశవాసిగా భావించారు. ప్రాగ్ వంటి దేశాలన్నీ జర్మనీ పక్కన ఉన్నాయి. దీనితో ఆయనకు అక్కడ ఉండడం కష్టమైంది. ఇంగ్లండ్ వచ్చారు. అక్కడ న్యూట్రాన్‌ను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ జేమ్స్ చాడ్విక్ దగ్గర పరిశోధనకు చేరారు. అంటే లివర్ పూల్ విశ్వవిద్యాలయంలో అణు భౌతికశాస్త్ర విభాగంలో పనిచేయడానికి చాడ్విక్ జ్ఞానానందను తీసుకున్నారు. అక్కడే బెటా రే స్పెక్ట్రోస్కోపి మీద చేసిన పరిశోధనకు (1940-43) పిహెచ్.డి వచ్చింది. ఇక్కడ కూడా ఆయన జాతి వివక్షను ఎదుర్కొనవలసి వచ్చింది. భారత స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇవ్వడం బ్రిటిషర్లకు నచ్చలేదు. దీనితో ఆయన మిచిగాన్ (అమెరికా) విశ్వవిద్యాల యానికి వెళ్లారు. అక్కడ బెటా రే స్పెక్ట్రోస్కోపి పరిశోధనకే అనేక రేడియో యాక్టివ్ ఐసోటోప్స్‌ను జోడించారు. 1939లో ఆరంభించిన 'హై వాక్యూమ్' అన్న రచనను కూడా పూర్తి చేశారు.

1947లో స్వాతంత్ర్యం వచ్చిన కొన్ని నెలలకు ఆయన భారతదేశానికి తిరిగి వచ్చారు. నేషనల్ ఫిజిక్స్ లేబొరేటరీ (ఢిల్లీ)లో సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా చేరారు. తరువాత లేబొరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా 1950లో పదోన్నతి పొందారు.


మళ్లీ స్వగ్రామం వెళ్లారు. జీవితంలో మళ్లీ మరొక మలుపు. నాలుగేళ్లకు ఆయన గౌరగనమూడి వచ్చారు. అనుకోకుండా ఒక ప్రమాదానికి గురయ్యారు (ఏప్రిల్ 24, 1954). కుడిచేయికి, కాలికి బాగా దెబ్బ తగిలింది. దీనితో విశాఖపట్నంలోని కింగ్‌జార్జ్ ఆసుపత్రిలో చేర్చారు. అప్పుడే మరొక సంఘటన జరిగింది. జ్ఞానానంద కొంత కోలుకున్న తరువాత ఆంధ్ర విశ్వకళాపరిషత్ వైస్ చాన్సలర్ డాక్టర్ వీఎస్ కృష్ణ ఆయనను కలుసుకున్నారు. ఆ విశ్వ విద్యాలయంలో అణుభౌతికశాస్త్ర శాఖను అభివృద్ధి చేయడానికి భౌతికశాస్త్ర శాఖలో చేరవలసిందని కోరారు. అలా ఆయన గౌతమి పీఠం పేరుతో ఏర్పాటు చేసిన విభాగంలో చేరారు (అక్టోబర్ 15,1954). జూలై 1,1956న ఒక ప్రత్యేకంగా అణుభౌతిక శాస్త్ర శాఖ ఏర్పాటయింది. 1958లో ఆయన ఆచార్యునిగా పదోన్నతి పొందేనాటికి ప్రత్యేక భవన నిర్మాణం కూడా పూర్తయింది. ఆ పదవిలో ఆయన 1965 వరకు ఉన్నారు. భగవదైక్యం పొందే వరకు, అంటే 1969 వరకు ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా కొనసాగారు. ★



*'బానిసత్వం మీద మన మమకారం ఎప్పుడు చస్తుంది?*
*ఎప్పుడు మన తల్లికి పడ్డ సంకెళ్లు బద్దలవుతాయి?*
*ఎప్పుడు మన ఇక్కట్లు మటుమాయమవుతాయి?'*

అని ప్రశ్నించిన కలం ఆయనది. ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి సుబ్రహ్మణ్యభారతి. ఆయన తమిళ మహాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ పాత్రికేయుడు, సంఘ సంస్కర్త. స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశభక్తిని, జాతీయ భావాలను తన రచనల ద్వారా, తీవ్ర జాతీయవాదం ప్రాతిపదికగా ప్రదీప్తం చేశాడు. తమిళుల అభిమాన సినీ కవిగా ప్రసిద్ధుడయ్యాడు. కన్యాకుమారి నుండి కశ్మీరు వరకున్న అఖండ భారతాన్ని తన మాతృదేశమని విశ్వసించాడు. ఆయన దృష్టిలో తాను తొలుత భారతీయుడు, తర్వాత తమిళుడు. భారతీయులు విభజితులై ఉన్నా, వారంతా ఒకే తల్లి పిల్లలనీ, వారి పట్ల విదేశీయులు జోక్యం చేసుకోవలసిన పని ఏముంది? అని నిశితంగా ప్రశ్నించాడు. కులమతరహితమైన స్వేచ్ఛాభారతం కావాలని (1919-20) 'సంస్కరణ దృక్పథంతో' కోరుకున్నాడు.

సుబ్రహ్మణ్య భారతి డిసెంబర్ 11, 1882లో తమిళనాడులో అప్పటి తిరునల్వేలి జిల్లా, ఎట్టయాపురంలో జన్మించాడు. తల్లిదండ్రులు లక్ష్మీ అమ్మాళ్, సుబ్రహ్మణ్యం అయ్యర్. కుమారుడికి వీరు పెట్టిన పేరు చిన్నస్వామి. ప్రాథమిక విద్యాభ్యాసం తిరునల్వేలిలో సాగింది. పాఠశాల విద్యార్థి దశలోనే సంగీతం





# భారతి: స్వరాజ్య సమరానికి కవితా హారతి



డా॥ పి.వి.సుబ్బారావు
9849177594

నేర్చుకున్నాడు. పదకొండు సంవత్సరాల వయస్సులో కవిత్వ రచనకు పూనుకున్నాడు. ప్రతిభను బట్టి బాల్యంలోనే విద్యలకు అదిదేవత సరస్వతీ పేరిట 'భారతి' అనే బిరుదును అందుకున్నాడు. తమిళ సంప్రదాయాన్ని అనుసరించి తండ్రి పేరు 'సుబ్రహ్మణ్యం', బిరుదు 'భారతి'తో కలిపి 'సుబ్రహ్మణ్య భారతి' అయ్యాడు.

ఐదు సంవత్సరాల వయస్సులో తల్లి మరణించింది. నాటి సంప్రదాయాన్ని అనుసరించి 14 సంవత్సరాల వయస్సులో, ఏడేళ్ల చెల్లమ్మతో భారతి పెళ్లి జరిగింది. కుమారుడు గణితం చదువుకుని ప్రతిభావంతుడై ఇంజనీర్ కావాలని తండ్రి సుబ్రహ్మణ్య అయ్యర్ కాంక్షించాడు. భారతి మాత్రం బహుభాషల పట్ల ఆసక్తితో అనితర సాధ్యమైన పట్టుదలతో 32 భాషలు నేర్చుకున్నాడు. వాటిలో 29 భారతీయ భాషలు, 3 విదేశీ భాషలు. 16వ ఏట తండ్రి మరణించాడు. తరువాత భారతి ఉన్నత విద్యాభ్యాసం వారణాసిలో సాగింది. 'సంస్కృతం', హిందీ, ఆంగ్లభాషలు అక్కడే నేర్చుకున్నాడు. భారతీయ తాత్త్వికత, జాతీయతలను గూర్చి క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. వారణాసి సాంగత్యం ఆయనను హిందూ ఆధ్యాత్మిక వాదంతో, జాతీయవాదాన్ని మమేకం చేసే ప్రత్యేకతను సంతరించి పెట్టింది. దాంతో ఆయనకు విశాల దృక్పథం అలవడింది. ఆయన వేషధారణ మార్చుకున్నాడు. గడ్డం పెంచుకొని, కోటు చొక్కా, పంచె ధరించడం ప్రారంభించాడు. ఉద్యోగ ఎంపిక పరీక్షలో ఉత్తీర్ణుడైనా, ఉద్యోగం చేరలేదు. 1901లో స్వగ్రామం ఎట్టయాపురం చేరుకొని రాజాగారి వద్ద ఆస్థానకవిగా 1904 ఆగస్టు వరకు నాలుగు సంవత్సరాలు ఉన్నాడు. 1904 ఆగస్టు నుండి నవంబరు వరకు మధురై సేతుపతి హైస్కూల్లో ఉద్యోగం చేశాడు. ఆ కొద్ది నెలల్లో బయటి ప్రపంచం గూర్చి తెలుసుకున్నాడు. పశ్చిమాన సాగుతున్న పత్రికా రంగంలో మార్పులను ఆసక్తితో గమనించాడు. 1904లో 'స్వదేశీ మిత్రన్' అనే దినపత్రికలో సహాయ సంపాదకుడిగా చేరాడు.

1905లో కాశీలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యాడు. అక్కడి నుండి తిరిగి వచ్చే సమయంలో స్వామి వివేకానంద ఆధ్యాత్మిక వారసురాలైన సోదరి నివేదితను కలిశాడు. ఆమె ప్రభావంతో అప్పటి స్త్రీల దుస్థితిని, స్త్రీ విముక్తి అవసరాన్ని గుర్తించాడు. ఆమె ప్రేరణ భవిష్యత్తులో స్త్రీవాద భావాల సంస్కర్తగా పనిచేసేందుకు తోడ్పడింది. ఆమె తనకు భరతమాత స్వరూపాన్ని చూపించారని, ఆమెను తన గురువుగా భావించి ప్రస్తుతిస్తూ కవితలు రాశాడు.

**జాతీయోద్యమంలో**

భారతి తీవ్ర జాతీయవాదం వైపు మొగ్గారు. తిలక్, అరవిందుడు వంటి వారే ఆయనకు ఆదర్శం. ఉద్యమకారునిగా, కలం యోధునిగా ఆయన స్థానం చిరస్మరణీయమైనది. స్వాతంత్ర్య సాధనా దీక్షాదక్షుడై స్వాతంత్ర్య రహితమైన జీవితం వ్యర్థమని చక్కని దృష్టాంతంతో కవిత్వీకరించాడు.

*"వాన లేకున్న జీవిత వైభవమ్ము*
*మాసి పోజాలదే పెక్కుమాటలేల?*
*మమత గొల్పెడి స్వాతంత్ర్యమమర కున్న*
*దేనికీ జన్మ దీనులమైన మనకు?"*

వానలేకుంటే జీవిత వైభవం నిస్సారంగా సమసిపోతుందని, మమతాను రాగాలు నెలకొల్పే స్వాతంత్ర్యం లేని జన్మ వ్యర్థమన్నాడు. జాతీయోద్యమంలో చురుకైన కార్యకర్తగా పాల్గొన్నాడు. దాదాబాయి నౌరోజీ నేతృత్వంలో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. బెంగాల్ విభజన తరువాత జరిగిన అన్ని కాంగ్రెస్ సమావేశాలు చరిత్ర ప్రసిద్ధమైనవే. వాటిలో 1907లో జరిగిన కలకత్తా సమావేశాలు కూడా ముఖ్యమైనవే. వాటికి భారతి హాజరయ్యాడు. ఆ సమావేశంలో స్వరాజ్యాన్ని కాంక్షిస్తూ భారతీయులంతా బ్రిటీషు వస్తువులను బహిష్కరించాలని తీర్మానించారు.

స్వాతంత్ర్య సమరంలో పత్రికల పాత్ర అమోఘమైనది. అందుకే ఆ రంగం భారతిని ఆకర్షించింది. పాశ్చాత్య దేశాలలో పత్రికల ద్వారా ఉద్యమాలు విస్తరించిన తీరు అప్పటికే బాగా ప్రచారంలో ఉంది. అందుకే మొదట ఆయన 'స్వదేశీమిత్రన్' తమిళ దినపత్రికలో ఉపసంపాదకునిగా (1904) చేరారు. ఆ అనుభవంతోనే భారతి 1907 ఏప్రిల్‌లో 'ఇండియా' పేరుతో ఒక వార పత్రికను స్థాపించారు. ఈ పత్రిక స్థాపనంలో ఆయనకు ఎంపిటీ ఆచార్య చేదోడువాదోడుగా ఉన్నారు. ఆంగ్ల పత్రిక 'బాలభారతి' స్థాపన, నిర్వహణలో కూడా ఆయనకు ఆచార సహకరించారు. పాత్రికేయుడిగా పరిణితి సాధించిన భారతి సృజనాత్మకతను వ్యక్తీకరించేందుకు పత్రికలు సాధనాలుగా దోహదం చేశాయి. భారతి జాతీయోద్యమ స్ఫోరకంగా, పారతంత్ర్య ఛేదకంగా కవితలు, వ్యాసాలు రాసి ప్రజల్లో జాతీయోద్యమ భావాలను ప్రచారం చేశాడు. ఆ పత్రికల్లో వైవిధ్య భరితమైన ఆధ్యాత్మిక రచనలతోపాటు రష్యా, ఫ్రెంచి విప్లవాలపై ప్రబోధ గీతాలు రాశాడు.

1907లో జరిగిన చారిత్రాత్మకమైన సూరత్ కాంగ్రెస్ మహాసభల్లో ఒ. చిదంబరం, శ్రీనివాసాచార్యర్ వంటి ప్రముఖులతో కలసి భారతి పాల్గొన్నాడు. ఆ సమావేశాల్లో జాతీయ కాంగ్రెస్‌లో తిలక్, అరబిందో వంటి వారికి, మితవాదులుగా పేర్గాంచిన గోఖలే వర్గీయులకీ తీవ్ర విభేదాలు తలెత్తాయి. తిలక్ బ్రిటిష్ విన్నపాల ఉద్యమాన్ని నిరాకరించాడు.

1908లో చిదంబరం పిళ్లేకు వ్యతిరేకంగా పెట్టిన కేసులో భారతి వ్యతిరేకంగా సాక్ష్యమించాడు. అదే సంవత్సరంలో 'ఇండియా' అధినేతను మద్రాసులో అరెస్టు చేశారు. తనను కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందని భారతి ఫ్రెంచి పాలనలో ఉన్న పుదుచ్చేరికి వెళ్లి తప్పించుకున్నాడు. అక్కడ నుండి ఆయన 'ఇండియా, తమిళ దిన పత్రిక విజయ్, ఆంగ్ల మాసపత్రిక బాలభారత, స్థానిక పత్రిక సూర్యోదయం పత్రికలు నడిపారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆ పత్రికలకు చందాలు చెల్లింపులు నిలిపివేయడం ద్వారా 1909లో వాటిని నిషేధించింది.

పుదుచ్చేరిలో ప్రవాసంలో ఉండి, ఆంగ్లేయుల దమననీతిని సవాలు చేస్తున్న అరబిందో, లజపతి రాయ్, వి.వి.యస్. అయ్యర్ వంటి ప్రముఖ విప్లవపక్ష నాయకులను కలుసుకొనే అవకాశం భారతికి లభించింది. అరబిందో నిర్వహిస్తున్న ఆర్య

ఆధునిక తమిళ సాహిత్యానికి మార్గదర్శకుడిగా భారతిని తమిళ విమర్శకులు పేర్కొన్నారు. ఆయన తనకన్నా ముందున్న తమిళ సాహిత్య పోకడలకు భిన్నంగా సరళమైన ప్రాసయుక్తమైన పదాలతో రచనలు చేశాడు. ఆయన భక్తి రచనల్లో కొత్త పోకడలు, ఆలోచనలు శైలీ సౌందర్య విశేషాలను ప్రదర్శించాడు. తనకంటే ముందు గోపాలకృష్ణ భారతీయార్ ప్రయోగించిన సరళమైన 'నొంది చిండు' అనే ఛందస్సును తన రచనల్లో విరివిగా వినియోగించుకున్నాడు. ప్రగతిశీల సంస్కరణాత్మక భావాలను, ఆదర్శాలను ఆయన కవిత్వంలో వ్యక్తీకరించాడు.



జర్నల్, కర్మయోగి పత్రికలకు ఆరంభంలో భారతి సహాయం అందించాడు. ఆ సమయంలో వేద సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేశాడు. వేద సాహిత్య పరిజ్ఞానంతో రాసిన అత్యంత గొప్ప కృతులు 'కుయిల్ పాట్టు, పంచాలీ శపథం, కణ్ణన్‌పాట్టలనే మూడు బాగా ప్రసిద్ధాలు. వేదమంత్రాలను, పతంజలి యోగసూత్రాలను, భగవద్గీతను తమిళంలోకి అనువదించాడు. అవి ఆయన భక్తి భావ తత్పరతకు శిఖరాయమానాలు. ప్రవాసంలో గొప్ప రచనలు చేసిన తర్వాత 1918లో కడలూరు సమీపంలో బ్రిటిష్ ఇండియాలో ప్రవేశించాడు. పోలీసులు వెంటనే ఆయనను అరెస్టు చేసి కడలూరు కేంద్ర కారాగారంలో మూడువారాల పాటు నిర్బధించారు. అనీబిసెంట్, సి.పి.రామస్వామి అయ్యర్ వంటి ప్రముఖుల ప్రమేయంతో ప్రభుత్వం ఆయనను విడుదల చేసింది. ఆ దశలో పేదరికంతో బాధ పడుతూ అనారోగ్యం పాలయ్యాడు. తర్వాత 1919లో గాంధీని కలిశాడు. 1920లో మద్రాసులో 'స్వదేశీ మిత్రన్' పత్రికకు సంపాదకత్వం నిర్వహించాడు.

**భారతి కవితా విశేషాలు**

ఆధునిక తమిళ సాహిత్యానికి మార్గదర్శకుడిగా భారతిని తమిళ విమర్శకులు పేర్కొన్నారు. ఆయన తనకన్నా ముందున్న తమిళ సాహిత్య పోకడలకు భిన్నంగా సరళమైన ప్రాసయుక్తమైన పదాలతో రచనలు చేశాడు. ఆయన భక్తి రచనల్లో కొత్త పోకడలు, ఆలోచనలు శైలీ సౌందర్య విశేషాలను ప్రదర్శించాడు. తనకంటే ముందు గోపాలకృష్ణ భారతీయార్ ప్రయోగించిన సరళమైన 'నొంది చిండు' అనే ఛందస్సును తన రచనల్లో విరివిగా వినియోగించుకున్నాడు. ప్రగతిశీల సంస్కరణాత్మక భావాలను, ఆదర్శాలను ఆయన కవిత్వంలో వ్యక్తీకరించాడు. ఆధునిక తమిళ రచయితల కంటే భిన్నమైన ఆలోచనలు, ఊహలు, పద్యాల్లో ప్రాసబద్ధమైన పటుత్వమైన శైలీ సౌందర్యం కొత్త పుంతలు తొక్కి పాఠకులను విశేషంగా ఆదరించాయి.

ఆయన రచించిన వేలాది కవితల్లో వైవిధ భరితమైన విభిన్న భావాలు ప్రతిబింబించాయి. వాటిని స్థూలంగా 1. భారత జాతీయ గీతాలు, 2. ప్రణయ గీతాలు 3. ప్రకృతి గీతాలు 4. బాలల గీతాలు 5. తమిళభాష ఔన్నత్య గీతాలు, 6. ప్రముఖ స్వాతంత్ర్య పోరాట యోధుల ప్రశంసా గీతాలుగా వర్గీకరించవచ్చు.

రష్యా, బెల్జియంల విప్లవాలను గూర్చి పాటలు రాశాడు. ఆధ్యాత్మికపరంగా హిందూ దేవతలైన శక్తి, కాళి, వినాయకుడు, సుబ్రహ్మణ్యం, శివుడు, కృష్ణుడు వంటివారితోపాటు ఇతర మతాలకు సంబంధించిన అల్లా, క్రీస్తు గూర్చి ప్రస్తుతిస్తూ కవితలు రాసి మత సామరస్యాన్ని చాటుకున్నాడు. అనువాదం భారతి సాహిత్య సేవలో భాగమే. అరబిందో, బాలగంగాధర తిలక్, స్వామి వివేకానంద వంటి వారి ప్రసంగాలను అనువదించాడు.

భారతి రచించిన పాటలు తమిళ సినిమాల్లోనూ, సంగీత కచేరీల్లోనూ విరివిగా ఉపయోగించేవారు. తమిళ కవుల అభిమాన సినీ రచయితగా నిలిచాడు.

తెలుగు భాషా మాధుర్యానికి పరవశించి మధురమైన 'సుందర తెలుంగు'గా ప్రశంసిస్తూ గానానుకూలమైన గొప్ప భాషగా పేర్కొన్నాడు.

*"విరియగాచిన వెన్నెల రాత్రిలో*
*చేర దేశపు చెలులు వెంటరాగా*
*సుందరాంధ్ర పదమ్ము పాడుచున్*
*సింధునదిని పడవ నడుపుచునాడుదాం"*

విరియగాంచిన వెన్నెల రాత్రుల్లో చేరదేశపు సుందరాగులతో కలిసి సింధునదిలో పడవ ప్రయాణం చేస్తూ సుందరమైన తెలుగుపదాలను గానం చేస్తే కలిగే గొప్ప అనుభూతినీ, తెలుగుభాషా మాధుర్యాన్ని పారవశ్యంతో ప్రశంసించాడు.

తిరువళ్లువర్, కీర్తికంఠుడు వంటి తమిళ మహా కవులతోపాటు పోతన, కందుకూరి వీరేశలింగం వంటి తెలుగు కవులను ప్రశంసించాడు. సంగీత సార్వభౌముడైన త్యాగయ్యను కూడా కీర్తించాడు.

స్త్రీవాద భావుకుడిగా స్త్రీలు రాజకీయాల్లోకి రావాలని కాంక్షించిన తొలి తమిళ కవి భారతి. స్త్రీల హక్కులకు భంగం కలిగించే శాస్త్రాలను, ఆచారాలను ఖండించాడు. కుల వ్యవస్థను వ్యతిరేకించాడు.

ప్రముఖ తమిళ మహాకవిగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా, ప్రసిద్ధ పాత్రికేయుడిగా, సంస్కర్తగా తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్న భారతి సెప్టెంబరు 12, 1921న 38 సంవత్సరాల వయస్సులో మరణించాడు.

ఆయన మరణించిన 72 సంవత్సరాల తర్వాత 1993లో తమిళనాడు ప్రభుత్వం ఆయన ఇంటిని కొనుగోలు చేసి పునరుద్ధరించి 'భారతి ఇల్లం' (భారతి ఇల్లు) పేరుతో స్మారక చిహ్నంగా నిలిపింది. జాతీయ మహాకవి భారతి తమిళ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు. తెలుగు భాషా మాధుర్యాన్ని, ఘనతను వినుతించిన ఆయన తెలుగువారికి అభిమాన పాత్రుడు. ఆయన 130వ జయంతి సందర్భంగా ఆయనకిదే నివాళి.

వ్యాకసర్త : రిటైర్డ్ ప్రొఫెసర్ & తెలుగు శాఖాధిపతి, సి.ఆర్. కళాశాల, గుంటూరు.



# సద్భావన సదస్సు



కరణం జనార్ధన్, ఓలేటి సత్యనారాయణ



**మదనపల్లె :** నవంబర్ 23న జరిగిన సద్భావన సదస్సులో వేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రాంత సద్భావన కన్వీనర్ ఓలేటి సత్యనారాయణ, అన్నమయ్య జిల్లా సంపర్క ప్రముఖ్ కె. జనార్ధన్. ఈ కార్యక్రమంలో తిరుపతి విభాగ్ సంపర్క ప్రముఖ్ గణపతి సింగ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

---






**కర్నూలు :** నవంబర్ 27న బుధవారంపేటలోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో సద్భావన సదస్సు జరిగింది. వేదికపై నగర సంఘచాలక్ సూరా వెంకట్‌రెడ్డి, ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీనివాస్‌రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా సంపర్క ప్రముఖ్ పి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జాగృతి-రాజ్యాంగ దినోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ




**భాగ్యనగర్ :** రాజ్యాంగ దినోత్సవం (నవంబర్ 26) సందర్భంగా భాగ్యనగరం, కేశవ మెమోరియల్ స్కూల్‌లో నవంబర్ 25న జరిగిన కార్యక్రమంలో జాగృతి వెలువరించిన 'రాజ్యాంగ దినోత్సవ' ప్రత్యేక సంచికను హైకోర్టు జడ్జీ నగేశ్ బీమపాక ఆవిష్కరించారు. వేదికపై అడిషనల్ సొలిసిటర్ జనరల్ టి. సూర్యకరణ్ రెడ్డి, అఖిల భారతీయ న్యాయవాద పరిషత్ సీనియర్ కౌన్సిల్ అధ్యక్షులు కె. శ్రీనివాసమూర్తి, తెలంగాణ శాఖ అధ్యక్షులు ఎల్. ప్రభాకర్‌రెడ్డి, జాగృతి ప్రకాశన్ ట్రస్ట్ కార్యదర్శి పి. రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. ★

# గ్రామ పూజారులకు శిక్షణ కార్యక్రమం







**ఇందూర్ :** గ్రామాల్లోని దేవాలయాల్లో పూజారులుగా పనిచేస్తున్న వారికి ఇందూరు జిల్లా, నందిపేట, కేదారేశ్వర ఆశ్రమంలో నంగిరాములు మహరాజ్ ఆశీస్సులతో నవంబర్ 15 నుండి 22 వరకు శిక్షణ కార్యక్రమం జరిగింది. విభాగ్‌లోని 4 జిల్లాలోని 102 గ్రామాల నుండి 107 మంది పూజారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ధర్మ జాగరణ సంయోజక్ తోట ప్రభురాజ్, పరియోజన ప్రముఖ్ దయానంద్, ప్రాంత సంస్కృతి ప్రముఖ్ బొడ్డు సురేందర్, ప్రాంత సహ సంస్కృతి ప్రముఖ్ లాడియా విఠల్, విభాగ్ ధర్మ జాగరణ ప్రముఖ్ మక్తాల మల్లేష్, జిల్లా ప్రముఖ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. ★



'భూమి' అనేది తెలుగులో రెండక్షరాలే కానీ, వాస్తవంలో అనంతం. మొదలూ తుది తెలియనంత అపారం. జగజ్జేత అనేదీ నాలుగక్షరాలే అయినా అంతా శక్తి సంపన్నం. ఎందులోనైనా ఛాంపియన్లు ఉండవచ్చునేమో... భూతలానికైతే ఉంటారా? ఉండరు గాక ఉండరు. మరి ఇదే నేలమీద ఉన్న మూగప్రాణులు అదీ... చిట్టిపొట్టి పిట్టలకోసం ఒక వ్యక్తి ఓ సైన్యాన్ని తయారు చేస్తే! అరుదైన వాటిని కంటికిరెప్పలా కాపాడేందుకు తన జీవితాన్నే అంకితం చేస్తే!! ఛాంప్ అని ఎందుకు అనకూడదు? ఈ ప్రశ్నే వేసింది ఐక్యరాజ్యసమితి (ఐరాస). సమాధానాన్నీ తానే ప్రకటించింది అవార్డుల రూపంలో. ఆ విజేతల్లో ఒకరైన పూర్ణిమాదేవి మన భారతీయురాలు. పవిత్ర బ్రహ్మపుత్ర నదీ ప్రాంతమైన అసోంలోని గ్రామీణురాలు. తన భావ ప్రభావాలతో వేలాది పక్షి ప్రేమికులను ఒకే తాటిపై నడిపిస్తున్న లలనామణి. ప్రకృతి వరప్రసాదాల పరిరక్షణి.

# ప్రాణిప్రేమికా 'పూర్ణ'

ఎప్పుడు కలకలా కిలకిలా నవ్వుతుండటమే పూర్ణిమకు తెలుసు. అంతర్జాతీయ వనితా దినోత్సవం సందర్భంగా నాలుగేళ్ల క్రితం మన రాష్ట్రపతి నుంచి 'నారీశక్తి' పురస్కారం అందుకున్న సంగతి విదితమే. అదే సంవత్సరంలో యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి ఆమెకు 'గ్రీన్ ఆస్కార్ పురస్కారం' కూడా ప్రకటితమైంది. ప్రతిష్టాత్మక విట్లే అవార్డు అన్నా అదే. ఐరాస కార్యాచరణలో భాగంగా భారత జీవవైవిధ్య పురస్కృతినీ సొంతం చేసుకున్నారు. రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ ఆమెను 'ఎర్త్ హీరోయిన్'గా అభివర్ణించింది. గ్రీన్‌గురు, మహిళా సాధకురాలు లాంటి మరెన్నో అభివర్ణనలు, సన్మాన పరంపరలూ ముంచెత్తాయి. వీటన్నింటితోపాటు ప్రాంతీయ, జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో వరించిన బహుమానాలు పెద్ద సంఖ్యలో ఆమె ఇంట్లో, కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యక్షమవుతుంటాయి. వీటన్నిటిలో కలికితురాయి అనేలా, ఐరాస ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం కింద వ్యవస్థాపక కేటగిరీలో ఈ ఏడాది మేటి



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**

గౌరవమూ ఆమెకే దక్కింది. ఎన్నెన్ని విజయాలు ఆమెను శిఖరంపైన నిలిపినా ఆమె చూపులు మాత్రం 'హర్గిల' (అక్కడి పరిభాషలో హర్గిల అంటే కొంగ) వైపే! ఎందుకో! అవి ఏమిటో తెలుసుకుందాం ఇప్పుడు.

**కరుణ ప్రసరణ**

అసలు పూర్ణిమ ఊళ్లోనే పక్షుల విహారం ఎక్కువ. చిన్నప్పటి నుంచీ వాటిని చూస్తూనే పెరిగింది. ఇంటి నుంచి పొలం పనికి వెళ్లిన ప్రతిసారీ వాటి కోసమే ఆకాశంవైపు చూస్తూండేది. కేవలం చూపులతోనే ఆగిపోలేదు. ప్రాణుల (జలచరాల, గగన విహారాల) తీరుతెన్నులను రోజంతా పరిశీలించేలా చేశాయి. ఆ శాస్త్రమే చదువుకుని పట్టభద్రులయ్యారు. అవే అంశాలపరంగా పరిశోధనకీ సంసిద్ధులయ్యారు. ప్రధానంగా ఒక తరహా కొంగలకు సంబంధించే ప్రత్యేక ఆసక్తి. అందునా అవి అరుదుగా కనిపించేవి. కాలక్రమంలో ఆ జాతి కనుమరుగవుతుందన్న నిజం ఆమెకు నిద్ర పట్టకుండా చేసింది. ఏ విధంగానైనా వాటిని కాపాడి తీరాలన్న పట్టుదల. ఊళ్లకు ఊళ్లు పెరిగిపోతున్నాయి. ఆకాశాన్ని తాకేలా భవనాలు లేస్తున్నాయి. ఎటుచూసినా బిగింపు వాతావరణమే! కొంగల స్వేచ్ఛాయుత జీవనం ఇంకెక్కడ? జనంలో కొంతమందికైతే పక్షులంటేనే పడదు. అవంటే లెక్కే ఉండదు. అవి కనిపిస్తేనే ఏదేదో ఊహించుకుని దూరం తొలగిపోయే వారున్నారు. వాటిని తాకితేనే జబ్బులొస్తాయని భ్రమపడే ఆలోచనలు మరికొందరివి. ఇంకా మరెన్నో కారణాలు కొంగల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. కాలగతిలో అంతరించేలా 'పుణ్యం' కట్టుకుంటున్నాయి. ఇదంతా చూస్తుంటే పూర్ణిమకు దుఃఖం పొర్లుకొచ్చేది. ఏదైనా చేసి ఆ కొంగల్ని కాపాడాలని బలంగా అనిపించేది.

**గూడు కట్టి, ఊతమిచ్చి....**

అంతటితో ఇల్లొదిలి ఇవతల కొచ్చిందామె. ఊరూ ఊరూ వెళ్లి చూసింది. అక్కడి వారితో...ప్రత్యేకించి ఆడవారితో పరిచయాలు పెంచుకుంది. పక్షుల సంరక్షణ అనే సరికి కొంతమంది నవ్వి ఊరుకునేవారు. మరికొందరు 'వాటి సంగతి మాకెందుకూ' అంటుండేవారు. 'ఏమిటీ మాటలు' అన్నట్లు ఇంకొందరు వింతగా చూసేవారు. ఎవరు ఎలా స్పందించినా పూర్ణిమ నిరాశ పడలేదు. రెట్టించిన ఆత్మ విశ్వాసంతో ప్రతి ఒక్కరిని కూర్చోబెట్టి కథలుగా చెప్పేది. 'కొంగలే కదా అనుకోవద్దు.అవీ మనలాంటి ప్రాణమున్నజీవులేగా. పాపం.... అంతరించి పోతున్నాయి. మనం కలసికట్టుగా వాటన్నింటినీ పదిలంగా చూసుకుందాం. ఆ పక్షులంటూ ఉంటే, సంచరిస్తుంటే, ప్రకృతికి అందం, ఆనందం. ఇంత పెద్ద వాళ్లం అంత చిన్నవాటిని జాగ్రత్తగా చూసుకోలేమా...'అని వివరించి చెప్పడంతో కొద్దిమందిలో మార్పు కనిపించింది. అదిగో, అదే ఆమెను ముందుకు నడపింది. ఆ ఐరాస కార్యాచరణలో భాగంగా అరుదైన జీవాల ప్రాణాలు నిలవాలంటే ఆహారం, గూడు ఉండాలి. భద్రంగా ఒకచోట ఉండేలా చేస్తే, వాటి నివాసానికి ఆలంబన ఏర్పరిస్తే చాలని





కార్యకర్తలంతా నిశ్చయించుకున్నారు. కొంగల గూళ్ల ఏర్పాటుకు ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేస్తూ వచ్చారు. హర్గిలను పరిరక్షించే వారు కనుక వారిని 'హర్గిల ఆర్మీ' అంటారు. వారంతా ఊళ్లలో గూళ్లు నిర్మించసాగారు. కొద్దిగా మొదలైనవి వేలకు విస్తరించాయి. మొదట ఉదాసీనంగా ఉన్న వ్యక్తులే ఆ తర్వాత ఉత్సాహంగా ముందుకొచ్చారు.


**విస్తార సేవ**

గాలిలో విహరించే కొంగలకు నేలమీద వెదురుబొంగులపైన ఉండే గూళ్లు కనిపించాయి. అవే వాటి నివాసాలుగా మారుతూ వచ్చి, భద్రతను సమకూర్చాయి. కాలం గడుస్తున్నకొద్దీ సంతానోత్పత్తి తదితర దశకు చేరాయి.ఒకప్పుడు నిలువనీడే కరవైన వాటికి ఆ తోడు కల్పించడమే పూర్ణిమసేన ఘనత.అయితే 'ఘనత' అంటే మాత్రం ఒప్పుకోరు. 'చేయాల్సినవే చేస్తున్నాం. నాతోపాటు మరికొంతమంది కలిసొచ్చి ఆ జీవాలకు తోడూనీడా అందిస్తున్నారు అంతే.. ఇది మానవత' అంటారు వినయం ఉట్టిపడేలా. కొంతమంది అంటారే కానీ ఊరూరా ఎందరో విస్తరించారు. బృందాలుగా కదిలారు. ఆ ప్రాణి సంరక్షణకే పరిమితం చెట్ల నరికివేత ఎంత అనర్థమో,అది చిన్ని ప్రాణులకి అది ఎంత కీడు చేస్తుందో గ్రామ గ్రామాన విశదీకరించిదా 'సేన'. పిట్టలు చేరని చెట్లు ఏ సంస్కృతికి నిదర్శనం?అని సూటిగా ప్రశ్నించింది. వనితా బృందాల ఉమ్మడి కృషి అసాధారణ ఫలితాల నిచ్చింది.

గుహవాటి విశ్వవిద్యాలయంలోవన్యప్రాణి శాస్త్రాన్ని అభ్యసించిన పూర్ణిమ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ 'అరణ్యాయన్' నేతగా అద్భుతాలనే సృష్టించారు. పరిసరాల పరిరక్షక వనితా బృందం సంచాలకురాలిగా అనేక కార్యక్రమాలను చేపట్టి ఫలప్రదం చేయగలిగారు. గ్రామీణులను చైతన్య వంతం చేశారు. పట్టణ వాసుల ఆలోచనలకు మెరుగులు దిద్దారు. వన్యప్రాణాల్ని కాపాడు కోవాల్సిన అత్యవసరాన్ని వీధి నాటకాలు, ప్రదర్శ నలు, ప్రసంగాల ద్వారా జనావళికి విపులీకరిం చారు. చెట్లమీద గూళ్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన ప్రాంతీయులు, కార్యకర్తలకు ప్రోత్సాకాలందిం చారు. ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆహ్వానించి సందేశాలిప్పించి, ప్రజలందరినీ కార్యోన్ముఖులుగా రూపుదిద్దారు. సంబంధిత అటవీ, పోలీసుశాఖల సహాయ సహకారాలతో ఒక ప్రజా ఉద్యమంగా మలిచారు పూర్ణిమాదేవి బర్మన్.

**అన్నీ తానైన వనిత**

సీనియర్ ప్రాజెక్టు మేనేజరుగా, సేవాసంస్థ నిర్వాహక ప్రముఖురాలిగా, కార్యక్రమాల సమన్వయకర్తగా, ప్రకృతి ప్రేమిక సంస్థకు అన్నీ తానుగా ఆమె బహుముఖ పాత్ర నిర్వర్తించారు. 'హర్గిలసేన' వ్యవస్థాపకురాలిగా, పరిశోధక వేత్తగా, అంతకు మించి బాధ్యతాయుత పౌరురాలిగా విధుల నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు. ఇంత చేసినా ఏనాడూ విశ్రాంతి కోరుకోలేదు. ఎప్పుడూ వన్య ప్రాణుల ఛాయాచిత్రాలు తీస్తూనో, వాటి పరిరక్షణ ప్రాముఖ్యాన్ని ఇతరులకు వివరిస్తూనో, పర్యటనలు కొనసాగిస్తూనో ఉంటారు. వ్యక్తిగత సమాచారం కన్నా సంస్థాగత వివరాలు తెలియజేసేందుకే ఇష్టపడుతుంటారు. పిల్లల మొదలు పెద్దల దాకా అన్ని వయసుల వారికీ పర్యావరణ సంరక్షణ గురించి తెలియజేస్తూ కనిపిస్తుంటారు. ఆమె సాగించినన్ని సందర్శనలు, చదివినన్ని పుస్తకాలు, చేసినన్ని పరిశోధనలు, నిర్వహించినన్ని వైవిధ్య కార్యక్రమాలు మరెవ్వరూ చేపట్టలేదని ఘంటాపథంగా చెప్పవచ్చు. అసోంలోని మారుమూల గ్రామ ప్రాంతంలో మొదలైన యోచన అంతర్జాతీయ స్థాయికి విస్తృతమై 'ఛాంపియన్' అని పిలిపించిందంటే, అంతకంటే ఇంకేం కావాలి? నిజంగానే నిస్సందేహంగానే పూర్ణిమాదేవి ఒక ఛాంప్. చిన్ననాటి అనుభవాన్ని ఆచరణగా మార్చి 'అరుదైన ప్రాణి'కి అర్థాన్నే మార్చిన కార్యశీలి. ఆలోచనలు అందరికీ ఉంటాయి. ఆచరణకు కొందరే తెస్తారు. అందులో విజయాన్ని కొంతమందే సాధిస్తారు. ఆ విజయం అంతర్జాతీయమైతే, 'ఎర్త్ ఛాంప్'గా బహూకృతమైతే, అదీ ఒక నారీమణి ఘనాతిఘన జీవనయానం. శాస్త్రవేత్తల సమాజానికి అన్ని విధాలా సగర్వ కారణం. శాస్త్రం, మానవత, పౌరధర్మాల మేళవింపుల సమీకృత రూపమే పూర్ణిమాదేవి... ఆదర్శజీవి. ★



# వైభవంగా 'బాలికా శక్తి



**'పితాపుత్రహౌభ్రాతృంశ్చ భర్తా రమేవ ।**
**సుమార్గం ప్రతిప్రేరయంతీ మివ ॥'**

**ఒక మహిళ విద్యావంతురాలైతే తనతో పాటు తన తండ్రిని, అన్నదమ్ముల్ని, భర్తను, ఇంటిల్లిపాదినీ మంచిమార్గంలో ప్రయాణించడానికి, వారిలో మార్పు తీసుకురావడానికి కారణమవుతుందని పై శ్లోకానికి అర్థం. ఆ విధంగా ఆడపిల్లలకు చక్కటి సంస్కారాన్ని అందిస్తూ, విలువలతో కూడిన విద్యను బోధిస్తున్న శ్రీ సరస్వతీ విద్యాపీఠం హైదరాబాద్ శివారు కన్యా శాంతి ఆశ్రమంలో నవంబర్ 25, 26, 27 తేదీలలో బాలికా శక్తి సంగమం కార్యక్రమాన్ని న భూతో న భవిష్యతి అన్న రీతిలో నిర్వహించింది.**

సమాజంలోని వివిధ రకాల పోకడలను ఎదుర్కొనేందుకు వీలుగా బాలికల్లో ఆత్మ విశ్వాసం, మనోనిబ్బరం, పటిష్టత, నైపుణ్యం, ఏకాగ్రత వంటి అంశాలలో వారికి శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ఉద్దేశం. అద్భుతమైన యోగా కేంద్రంగా పేరున్న శాంతివనంలో, పచ్చదనం పరచుకొన్న వాతావరణంలో వేలాది బాలికలను ఈ నైపుణ్య శిక్షణ ద్వారా జీవితంలో ఉషోదయాల వైపుకి పయనింప చేశారు.

**స్వర్ణోత్సవాల సందర్భంగా..**

తెలుగు రాష్ట్రాల్లో 50 ఏళ్ల క్రితమే శిశు మందిరాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొనే శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ప్రస్తుతం స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన అనేక అద్భుత కార్యక్రమాల్లో బాలికా శక్తి సంగమం వినూత్నంగా నిలుస్తుంది.

**మూడు రోజుల అద్భుత ఘట్టం**

బాలికా శక్తి సంగమం అంటే బాలికల్లో దాగి ఉన్న అద్భుతమైన శక్తిని సమీకరించటం. పేరుకి తగినట్లుగానే వేలాది బాలికలను ఒక చోటకు చేర్చి క్రమశిక్షణతో కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజున దేశం నలుమూలల నుంచి వచ్చిన విశిష్ట అతిథుల మధ్య ఉద్ఘాటన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా విభిన్న అంశాల మీద విద్యార్థినులకు భారతీయం నిర్వాహకులు సత్యవాణి, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, క్షేత్రం సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి మార్గదర్శనం చేశారు. విద్యార్థినులు రకరకాల అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు.

రెండో రోజున వివిధ రంగాల నిపుణులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో టైమ్స్ ఆఫ్ ఇండియా డిజిటల్ ఎడిటర్ అమృత, బాలల హక్కుల కమిషన్ సభ్యులు అపర్ణ, విద్యావేత్త డాక్టర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు. ఆయా రంగాలలో అత్యున్నత స్థితికి చేరిన ఈ మహిళామణులు పిల్లలను ఉత్తేజ పరుస్తూ ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చామని, ఆంగ్లం సరిగా రాదని, ఆధునిక హంగులు అందటం లేదని కుంగిపోవొద్దని సూచించారు. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకున్న మహిళామణుల జీవితాలను ఉదాహరిస్తూ.. అటువంటి అనంత శక్తి సంపద ఆడపిల్లలందరి లోనూ దాగి ఉందని చెప్పారు. ఆడపిల్లలు తలుచుకుంటూ అద్భుతాలు సాధించ గలరని స్ఫూర్తిని నింపారు. జీవితంలోని ఏ దశలోనూ వెనుకంజ వేయాల్సిన పని లేదని, పురోగతి దిశగా పట్టుదలగా దూసుకుపోవాలని సూచించారు. అతిథుల ప్రసంగాలతో బాలికలు ఎంతో ఉత్తేజితు లయ్యారు.

తర్వాత పథ సంచలన్ కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉప్పొంగిపోయే సంగీత సవ్వడులకు అనుగుణంగా వేలాది బాలికలు క్రమశిక్షణతో ముందుకు సాగిపోతూ.. ఆదిశక్తి రూపాన్ని ప్రతిబింబించారు. కాషాయ దుస్తులలో మెరిసిపోతున్న బాలికాశక్తిని చూసేందుకు రెండు కళ్లు సరిపోలేదనే చెప్పాలి. ఈ కార్యక్రమంలో బాలికలు చేసిన ఘోష్‌నాదం చూపరులను ఆకట్టు కుంది.

మూడో రోజు సమారోప్‌తో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం ప్రాంత





అధ్యక్షులు, మాజీ వైస్ ఛాన్సలర్ తిరుపతిరావు, స్ఫూర్తి పత్రిక సంపాదకులు అన్నదానం వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మూడు రోజులపాటు జరిగిన బాలికా శక్తి సంగమం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ శిశుమందిరాల నుంచి వచ్చిన బాలికలకు మన ఆచార వ్యవహారాలు, అందులోని శాస్త్రీయత, కుటుంబ విశిష్టత, ఆరోగ్యం, ఇంటి వైద్యంతో పాటు

# సంగమం'

పర్యావరణ పరిరక్షణ, లలితకళలు, ఆటలు వంటి అంశాలలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాపీఠం ఆచార్యులు, మాతాజీలు, కార్యాలయ సిబ్బంది పాలుపంచుకున్నారు.

**విలువలతో కూడిన విద్యావిధానమే లక్ష్యం**

భారతీయ విలువలతో కూడిన విద్యావిధానం అందించడమే శిశుమందిరాల లక్ష్యం. దేశంలో తొలిసారిగా ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో మొదటి శిశుమందిర్ పాఠశాల ప్రారంభమైంది. ఆ తర్వాత క్రమంగా దేశమంతటా విస్తరించాయి. వీటి నిర్వహణ కోసం ఆయా ప్రాంతాల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విద్యా కమిటీలన్నీ విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థకు అనుబంధంగా ఉన్నాయి. విద్యాభారతి సంస్థలో మొత్తం 13,067 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో తెలుగు రాష్ట్రాల్లో 349 పాఠశాలలు ఉన్నాయి.

సాధారణంగా ఏ పాఠశాల చూసినా కేవలం విద్య, అంటే పాఠ్యాంశాలనే ప్రధానంగా బోధిస్తారు. కానీ శిశుమందిరాల్లో కేవలం మార్కుల కోసమో, ర్యాంకుల కోసమో బోధన జరగదు. పాఠ్య ప్రణాళికకు తోడుగా, క్రీడా ప్రణాళిక, దేశభక్తితో కూడిన విద్య వంటివి కూడా ఉంటాయి. ముఖ్యంగా పంచకోశ విద్యను ఇక్కడ బోధిస్తారు. ప్రాచీన, మరుగున పడుతున్న కళలను నేర్పిస్తారు. యోగ, సంగీతం, కోలాటం, కరాటే, ఘోష్ వంటి వాటిల్లో శిక్షణతో పాటు దేవభాష సంస్కృతం బోధిస్తారు. వేదగణితంలో శిక్షణను అందిస్తారు.

ఒక విద్యార్థి తన నిజ జీవితంలో జరిగే ఆటుపోట్లను తట్టుకుని సమాజంలో ధైర్యంగా ఎలా నిలబడాలో కూడా నేర్పిస్తారు. ఇలాంటి వాతావరణంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో ఏ స్థాయిలో, ఏ సంస్థలో పనిచేస్తున్నా దేశం, ధర్మం, జాతి ఐక్యతను ప్రధాన లక్ష్యాలుగా ఏర్పరుచుకుని తమ జీవితాన్ని కొనసాగిస్తుంటారు.

## మన సంస్కృతే, మన సంపద

**– లింగం సుధాకర్‌రెడ్డి**

భారత్‌పై ఎందరు దాడులు చేసినా.. భారత్ భారత్‌గానే ఉందంటే మన సంస్కృతే అందుకు కారణం. చాలా రకాలుగా భారతీయులను ప్రలోభపెట్టడానికి యత్నాలు జరిగినా సఫలీకృతం కాలేకపోయారు. అందుకు కారణం మన సంస్కృతి అనే వేళ్లు బలంగా పాతుకుపోవడమే. భూమి మనకు తల్లి అని, ఆ పూజ్య భావనే అనాదిగా ఆచరిస్తున్నాం. ఈ భావనలకు, బలాలకు మూలంగా మహిళలు నిలుస్తున్నారు. అటువంటి మహిళల్ని శక్తిమంతం చేసే దిశగా చేస్తున్న ప్రయత్నమే బాలికా శక్తి సంగమం.

**విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా మంత్రి**

## ఎన్నో ప్రయోజనాలు

**– డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు**

బాలికా శక్తికి ఈ సంగమం ఓ సంకేతం. కుటుంబ విషయాల్లో, సమాజ పరంగా తీసుకునే నిర్ణయాల్లో స్త్రీ భాగస్వామ్యం కచ్చితంగా ఉండాలి. కుటుంబాల నిర్ణయాల్లో మహిళలు భాగస్వాములుగా రాణిస్తున్నారు. అదే రీతిన సమాజాన్ని, కుటుంబాన్ని నడపగలిగితే సాధికారత వచ్చినట్లే. బాలికా శక్తి సంగమం ద్వారా స్పష్టమైన ప్రయోజనాలు పిల్లలకు దక్కుతాయి.

**విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు, ఐఏఎస్ (రిటైర్డ్)**

అలాగే మనం ఏ పాఠశాలలోనైనా ఉపాధ్యాయులను సార్/మేడం అంటూ పిలవడం చూస్తుంటాం. కానీ శిశుమందిరాలలో ఆచార్యజీ, మాతాజీ అని సంబోధిస్తారు. దీనివల్ల విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పెద్దల పట్ల గౌరవభావం పెరుగుతుంది.

శిశుమందిరాల్లో తొలి నుంచి తెలుగులోనే విద్యాబోధన కొనసాగుతున్నా కాలక్రమంలో వచ్చిన మార్పుల వల్ల ఆంగ్ల మాధ్యమంలోనూ పాఠశాలలను ప్రారంభించారు. అయితే బోధన విషయంలో మాత్రం అవే పద్ధతులను అవలంబిస్తున్నారు, విద్యార్థులను దేశభక్తి పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని వారికి కూడా విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఏకోపాధ్యాయ పాఠశాలలను, సంస్కార కేంద్రాలను కూడా నిర్వహిస్తోంది శ్రీ సరస్వతీ విద్యాపీఠం. ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా రెండేళ్ల క్రితం శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో సీబీఎస్ఈ పాఠశాలను కూడా ఏర్పాటు చేసింది.

**– రమ విశ్వనాథన్, ప్రాంత ప్రచార ప్రముఖ్**
**సంతోషలక్ష్మి, ప్రాంత ప్రచార సభ్యులు**
**(శ్రీ సరస్వతీ విద్యాపీఠం)**



## కథ

ఆరోజు నందం గారు చాలా ఆనందంగా ఉన్నాడు. ఆయన పేరు రామశాస్త్రి అయినా అంతా ఇంటి పేరునే పాపులర్ చేశారు. అంతా నందం గారనే అంటారు. సీతారాంపురంలో రామాలయం పూజారి. చుట్టు ప్రక్కల నాలుగు ఊళ్లకు పౌరోహిత్యం గూడా ఆయనదే.

నందం గారు ఆరోజు పురుషోత్తమరావు. గారి మనవరాలి పెళ్లి చేశారు. అప్పగింతలు అయిన తర్వాత ఆయన కొడుకు సంజీవరావు నందం గారిని అడిగాడు.

"పంతులు గారూ! ఎంతివ్వమంటారు?"

"మీ ఇష్టం"

"వెయ్యి నూట పదహార్లు ఇవ్వనా...?"

నందంగారు తలూపారు. అక్కడే ఉన్న పురుషోత్తమరావు. కొడుకు మీద మండిపడ్డాడు.

"ఏంట్రా సంజీవా? నందం గారితో బేరం ఆడుతున్నావు? పెళ్లికి లక్షలు ఖర్చు పెడతారు. పురోహితుడికి ఇవ్వడానికి బేరం ఆడతారు. ఏ మనుషులో...!"

"అది కాదు నాన్నా..." అని సంజీవ రావు తండ్రికి ఏదో చెప్పబోయాడు.

"ఆయన్ని అడిగేదేంటి? పదివేలు ఇవ్వు..'' సీరియస్‌గా అన్నాడు పురుషోత్తమరావు.

సంజీవరావు తాంబూలంలో పదివేలు పెట్టి ఇచ్చాడు. ఆరోజు అనుకోని ఆదాయం రావడంతో నందంగారికి చాలా ఆనందంగా ఉంది.

ఇంటికి వచ్చేసరికి భార్య సీతాలక్ష్మి ఎదురొచ్చి ఏడవడం సాగించింది.

నందం గారికి కంగారు పుట్టింది.

"ఏమైంది...?" అని ప్రశ్నించాడు

ఏడుస్తున్న సీతాలక్ష్మి నోట మాటలు రావడం లేదు.

'ఏమైందంటే...?'

సీతాపురం ఎస్టేట్ చివరి రాజా నరసింహారావు. చివరి రాజా అని ఎందుకంటే, ఆయన హయాంలోనే ఇండియాకి స్వతంత్రం వచ్చింది. 1949లో ప్రభుత్వ ఎస్టేట్ ఎబాలిష్ చట్టం తెచ్చింది. చివరి రాజా గారికి భరణం ఇచ్చి అధికారాలకి కళ్లెం వేసింది.


పూలమ్మిన చోట కట్టెలమ్మినట్టుగా ఉంటుందని ఆయన మకాం మద్రాస్‌కి మార్చాడు. అక్కడే వ్యాపారాలు మొదలుపెట్టి సెటిలైపోయాడు. ఆయన కుటుంబం అక్కడే ఆస్తులు సంపాదించి బంగళాలు కట్టుకుని నగర ప్రముఖులైపోయి హైసొసైటీలో చేరిపోయారు.

సీతారాంపురంలో అప్పటి దివాన్ వెంకట సుబ్బారాయుడు జమీందార్ గారి కోట భవనాలు పరిరక్షిస్తూ, భూములు రైతులకు కౌలుకిస్తూ అజమాయిషీ చేస్తున్నాడు. సీతారాంపురం జమీ వారసులు సంవత్సరానికి ఒకసారి సంక్రాంతి పండుగకి వచ్చి మూడురోజులు గడిపి పోతారు. వెంకట సుబ్బారాయుడి వారసులు, వారు వచ్చినపుడు కౌలు తాలుకు లెక్కలు చెప్పి డబ్బు అందచేస్తాడు. వారికి ఈ డబ్బు ఒక లెక్కలోనిది కాదు. పప్పుల బెల్లాల కింద లెక్క.

జమీందారు కుటుంబ వారసులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి చాలామంది అమెరికా, లండన్ వంటి విదేశాలలో స్థిరపడ్డారు. అయినా కొందరైనా సంక్రాంతికి ఇండియా వస్తారు. మద్రాసు విమానంలో వచ్చి అక్కడి నుంచి కార్లలో గ్రామానికి చేరుకుంటారు.

ఈసారి కృష్ణారావు తన వియ్యంకుడు విలియమ్స్ కుటుంబంతో సీతారాంపురం వచ్చాడు. కృష్ణారావు అమెరికాలో క్రిష్ బొమ్మదేవరగా పాపులర్. ఆయన కూతురు ప్రీతి, విలియమ్స్ కొడుకు రెనాల్డ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇండియా చూడాలని విలియమ్స్ వియ్యంకుడు క్రిష్‌తో అనగానే ప్రయాణం ఖరారు చేశాడు.

సీతారాంపురం కోటకి తీసుకొచ్చి తమ పూర్వీకుల వైభవాన్ని వియ్యంకుడి కుటుంబానికి





**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతికి ఎంపికైనది**

# మహాలక్ష్మి

## సి.హెచ్. శివరామప్రసాద్

చూపించాడు. అప్పటి తివాచీలు పరిచిన గదులు, షాండిలియర్లు, పెయింటింగ్స్, గుర్రాలశాలలు, పొలాలు, తోపులు అన్నీ చూపించాడు. విలియమ్స్ కుటుంబం సంతోషంగా తిరిగింది.

విలియమ్స్‌తో పాటు తమ వంట చెయ్యడానికి చెఫ్‌ని వెంట తెచ్చుకున్నారు. ఆయనకి ఇండియా ఫుడ్ పడదు. చెఫ్ చెప్పిన పదార్థాలను క్రిష్ తెప్పించే వాడు. చెఫ్ ప్రత్యేకంగా విలియమ్స్ కుటుంబానికి పదార్థాలు వండి వడ్డించేవాడు. ఎప్పుడన్నా ఇడ్లీ అల్లం పచ్చడి, దోసె కొబ్బరి చట్నీ టేస్ట్ చేసి ఎగిరి పడేవాడు. మంట... మంట... అని చాక్లెట్లు చప్పరించి ఉపశమనం పొందేవాడు.

చెన్నైలో ఏ ప్రాబ్లమ్ లేదు. అన్నీ దొరికేవి. ఇప్పుడు సీతారాంపురంలో ప్రాబ్లమ్ వచ్చింది. విలియమ్స్ ఇష్టంగా ఆరగించేవి బీఫ్. రేపటికి బీఫ్ తెప్పించమని చెఫ్ క్రిష్‌కి ఆర్డర్ వేశాడు.

క్రిష్ తమ సీతారాంపురం ఏజెంట్ రాఘవకి చెప్పాడు. అతను అప్పటి దివాను వారసుడు.

“మనకి ఒక ఆవు కావాలి. ముసలీముతక కాదు. హెల్తీగా యంగ్‌గా ఉండాలి”.

“ఒకే సార్...! అన్నాడు రాఘవ.

రాఘవ ఒకే అన్నాడు కానీ ఆవు దొరకడం అంత ఈజీగా లేదు.

ఊళ్లో అందరూ గేదెలను పెంచుతున్నారు. పాలు తీసి మిల్క్ సొసైటీకి అమ్ముతున్నారు. ఎద్దులు కూడా కనిపించడం లేదు. పొలాలు ట్రాక్టర్లతో దున్నుతున్నారు. రాఘవ పంపిన మనుషులు ఊరంతా తిరిగి చేతులెత్తేశారు.

రాఘవ తాత ముత్తాతలు జమీందారు దగ్గర దివాన్లుగా సేవలు అందించారు. దాంతో పాటు వారి దాబు, దర్పం, అధికారమదం, పెత్తందారీ మనస్తత్వం వంట బట్టించుకున్నారు. అదంతా మెయింటైన్ చేస్తూ ఊళ్లో తిరుగు లేకుండా చక్రం తిప్పుతున్నారు. రాఘవ ఇప్పుడు సీతారాం పురం సర్పంచ్.

“అదేంట్రా! ఊళ్లో ఒక్క ఆవు కూడా లేదా? సరిగ్గా తిరిగారా? లేదా?” అని మండిపడ్డాడు.

“బోడి ఒక ఆవుని సప్లయ్ చెయ్యలేకపోతే రాజా వారి దగ్గర పరువు పోతుంది. ఆయన వియ్యంకుడు బీఫ్ లేకపోతే ముద్ద మింగడు. నాకు అదేం తెలీదు. మన ఊళ్లో లేకపోతే చుట్టుప్రక్కల ఊళ్లకెళ్లండి. సాయంత్రం లోపల ఆవు కోటలో ఉండాలి. ఎంత డబ్బయినా ఫర్వాలేదు. వాళ్ల మొఖాన కొట్టి ఆవుని తోలుకు రండి.” అని రాఘవ తన మనుషులకు హుకుం జారీ చేశాడు.

వాళ్లకి చుట్టుప్రక్కల ఊళ్లలో తిరగాల్సిన శ్రమ లేకుండా సీతారాంపురంలోనే నవనవలాడుతూ ఆరోగ్యంతో మెరిసిపోతున్న ఆవు దొరికింది. అగ్రహారం వీధిలో నందం గారింట్లో ఆవు కనిపించింది.

ఆవు కావాలని చెప్పగానే సీతామహాలక్ష్మి ససేమిరా వీలుకాదు అంది. ‘మహాలక్ష్మి అని పేరు పెట్టి అపురూపంగా పెంచుకుంటున్నాం. ఇవ్వడానికి లేదు’ అన్నది. నందంగారు లేరని, లోపలకు రావొద్దని అన్నారు.

రాఘవ మనుషులు ఆమెతో ఘర్షణ పడ్డారు. ఆమె ఎంత మొత్తుకున్నా చెవికెక్కించుకోలేదు. మూర్ఖంగా వాదించారు.

‘మీరు ఇంకో ఆవు కొనుక్కోండి. ఇదుగో ఈ డబ్బు తీసుకోండి. సర్పంచ్ గారివ్వమన్నారు’ అంటూ పదివేలున్న కరెన్సీ కట్ట అక్కడ పడేసి, ఆవును బలవంతంగా తోలుకుపోయారు....

అదీ జరిగింది. అందుకే సీతాలక్ష్మి ఏడుస్తోంది. అంతా విని నందంగారు దీర్ఘంగా నిట్టూర్చారు. తన బలహీనుడు. ఊళ్లో పెత్తందార్లను ఎదిరించి ఏం చేయగలడు?

“ఏమండీ! మీరెళ్లి ఆ సర్పంచిని నిలదీయండి. ఇంట్లో మగాళ్లు లేనప్పుడు మనుషుల్ని పంపించి ఆవుని దౌర్జన్యంగా తోలుకెళ్లడం ఏం న్యాయం? మరీ ఇంత దుర్మార్గమా?” అన్నది సీతాలక్ష్మి.

రాజాగారి అమ్మాయి అమెరికాలో తెల్లోడిని పెళ్లి చేసుకుందనీ, ఆ తెల్లోళ్లకు కటుంబం కోటకి వచ్చిందనీ ఊళ్లో జనం చెప్పుకుంటున్నారు. అది నందంగారి వరకు వచ్చింది. ఆవును ఎందుకు తోలుకెళ్లారో ఆయనకి అర్థమైంది.

“సర్పంచిని కాదులే. ఆ రాజా గారినే అడుగుతాను. అంతా ఆ భగవంతుడి ఇచ్ఛ. నువ్వేం బాధ పడకు సీతా. జరిగేదాన్ని మనం ఆపలేం” అన్నాడు.

⁕ ⁕ ⁕

సీతారాంపురం కోటలో సందడిగా ఉంది. సంవత్సరం పొడుగునా గేటు మూసే ఉంటుంది. సంక్రాంతికి రాజాగారి కటుంబం ఫలానా రోజున వస్తున్నదని తెలిసిన తర్వాత సర్పంచ్ రాఘవ బిల్డింగ్ ఊడ్పించి, కడిగించి, గదులలో ఏసీలు సర్వీసింగ్ చేయించి, డ్రైక్లీనింగ్ చేయించిన బెడ్‌షీట్లు, కర్టెన్లు వేయించి సిద్ధం చేస్తాడు. కొన్ని రోజులు రాజాగారి కుటుంబ సభ్యులతో కోట కళకళలాడుతుంది. వాళ్లు వెళ్లిన తర్వాత మళ్లీ బిల్డింగ్‌కి తాళం పడుతుంది. గేటు మూసుకుంటుంది.



ఆరోజు సాయంకాలం నుంచే కోటలో సందడి మొదలైంది. కోట సింహ ద్వారానికి లోపల బిల్డింగ్‌కి మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో షామియానాలు వేశారు. ఆహుతులు కూర్చోవడానికి కుర్చీలు వేయించారు. ఒక మూల స్టేజి తయారైంది. టేకు బల్లలతో, ఊళ్లో పెద్దమనుషులతో పాటుగా ఆ నియోజకవర్గం అధికార పార్టీ ఎమ్మెల్యే బుజ్జిబాబుని కూడా ప్రత్యేకంగా ఆహ్వానించాడు సర్పంచ్ రాఘవ. నిజానికి రాజా కృష్ణారావుకి ఆ ఎమ్మెల్యేతో పరిచయం లేదు. కాని రాఘవ తన పలుకుబడి పెంచుకోవడానికి రాజాగారి పేరు చెప్పి ఆహ్వానించాడు. ఎమ్మెల్యేగారు మూడు కార్లలో కుటుంబం సహా అట్టహాసంగా వచ్చారు. రాజా కృష్ణారావు, తన వియ్యంకుడు విలియమ్స్, భార్య, కూతురు, అల్లుడితో సహా ఎదురేగి ఆహ్వానించాడు.

ఇంతకీ విశేషమేమిటంటే... తన అమెరికా వియ్యంకుడి కుటుంబానికి వినోదం కలిగించడం కోసం సురభివారి 'మాయాబజార్' నాటకం ఏర్పాటు చేశాడు రాజా కృష్ణారావు. వారికి భాష అర్థం కాకపోయినా, తళతళ మెరిసే దుస్తులు, ఆభరణాలు, కిరీటాలు, కత్తులు, గదల అట్టహాసంతో నటించే వారి హావభావాలు చూసి ఆనందిస్తారని ఆ నాటకం ఏర్పాటుచేశారు.

ఇంకా నాటకం మొదలుకాలేదు. ముందు వరసలో ప్రత్యేకంగా వేయించిన సోఫాలలో రాజాగారి కుటుంబం, ఏమ్మెల్యే గారి కుటుంబం కూర్చుని ఉన్నారు.

యూనిఫాంలో ఉన్న కాటరింగ్ కుర్రాళ్లు అందరికీ ప్లాస్టిక్ ప్లేట్లలో స్వీట్స్, కారాలు అందజేస్తున్నారు.

ఆ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. మైకులలో ఘంటసాల. సుశీల పాటలు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి.

అక్కడ ఏర్పాట్లన్నీ సర్పంచ్ రాఘవ పర్యవేక్షిస్తున్నాడు. నందంగారు రావడం గమనించి ఎదురు వెళ్లాడు.

"నందంగారూ...! రండి... రండి..." అంటూ ఆహ్వానించాడు.

"రాజా కృష్ణారావు గారు పరిచయమే గదా...!" అని రాఘవ అడిగాడు.

"లేదు... వీరి నాన్నగారు రాజగోపాలరావు గారు బాగా తెలుసు. వీరిని చూసే ఉంటాను..." అన్నాడు నందంగారు.

నందం గారిని ముందు వరసలో కూర్చున్న రాజాక్రిష్, ఎమ్మెల్యే బుజ్జిబాబు దగ్గరికి తీసుకెళ్లి పరిచయం చేశాడు రాఘవ.

"నందం గారు తెలియకపోవడం ఏమిటి? గత సంవత్సరం వచ్చినప్పుడు మా అమ్మగారు ఇక్కడే కదా చనిపోయారు. అప్పుడు మాతో కర్మలు చేయించింది వీరే..." అన్నాడు రాజా క్రిష్ గుర్తుపట్టి.

నమస్కారం చేసి చేతులు కలిపి "రండి... రండి... కూర్చోండి..." అంటూ ఒక సోఫాలో చోటు చూపించాడు.

"అయ్యా! రాజా వారూ! నేను నాటకం చూడ్డానికి రాలేదు. తమరితో ఒక విషయం మనవి చేసుకుందామని వచ్చాను" అన్నాడు నందం గారు.

సర్పంచ్ రాఘవ అయోమయంగా చూస్తున్నాడు. రాజాగారితో ఏ విషయాన్నయినా తన ద్వారా వెళ్లేటట్టుగా జాగ్రత్త పడ్డాడు. నేరుగా ఎవరూ వెళ్లరు. మరి ఈ నందం గారు ఏమి చెప్పబోతున్నారు? ఒకవేళ ఆయన తల్లిగారి సంవత్సరీకం వగైరా గురించా?

"చెప్పండి నందం గారూ...?" అని అడిగాడు రాజా క్రిష్.

"అయ్యా! గత సంవత్సరం అమ్మగారి కర్మల సందర్భంగా నాకు ఒక ఆవుని దానం చేశారు తమరు".

"ఔను. గోదానం చేశాం. గుర్తుంది."

"ఈరోజు తమ మనుషులు వచ్చి తమరికి ఆవు అర్జెంటుగా కావాల్సి వచ్చిందని తోలుకెళ్లారు. అందుకు పదివేల రూపాయలు ఇచ్చారట. అప్పుడు నేను ఇంట్లో లేను. నా భార్య తెలివి తక్కువది. ఆ డబ్బు తీసుకుంది. మీరు గోదానం చేసిన ఆవుని తిరిగి ఇవ్వడానికి అభ్యంతరం ఏముంది? డబ్బు తీసుకోవడం తప్పు కదా! మన్నించాలి తమరు..." అంటూ నందం గారు పదివేల రూపాయల కరెన్సీ కట్ట రాజావారి చేతిలో ఉంచాడు.

రాజా క్రిష్ నెత్తిన ఎవరో సుత్తితో బాదినట్టు ఫీలయ్యాడు. మెదడు మొద్దు బారినట్లయింది. నందం గారు చెప్పింది అర్థమయినట్టు, కానట్టూ ఉంది.

ఎమ్మెల్యే బుజ్జిబాబు అయోమయంగా చూస్తున్నాడు వారిద్దర్నీ. రాఘవ ముఖంలో నల్లమబ్బులు కమ్ముకున్నాయి.

"రాఘవా...! వాటీజ్ దిస్...?" ఎర్రబడిన ముఖంతో తీవ్రంగా అడిగాడు క్రిష్.

రాఘవ నోట్లో తడి ఆరిపోయింది. గొంతులో నుంచి మాటలు పెగలడం లేదు.

"సారీ... నందం గారూ..." అని క్రిష్ ఏదో అనబోతుంది నందం గారు అడ్డుపడి చెప్పాడు.

"అయ్యా! ఆవు ఇటీవల కోడె దూడెను పెట్టింది. మీవాళ్లు ఆవుని తోలుకెళ్లారు గాని దూడను వదిలి వెళ్లారు. అది తల్లికోసం అంబా అంబా అని ఏడుస్తోంది. తల్లీబిడ్డను వేరు చేయడం ధర్మం కాదు. అందుకని దూడను తోలుకుని వచ్చాను. గేటు పక్కన గుంజకు కట్టివేశాను. సెలవు."

నందం గారు చకచక నడుచుకుంటూ వెళ్లిపోయాడు. అక్కడ్నుంచి రామాలయానికి వెళ్లాడు. ఆయన్ని చూసి శిష్యుడు అడిగాడు.


"ఈ పూట రానన్నారుగా? వచ్చారేం?"

"వెళ్లిన పని పూర్తయింది. అందుకే వచ్చాను. రాముడిని చూడకుండా ఒక పూట గూడా వుండలేను నేను...." అంటూ చిరునవ్వు నవ్వాడు.

గుడిలో కార్యక్రమాలు పూర్తయిన తర్వాత ఇంటికి వెళ్లాడు. సీతాలక్ష్మి ఎదురొచ్చింది భర్తకు. ఆమె ముఖం పౌర్ణమినాటి చందమామలా వెలుగుతోంది.

"ఏమండీ! మహాలక్ష్మి తిరిగి ఇంటికి వచ్చేసింది. దూడ కూడా...!" అన్నది ఆనందంతో పరవశురాలవుతూ.

నందంగారి పెదవుల మీద చిరు దరహాసం మెరిసింది. ★





# విశ్వ క్రీడా సమరం!

విశ్వవ్యాప్తంగా ఎన్ని రకాల క్రీడలున్నా.. ఫుట్‌బాల్ తర్వాతే ఏదైనా. 204 దేశాలలోని ఆబాల గోపాలం ఆడుకొనే అతిపెద్ద క్రీడ ఫుట్‌బాల్. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, యూరో కప్ ఫుట్‌బాల్ పోటీలు, ప్రపంచ క్రికెట్ పోటీలు సైతం.. నాలుగేళ్లకోసారి జరిగే ఫిఫా ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీల ముందు దిగదుడుపే.

30 లక్షల జనాభా మాత్రమే కలిగిన, ప్రపంచంలోనే అతి చిన్న దేశాలలో ఒకటైన ఖతర్ రాజధాని దోహా వేదికగా ప్రస్తుత ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల నిర్వహణ కోసం ఖతర్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. 32 జట్లు తలపడే గ్రూపు లీగ్ పోటీల కోసం మొత్తం 7 అత్యాధునిక ఫుట్‌బాల్ స్టేడియాలను వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఖర్చుతో నిర్మించి సిద్ధం చేసింది. ఆరు వారాల పాటు సాగే ఈ టోర్నీ ఫుట్‌బాల్ వేదికల కోసమే 6.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. మౌలిక సదుపాయాల కోసం మరో 200 బిలియన్ డాలర్లు వ్యయం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి తరలి వచ్చిన 10 లక్షల మంది సాకర్ అభిమానుల విడిది కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఖతర్‌లో ఇంతమందికి తగిన హోటల్ సదుపాయాలు లేకపోవడంతో క్రూయిజ్ నౌకల్లోని ఫ్లోటింగ్ హోటెల్స్‌లో విడిది ఏర్పాటు చేశారు. మొత్తం మూడు క్రూయిజ్ లైనర్లను అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 18న దోహా లూసెయిల్ స్టేడియం వేదికగా జరిగే ఫైనల్లో విజేత ఏ జట్టో తేలిపోనుంది.




క్రీడా కృష్ణ, 84668 64969

సీనియర్ జర్నలిస్ట్


1930లో ప్రారంభమైన ప్రపంచ కప్ ఫుట్‌బాల్ గత కొన్ని దశాబ్దాల కాలంలోనే అంతై ఇంతై అంతింతై అన్నట్లుగా ఎదిగిపోయింది. ఈ పోటీలకు రానురాను విపరీతమైన ఆదరణ రావడంతో కాలానుగుణంగా ఫైనల్ రౌండ్లో తలపడే జట్ల సంఖ్య 18 నుంచి 24కు, 24 నుంచి 32కు చేరుకుంది.

లాటిన్ అమెరికా (బ్రెజిల్, అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో), యూరప్ (జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్, పోర్చుగల్, ఇంగ్లండ్, హంగెరీ, బెల్జియం, క్రొయేషియా) జట్ల ఆధిపత్యమే కొనసాగుతూ వచ్చిన ఈ ప్రపంచ సమరంలో ఆఫ్రికా (మొరాకో, సెనెగల్, నైజీరియా, ఘనా), ఆసియా (జపాన్, కొరియా, ఇరాన్, సౌదీ అరేబియా) ఖండ దేశాల జట్లు సైతం అంచనాలకు మించి రాణిస్తూ తమ ఉనికిని చాటుతూ వస్తున్నాయి.

ఇక ఫుట్‌బాల్‌కు మరో పేరు బ్రెజిల్. తొమ్మిది దశాబ్దాల ప్రపంచ కప్ చరిత్రలో అత్యధికంగా ఐదు సార్లు విశ్వవిజేతగా నిలిచిన ఏకైక జట్టు బ్రెజిల్ మాత్రమే. బ్రెజిల్‌ను అభిమానులు ముద్దుగా సాంబా జట్టు అని పిలుస్తారు. ఆ జట్టు కళాత్మకంగా ఫుట్‌బాల్ ఆడుతూ ఉంటే చూడటానికి రెండు కళ్లు చాలవన్నా అతిశయోక్తి కాదు. ప్రపంచ పోటీలు ఎప్పుడు జరిగినా హాట్ ఫేవరెట్ జట్టు ఏదంటే బ్రెజిల్ అన్న పేరే వినిపిస్తుంది. ఆ తర్వాత అత్యధికంగా నాలుగు సార్లు నెగ్గిన జట్టు జర్మనీ. ఫుట్‌బాల్‌కు పవర్‌ను జోడించి, వ్యూహాలను కలగలిపి జర్మనీతో సహా పలు యూరోపియన్ దేశాల జట్లు ఆడుతూ ఉంటాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్, స్పెయిన్, ఉరుగ్వే, అర్జెంటీనా జట్లకు సైతం ప్రపంచ కప్ ఫుట్‌బాల్ చరిత్రలో ప్రత్యేక స్థానమే ఉంది. ఫుట్‌బాల్ చరిత్రలో బ్రెజిల్ దిగ్గజం పీలే, అర్జెంటీనా ఆణిముత్యం డియాగో మారడోనా నుంచి.. ప్రస్తుత తరానికి చెందిన లయనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో వరకూ ఎందరో గొప్ప ఆటగాళ్లు కనిపిస్తారు. తమ ఆటతీరుతో అభిమానులను కట్టిపడేసే సమ్మోహక శక్తి ఈ దిగ్గజ ఆటగాళ్లకు మాత్రమే సొంతం.

### రూ. 358 కోట్ల నగదు బహుమతి

ప్రపంచ కప్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు 358 కోట్ల రూపాయలు ప్రైజ్ మనీగా ఇస్తారు. ప్రపంచ ఫుట్‌బాల్ విజేత అందుకొనే ప్రైజ్ మనీ ముందు మిగిలిన క్రీడల్లో ఇచ్చే ప్రైజ్ మనీ దిగదుడుపే. ఎంతో ఖ్యాతి గాంచిన టీ-20 క్రికెట్ ప్రపంచ కప్‌లో విజేతకు 14 కోట్లు, ఐపీఎల్ విజేతకు 20 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లిస్తుండటం గమనార్హం.

### మరి మన స్థానమెక్కడ?

ప్రపంచ క్రికెట్లో టాప్ ర్యాంకర్‌గా ఉన్న భారత్ ప్రపంచ నంబర్ వన్ గేమ్ ఫుట్‌బాల్‌లో మాత్రం 106వ ర్యాంకులో కొనసాగుతోంది. ప్రపంచ ఫుట్‌బాల్ అర్హత ఆసియా జోన్ తొలి దశలోనే భారత్ నిష్క్రమిస్తూ వస్తోంది. 30 లక్షల నుంచి 50 లక్షలు కలిగిన ఈక్వెడోర్, క్రొయేషియా లాంటి చిన్న చిన్న దేశాలే ప్రపంచ కప్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధిస్తుంటే, అత్యధిక జనాభా కలిగిన, పెద్ద దేశం భారత్ మాత్రం అట్టడుగు స్థాయిలోనే ఉండిపోతోంది. ఊడల మర్రి లాంటి క్రికెట్ నీడన భారత ఫుట్‌బాల్ ఎదుగూ బొదుగూ లేకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోతోంది. ప్రపంచ కప్ ఫైనల్ రౌండ్‌కు భారత ఫుట్‌బాల్ జట్టు అర్హత సాధించాలంటే ఎన్ని దశాబ్దాలు వేచి చూడాలో మరి! ★

# నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల యువ సమ్మేళనాలు

**యువతకు చరిత్ర పట్ల అవగాహన కలిగిస్తూ, భవిష్యత్తులో వారికి తమ కర్తవ్యం గురించి తెలియజేస్తూ నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ అంతటా డివిజన్ వారీగా యువసమ్మేళనాలు జరుగుతున్నాయి. వాటిలో కొన్ని విశేషాలు.**




**కరినగర్:** నవంబర్ 23న కరినగర్‌లోని RBVRR రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన యువ సమ్మేళనంలో వేదికపై ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి నిరంజనాచారి, జిల్లా గౌరవాధ్యక్షులు కె. భగ్యరెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్షులు మధుసూదన్ రావు, జిల్లా సంఘచాలక్ డా॥ రమణాచారి, నగర ఉత్సవ సమితి అధ్యక్షులు వేణుగోపాలరావు, ప్రాంత కార్యకారిణి సదస్యులు డా॥ అన్నదానం సుబ్రహ్మణ్యం, సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, జిల్లా ఉత్సవ సమితి సభ్యులతో పాటు మొత్తం 6140 మంది యువత పాల్గొన్నారు. సమ్మేళనానికి ముందు 25 డిగ్రీ కళాశాలలో వక్తృత్వం, వాస్యరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈ కార్యక్రమంలో బహుమతులు అందజేశారు.





బహుమతి ప్రదానం



**నిర్మల్:** నవంబర్21న నిర్మల్‌లోని దివ్య గార్డెన్స్‌లో జరిగిన యువ సమ్మేళనంలో వేదికపై ప్రాంత కార్యకారిణి సదస్యులు డా॥ అన్నదానం సుబ్రహ్మణ్యం, ప్రాంత గ్రామ వికాస్ ప్రముఖ్ జిన్నా సత్యనారాయణరెడ్డి, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు 15 కళాశాలలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన ఈ కార్యక్రమంలో వారికి బహుమతులు అందజేశారు. ఈ సమ్మేళనంలో 3310 మంది యువత హాజరయ్యారు.






**హైదరాబాద్ :** గుడి మల్కాపూర్‌లోని గ్రీన్‌హౌస్ ఫంక్షన్‌హాల్‌లో నవంబర్ 20న జరిగిన గోల్కొండ భాగ్ యువ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న శ్రీ సరస్వతీ విద్యాపీఠం క్షేత్ర సంఘటనా మంత్రి లింగం సుధాకర్ రెడ్డి. వేదికపై ఆసీనులైన జిల్లా ఉత్సవ సమితి సభ్యులు. ఈ కార్యక్రమంలో మొత్తం 1142 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న సునీల్ అంబేకర్

**భువనగిరి:** నవంబర్ 24న భువనగిరిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన యువ సమ్మేళనం వేదికపై జిల్లా ఉత్సవ సమితి అధ్యక్షులు బొట్టు కృష్ణయ్య, సమితి ప్రధాన కార్యదర్శి రచ్చా సురేష్, జిల్లా సంఘచాలక్ బాదం ప్రకాష్, అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్, సామాజిక సమరసత ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్. ఈ కార్యక్రమంలో మొత్తం 2100 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.



**చార్మినార్:** నవంబర్ 27న చార్మినార్ భాగ్, కాటేదాన్‌లోని టిఎల్ఎమ్ గార్డెన్స్‌లో జరిగిన యువ సమ్మేళనంలో జ్యోతి ప్రజల్వన చేస్తున్న ముఖ్య అతిథి రఘురామ్ అనంతోజు, ప్రముఖ జర్నలిస్ట్ రాకా సుధాకర్, జిల్లా సంఘచాలక్ పృథ్విరాజ్, రామ సుబ్రహ్మణ్యం. ఈ కార్యక్రమంలో 992 మంది యువత పాల్గొన్నారు





**దిల్‌సుఖ్‌నగర్ :** నవంబర్ 27న నాగోల్ శుభం కన్వెన్షల్ హాల్‌లో జరిగిన దిల్‌సుఖ్‌నగర్ భాగ్ యువ సమ్మేళనం వేదికపై ముఖ్య అతిథి స్ఫూర్తి ఇన్‌స్టిట్యూషన్ ఛైర్మన్ చలమారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ జయదేవ్ తదితరులు. ఈ కార్యక్రమంలో 1300 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.






**నాగర్‌కర్నూల్:** నవంబర్ 27న సాయి గార్డెన్స్‌లో జరిగిన యువ సమ్మేళనంలో వేదికపై జిల్లా ఉత్సవ సమితి అధ్యక్షులు రామచంద్రారెడ్డి, కార్యదర్శి తలసాని లక్ష్మారెడ్డి, విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంఘచాలక్ కర్రెం నారాయణ, నగర సంఘచాలక్ కొండరికచారి, ప్రధాన వక్త అప్పాల ప్రసాద్. సమ్మేళనం సందర్భంగా 14 కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేసారు. నైజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని, అసువులు బాసిన సమరయోధుల కుటుంబ వారసులు 17 మందిని సన్మానించారు. కార్యక్రమంలో 2467 మంది యువత పాల్గొన్నారు.





**బర్కత్‌పుర:** నవంబర్ 26న కెఎమ్ఐటిలో జరిగిన బర్కత్‌పుర భాగ్ యువ సమ్మేళనంలో వేదికపై భాగ్ సంఘచాలక్ డా॥ ప్రవీణ్, ప్రాంత కార్యవాహ కాచం రమేష్, జిల్లా సమితి అధ్యక్షులు సురేందర్‌రావు, కార్యదర్శి రాజేశ్వర్‌రావు ఈ కార్యక్రమంలో మొత్తం 1150 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

## బాల జాగృతి

### తెలుసుకుందాం

# పాపనాశి దేవాలయాలు-ఆలంపూర్



తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ సమీపంలో గల పాపనాశంలో ఉన్న ఇరవైమూడు ఆలయాల సమూహమిది. 9, 11వ శతాబ్దాల మధ్యకాలంలో రాష్ట్రకూటులు, అనంతరం చాళుక్యులు వీటిని నిర్మించినట్లుగా తెలుస్తోంది. ఇక్కడికి సమీపంలో తుంగభద్ర నది, కృష్ణా నది కలిసే ప్రదేశం ఉంది. బ్రహ్మేశ్వర స్థాన తీర్థం (క్షేత్రం)గా ప్రసిద్ధి పొందిన ఈ ప్రాంతం ఢిల్లీ సుల్తానుల కాలంలో కొంత ధ్వంసమైంది.

### కథ | రంగమ్మ తెలివి!



'కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఈ వ్యాపారం చేయడం కష్టమే' అంటూ కూలబడి పోయాడు కూరగాయలు అమ్మే సూరయ్య.

'నువ్వు అలా అంటే ఎలా? అలవాటు పడ్డ వ్యాపారం తెలివిగా మసలుకొని అమ్మకాలు కొనసాగించడమే మంచిది.

కొత్త వ్యాపారమైతే అలవాటు పడేవరకు దినదిన గండమే' అంటూ భర్తను ఉత్సాహపరచసాగింది భార్య రంగమ్మ.

'నువ్వు అలా అంటున్నావు గాని గంట నుండి 'కిలో నలభై', 'కిలో నలభై' అంటున్నా కొనేవారి సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది' ఉసూరుమంటూ చెప్పాడు సూరయ్య.

'కొద్దిసేపు నువ్వు విశ్రాంతి తీసుకో, నేను అమ్మి పెడతా' అంటూ భరోసా ఇచ్చింది రంగమ్మ.

సూరయ్య నిద్రకు ఉపక్రమించాడు.

గంటపోయాక లేచి చూశాడు. కూరగాయలన్నీ అమ్ముడైపోయాయి.

'నష్టానికి అమ్మేశావా?' అనుమానంగా

### పద్యం

**ఏఱకుమీ కసుగాయలు**
**దూఱకుమీ బంధుజనుల దోషము సుమ్మీ**
**పాఱకుమీ రణమందున**
**మీఱకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ!**

**భావం :** ఓ సుమతీ! నేలమీద పచ్చికాయలను ఏరి తినకుము, చుట్టములను తిట్టవద్దు, యుద్ధము నందు వెనుతిరిగి పోరాదు, పెద్దల ఆజ్ఞను అతిక్రమించరాదు. ఇవన్నియు సమయము చూచి విపత్తులను కల్గించునని భావం.

### శ్లోకం

స్త్రీవిత్త మధమాధమం

**'ఉత్తమం స్వార్జితం విత్తం మధ్యమం పితురార్జితం**
**అధమం భ్రాతృవిత్తం చ స్త్రీవిత్త మధమాధమం**

**భావం :** జీవనయాత్రకు స్వార్జితం ఉత్తమమైనది. తండ్రి సంపాదనతో జీవనం మధ్యపక్షం కాగా సోదరుల సంపాదనపై బతకడం అధమస్థితి, స్త్రీల ధనంతో జీవించడం అధమాధమైన స్థితి. అంటే సాధ్యమైనంత వరకు పరాన్నభుక్కులు కాకూడదన్నది సూక్తి.

### జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| అధ్యయనం | శాస్త్రం |
|---|---|
| ధ్వని | పెడాలజీ |
| పక్షులు | ఎపీకల్చర్ |
| తేనెటీగలు | పామాలజీ |
| నేల | అకౌటిక్స్ |
| పళ్లు | ఆర్నిథాలజీ |

సమాధానాలు : ధ్వని–అకౌటిక్స్; పక్షులు–ఆర్నిథాలజీ; తేనెటీగలు–ఎపీకల్చర్; నేల–పెడాలజీ; పళ్లు–పామాలజీ.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### మాదిరాజు లక్ష్మీ నరసింహారావు



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, సాహితీవేత్త. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురంలో నవంబర్ 7, 1928న జన్మించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాదారు. గాంధీజీ సిద్ధాంతాలకు ప్రభావితమై అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. కోఠిలోని శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషానిలయంలో 50 ఏళ్ల పాటు కార్యదర్శిగా సేవలందించారు. గాంధీ పీస్ ఫౌండేషన్ కార్యదర్శిగానూ పనిచేశారు. 2016, ఫిబ్రవరి 12న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
2. ఇటీవల 17వ జీ 20 సదస్సు ఎక్కడ జరిగింది?
3. భారత మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?

సమాధానాలు : 1. డిసెంబర్ 10; 2. బాలి (ఇండోనేషియా); 3. బీహార్.



అడిగాడు. 'లేదు, నువ్వు చెప్పిన ధరకే అమ్మాను.

నా తెలివికి పదునుపెట్టి 'పావుకేజీ పది', 'పావుకేజీ పది' అని అరిచాను.

నలభై రూపాయల కంటే పది రూపాయలు తక్కువగా అనిపించడంతో బరువు విషయం మరిచి కావల్సినవి కొన్నారు' అసలు విషయం చెప్పింది రంగమ్మ.

భార్య తెలివికి మెచ్చుకుని ఆ రోజు నుండి ఆమె చెప్పిన మెలకువలతో వ్యాపారం చేస్తూ లాభాలు గడించసాగాడు సూరయ్య. ★

## మెదడుకు మేత



ఎంత దానం చేసినా తరగనిది, అంతకంతకూ పెరిగేది?

జవాబు : జ్ఞానం

## మంచిమాట

నీ మనసును ఆహ్లాదకరమైన ఆలోచనలతో నింపు.. అవి నీ జీవితాన్ని సుఖమయం చేస్తాయి..



# వారఫలాలు

## 05-11 డిసెంబర్ 2022




సింహంభట్ల సుబ్బారావు
6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

చేపట్టిన పనులు విజయవంతం. దేవాలయ దర్శనాలు. రాబడి పెరిగి అప్పులు తీరతాయి. విద్యార్థులు ప్రతిభను నిరూపించుకుంటారు. ఇంటిలో శుభకార్యాలు నిర్వహిస్తారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలకు అవకాశాలు. 7,8 తేదీలలో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. ఖర్చులు అధికం. ఆదిత్య హృదయం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆదాయం ఆశించినంతగా సమకూరుతుంది. దీర్ఘకాలికంగా వేధిస్తున్న కొన్ని సమస్యల నుంచి గట్టెక్కుతారు. చర, స్థిరాస్తుల వృద్ధి. విద్యార్థుల నైపుణ్యానికి తగిన గుర్తింపు లభిస్తుంది. గృహం, వాహనం కొంటారు. వ్యాపారులు చిక్కులు అధిగమిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు. కళాకారులు, క్రీడాకారులకు అవార్డులు. 5,6 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. అంగారక స్తోత్రం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొత్త పనులు చేపడతారు. భూ, గృహ యోగాలు కలిగే సూచనలు. మీ నిర్ణయాలను అందరూ హర్షిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు మరింత అనుకూల స్థితి. ఉద్యోగులకు ఉన్నత శ్రేణి నుంచి ప్రశంసలు. కళాకారులకు అవార్డులు. పరిశోధకులు, క్రీడాకారులు సత్తా చాటుతారు. 7,8 తేదీల్లో దూరప్రయాణాలు. వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయం అంతంత మాత్రమే. ముఖ్య కార్యక్రమాలు మొదట్లో మందగించినా ఎట్టకేలకు పూర్తి చేస్తారు. విద్యార్థుల కృషి అంతగా ఫలించదు. దేవాలయాలు సందర్శిస్తారు. విలువైన సామగ్రి కొంటారు. వ్యాపారులు ఒడిదొడుకుల నుంచి బయటపడతారు. ఉద్యోగులకు శుభవార్తలు. రచయితలు, మేధావులు సత్తా నిరూపించుకుంటారు. అనుకోని ఖర్చులు. రాఘవేంద్ర స్తోత్రం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కష్టానికి తగిన ఫలితం. ఆర్థిక ఇబ్బందులు తీరతాయి. వాహనాలు, ఆభరణాలు కొంటారు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారులకు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు అరుదైన అవకాశాలు దక్కుతాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు అంచనాలు నిజమవుతాయి. క్రీడాకారులు నైపుణ్యాన్ని చాటుకుంటారు. 5,6 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. విష్ణు సహస్రనామ పారాయణం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆశించిన రాబడి సమకూరుతుంది. వివాహ, ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. వాహనయోగం. ఇంటి నిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులకు పెట్టుబడులకు తగినంతగా లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులు రావచ్చు. రాజకీయ వర్గాలకు కొత్త పదవులు. 8, 9 తేదీల్లో ఆరోగ్య, కుటుంబ సమస్యలు. మానసిక అశాంతి. కనకదుర్గాదేవి స్తోత్రం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

నిరుద్యోగుల కృషి ఫలించే సమయం. అదనపు రాబడి దక్కి ఉత్సాహంగా గడుపుతారు. ఇంటిలో శుభకార్యాలు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు నూతన పెట్టుబడులు సమకూరుతాయి. ఉద్యోగుల హోదాలు పెరుగుతాయి. కళాకారులకు పురస్కారాలు, సన్మానాలు. సాంకేతిక నిపుణులు, రచయితలు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 9, 10 తేదీల్లో ఖర్చులు. ఆస్తి వివాదాలు. గణేశాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

యత్నకార్యసిద్ధి. కుటుంబ సభ్యులతో వివాదాలు సద్దుమణిగి సఖ్యత ఏర్పడుతుంది. ఆదాయం సంతృప్తినిస్తుంది. దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగయోగం. వాహన యోగం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయ వర్గాలకు పదవీ యోగం. క్రీడాకారులు, సాంకేతిక నిపుణులకు విశేష గుర్తింపు. లక్ష్మీస్తుతి మంచిది.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

శుభవార్తా శ్రవణం. మీ ఆశయాలు, లక్ష్యాలు సాధిస్తారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహనాలు, భూములు కొనుగోలులో ప్రతిబంధకాలు తొలగుతాయి. వ్యాపారులు లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రాగల అవకాశం. రాజకీయ వర్గాలకు నూతనోత్సాహం. 5, 6 తేదీలలో వృథా ఖర్చులు. నవగ్రహ స్తోత్రం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ముఖ్య కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. ఇళ్లు, వాహనాలు సమకూర్చుకుంటారు. విద్యార్థులు ప్రతిభను చాటుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపారులకు క్రమేపీ అనుకూల పరిస్థితులు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామిక వర్గాలకు విదేశీయానం. 7,8 తేదీలలో అనారోగ్యం. ఆకస్మిక ప్రయాణాలు. దేవీఖడ్గమాల పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. అనుకున్న పనులు శ్రమానంతరం పూర్తిచేస్తారు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. తొందరపాటు వద్దు. వ్యాపారులకు లాభ నష్టాలు సమానం. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు తప్పవు. దేవాలయాల సందర్శనం. పారిశ్రామికవేత్తల విదేశీ పర్యటనలు వాయిదా పడవచ్చు. 6,7 తేదీల్లో శుభవార్తలు. వాహన యోగం. హనుమాన్ చాలీసా పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొత్త ఉద్యోగ యత్నాలు అనుకూలం. మీ ఆశయాలు నెరవేరే సమయం. కుటుంబంలో శుభకార్యాలపై సంప్రదింపులు జరుపుతారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరుతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో చికాకులు తొలగుతాయి. కళాకారులకు సన్మానాలు. పరిశోధకులు, క్రీడాకారులకు అరుదైన పురస్కారాలు దక్కవచ్చు. 9,10 తేదీలలో వివాదాలు. శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించండి. ★

# పదరసం-393

## ఆధారాలు

**అడ్డం**

1. ఏది జరిగినా ఇదే అంటుంది భగవద్గీత (7)
6. పార్వతి (2)
7. త్రాసు (3)
9. అలలు (4)
11. మన్మధుడే దేహం లేదు (4)
12. ఒకనాటి తెలుగు సినిమా అభినేత్రి (3)
14. దుఃఖం లేని ఇంటి నుండి గుప్పెడు... తెమ్మన్నాడు బుద్ధుడు (3)
19. మగవాడు (4)
20. విశ్వసించు (2)
21. ముట్నూరు కృష్ణారావు గారి పత్రిక (5)
22. నది (3)
24. విల్లు (3)
25. కొండ (2)
27. ఆవు పేడ (3)
29. అటుగా కన్యా రాశిలో ఓ నక్షత్రం (2)
30. శరీరము (3)

**నిలువు :**

1. ఆకాశం (3)
2. రజకుడు (3)
3. ఔషధము (2)
4. జెండా (3)
5. అంగారకుడు (3)
6. తేడా (3)
8. విరాగులు ముందే మాయం చేసిన దినుసులు (3)
10. పాలగుమ్మి పద్మరాజు ప్రపంచ ప్రసిద్ధి కథ (4)
11. అనసూయ భర్త బ్రహ్మ మానస పుత్రుడు (2)
13. ధనువు (2)
15. జ్ఞానము, తెలివి (3)
16. హ్రదము (3)
17. ధనము విలువ తెలిసికొనుట ఇదే అన్నాడు సినీ కవి ఆరుద్ర (5)
18. ఎండాకాలం, గ్రీష్మము (4)
19. కూతురు (3)
21. దయ (2)
22. ప్రాకృతంలో బావ (3)
23. పిపీలికం (2)
26. తల తిరిగిన రచయిత్రి (2)
27. సాధు జంతువు (2)
28. మర (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక,
3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | 3 | | 4 | ✠ | 5 |
| 6 | | ✠ | | ✠ | | ✠ | 7 | 8 | |
| 9 | | 10 | | ✠ | ✠ | 11 | | | |
| | ✠ | | ✠ | 12 | 13 | | ✠ | | ✠ |
| ✠ | 14 | | | ✠ | | ✠ | 15 | ✠ | 16 |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | | |
| 20 | | ✠ | 21 | | | | | ✠ | |
| | ✠ | 22 | | | ✠ | | ✠ | 23 | ✠ |
| 24 | | | ✠ | 25 | 26 | ✠ | 27 | | 28 |
| | ✠ | 29 | | ✠ | 30 | | | ✠ | |

**పదరసం - 393**

పేరు : ..............................................................................

చిరునామా:..............................................................................

..............................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..............................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 డిసెంబర్ 19 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 389 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 న | ర | 2 క | చ | 3 తు | ర్ధ | 4 శి | ✠ | 5 వే |
| 6 నా | వ | ✠ | వా | ✠ | ఊ | ✠ | 7 ఖం | 8 డ | ము |
| 9 పి | త | 10 లా | టం | ✠ | ✠ | 11 వ | డి | గ | ల |
| త | ✠ | భ | ✠ | 12 మ | 13 తా | బు | ✠ | రు | ✠ |
| ✠ | 14 ప్ర | సా | దం | ✠ | ర | ✠ | 15 సం | ✠ | 16 భూ |
| 17 కా | ✠ | టీ | ✠ | 18 సు | ✠ | 19 కం | వా | క్ర | చ |
| 20 క | న్య | ✠ | 21 ప | ర | మ | ప | దం | ✠ | క్రం |
| ర | ✠ | 22 అ | ని | త | ✠ | ము | ✠ | 23 దొం | ✠ |
| 24 వ | స్త్రా | లు | ✠ | 25 ము | 26 ర | ✠ | 27 కా | గ | 28 డా |
| త్తి | ✠ | 29 పు | ష్యు | ✠ | 30 మ | ద్రా | సు | ✠ | గు |

**విజేతలు:** టి.వి.నారాయణ, జి.భారతి, యు.రాఘవేంద్రరావు, బి.ఇందుశేఖర్–హైదరాబాద్, వి.రామలింగాచారి–యాదాద్రి, సి.హెచ్.అన్విత–జగిత్యాల, సి.హెచ్.రుకోధర్–భువనగిరి, ఎన్.రాజ్యలక్ష్మి, కె.సత్యనారాయణ– విశాఖపట్నం, కె.అల్లీరాణి–తిరుపతి, జి.యశోదాప్రీతి–ఒంగోలు, ఆర్.శేషు– తూర్పు గోదావరి, వి.సరస్వతి–కాకినాడ, కె.కాంతామణి–భువనేశ్వర్, వి.భాస్కరయ్య–చెన్నై.

**విజేత: సి.హెచ్.రుకోధర్-భువనగిరి**

అరుణ

# ఓటును ఆయుధంగా మలుచుకున్న ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం



నిన్న మొన్నటి వరకూ మనమంతా 'ఆజాదీ కా అమృతోత్సవ్' కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నాం. అయితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా, వేలాది గిరిజన గ్రామాలలో కనీస వసతులు లేవు. దశాబ్దాలుగా ఈ దేశాన్ని పరిపాలించిన పార్టీలు అడవి బిడ్డల బాగోగుల మీద దృష్టి పెట్టకపోవడమే దీనికి కారణం. దీన్ని ఆసరాగా చేసుకుని తీవ్రవాదులు గిరిజనులను తమ వైపు తిప్పుకుని, జాతి వ్యతిరేక కార్యకలాపాలకూ పాల్పడుతున్నారు. ఇప్పుడిప్పుడే గిరిజనుల్లోనూ చైతన్యం వస్తోంది. ఒకరి కొమ్ము కాకుండా, ఎవరి పంచనా చేరకుండా ప్రజాస్వామ్య పంథాలో పోరాటం చేసి, తమ హక్కులను సాధించేందుకు కృషి చేస్తున్నారు. 'అల్లరి' నరేశ్ నటించిన తాజా చిత్రం 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' సైతం గిరిజనులు హక్కులను, వాటిని కాపాడుకోవడానికి వారు చేసిన పోరాటాన్ని తెలిపే చిత్రమే!

గతేడాది 'నాంది' సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు 'అల్లరి' నరేశ్. ఆ సినిమా ఇప్పుడు హిందీలోనూ రీమేక్ అవుతోంది. 'నాంది' తర్వాత నరేశ్ తన ట్రాక్ మార్చాడు. కామెడీ సినిమాలను కాస్తంత పక్కన పెట్టి, అర్థవంతమైన చిత్రాలు చేయడం మొదలెట్టాడు. అలా ప్రజల ముందుకు వచ్చిందే 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం'. ఈ మూవీతో తమిళ దర్శకుడు ఎ. ఆర్. మోహన్ టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చాడు. జీ స్టూడియోస్‌తో కలిసి రాజేశ్ దండు ఈ సినిమాను నిర్మించాడు.

కథ విషయానికి వస్తే.. శ్రీపాద శ్రీనివాస్ (నరేశ్) తెలుగు టీచర్. ఎన్నికల డ్యూటీలో భాగంగా మారేడుమిల్లిలోని గిరిజన తండాలకు వెళతాడు. పాలకులు తమ కనీస అవసరాలను సైతం తీర్చడం లేదని అలిగిన గూడెం వాసులు, ఎన్నికలను బహిష్కరించాలని అనుకుంటారు. అయితే శ్రీనివాస్ చొరవతో ఓటు వేయడానికి అంగీకరిస్తారు. కానీ ఎన్నికల తర్వాత కూడా వారి సమస్యలు తీరవని గ్రహించిన శ్రీనివాస్... గూడెం వాసులతో కలిసి నాటకం ఆడతాడు. గిరిజనులు తనను, తన తోటి అధికారిని కిడ్నాప్ చేసినట్టు ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తాడు. ఈవీఎంలు వీళ్ల దగ్గరే ఉండి పోవడంతో కౌంటింగ్ ఆగిపోయే పరిస్థితి వస్తుంది. శ్రీనివాస్ బృందాన్ని విడిచిపెట్టాలంటే... తమ గూడెంలో బడి, వైద్యశాల, పట్టణానికి వెళ్లడానికి నదిపై వంతెన వేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తారు. మరి వీరి నాటకం ఫలించిందా? ప్రభుత్వం దిగి వచ్చి వీరి కోరికలు తీర్చిందా? ప్రభుత్వం తరఫున పని చేయాల్సిన శ్రీనివాస్ ఇలా గిరిజనులతో చేతులు కలపడం వల్ల ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది? అనేది మిగతా కథ.

గిరిజనుల సమస్యలను ఏకరువు పెట్టడం, వారిని ఎడ్యుకేట్ చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా చేయడం వరకూ సినిమా బాగానే సాగింది. అలానే కిడ్నాప్ డ్రామా కూడా రక్తి కట్టింది. కానీ ఆ తర్వాత అధికారుల అత్యుత్సాహం, మిలటరీ దిగి గిరిజనులపై దాడి చేయడం, చివరకు కలెక్టర్ సైతం ప్రతి నాయకుడి తరహాలో ప్రవర్తించడం.. ఇవన్నీ కాస్తంత అతిగా అనిపిస్తాయి. రాజకీయ నేతల దుష్ట పన్నాగాలు, దళారీల దోపిడీ వంటి వాటిని పెద్దగా హైలైట్ చేయకుండా, మొత్తం తప్పును కలెక్టర్ల మీదకు దర్శకుడు వేసేశాడు. బహుశా రాజకీయపరమైన ఒత్తిడులు లేదా ఇతరత్రా సమస్యలు వస్తాయేమోనని భయపడి ఉండొచ్చు. దాంతో ఇది గిరిజనులు వర్సెస్ గవర్నమెంట్ ఆఫీసర్స్ అన్నట్టుగా మారిపోయింది. ఈ సినిమాలో తెలుగు భాష గొప్పతనాన్ని తెలిపే మాటలు, తెలుగుదనపు పాటలు చోటు చేసుకోవడం విశేషం. తెలుగు భాషను అభిమానించేవారికి ఇవి బాగా నచ్చుతాయి. అబ్బూరి రవి మాటలతో పాటు ఈ సినిమాలో ఓ పాట రాసి, దాన్ని తానే పాడారు. శ్రీచరణ్ పాకాల నేపథ్య సంగీత ఆకట్టుకునేలా ఉంది. అలానే సినిమాటోగ్రఫీ బాగుంది. కానీ వీఎఫ్ఎక్స్ పెద్దంత గొప్పగా లేదు. ఈ మధ్య కాలంలో అడవిని, అటవి సంపదను కాపాడేందుకు దైవాంశ కలిగిన జీవాలు పాటు పడుతున్నాయన్నట్టుగా చూపిస్తున్నారు. ఇందులోనూ ఓ వృషభరాజాన్ని, వీరభద్రుడిగా భావించి గిరిజనులు కొలవడం అనేది ఉంది. క్లయిమాక్స్‌లో ఆ వీరభద్రుడితో పోరాట దృశ్యాలనూ చిత్రీకరించారు. అయితే అవి అంత ఎఫెక్టివ్‌గా లేవు. గిరిజనుల నమ్మకాలను గౌరవిస్తూ, వారి అవసరాలను తీర్చుతూ వారిని అభివృద్ధి పథంలోకి తీసుకు రావాలి తప్పితే, ఓట్లు రాజకీయాలలో పావులుగా వాడు కోవాలంటే ఇక మీదట కుదరదు అని ఈ సినిమా ద్వారా చెప్పే ప్రయత్నం దర్శకుడు చేశాడు.

నటీనటుల విషయానికి వస్తే.. నరేశ్ స్కూల్ టీచర్‌గా చక్కగా సెట్ అయ్యాడు. అలానే అతని తోటి ఎన్నికల అధికారిగా 'వెన్నెల' కిశోర్ నవ్వుల పువ్వులు పూయించాడు.

అడవి బిడ్డగా ఆనంది సహజ నటన ప్రదర్శించింది. ఇతర ప్రధాన పాత్రలను రఘుబాబు, శ్రీతేజ్, కుమనన్, సంపత్ రాజ్, ప్రవీణ్, రవిప్రకాశ్, నాగమహేశ్ తదితరులు పోషించారు. ఓటు అనే ఆయుధం ఎంత బలమైనదో చెబుతూనే, దానికి కూడా క్లిష్ట సమయాల్లోనే విలువ అనే అంశాలను ఆసక్తికరంగా చూపించారు. అయితే నాటకీయత మరీ ఎక్కువైన కారణంగా ఇది జనాలను మెప్పించడం కష్టమే. సినిమాలో ఉన్న సందేశం దృష్ట్యా ఓటీటీలో వచ్చినప్పుడు ఓసారి చూడొచ్చు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్






# ప్రధానిని అబ్బుర పరచిన నేతన్న

'రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఒక నేతన్న నాకు ఒక అపురూపమైన కానుక పంపారు. దానిని చూసి అబ్బురపడ్డాను' అని నవంబర్ 27వ తేదీ నాటి మన్ కి బాత్ కార్యక్రమంలో ప్రధాని వెల్ది హరిప్రసాద్‌ను కొనియాడారు. ప్రధాని మోదీకి హరిప్రసాద్ పంపిన కానుక భారతీయ చేనేత ప్రతిభకే కాదు, దేశ ప్రతిష్టనూ వినువీధులకు చేర్చేదే. త్వరలో భారత్ జి20 అధ్యక్ష స్థానం స్వీకరించబోతున్నది. ఆ వేదిక లోగో, అక్షరాలను హరిప్రసాద్ ఒక వస్త్రం మీద చిత్రించారు. అసలు జి20 అధ్యక్ష బాధ్యతలనే భారత్ చాలా ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నదని ప్రధాని చెప్పారు.

# దోమకొండ కోట పరిరక్షణకు పురస్కారం


దోమకొండ కోట


సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఇచ్చే ఆసియా పసిఫిక్ అవార్డులు రెండు తెలంగాణకు దక్కాయి. కుతుబ్ షాహీ గుమ్మటాల ప్రాంగణంలోని ఒక మెట్ల బావికి, కామారెడ్డి జిల్లా దోమకొండ కోటకు ఈ గౌరవం దక్కింది. నవంబర్ 26వ తేదీన ఈ అవార్డులను బ్యాంకాక్‌లో ప్రకటించారు.


మెట్ల బావి


From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 07



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.390/-




వెల : ₹.300/-





వెల : ₹.75/-





వెల : ₹.399/-





వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.499/-




వెల : ₹.695/-




వెల : ₹. 799/-




వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244